మంగళవారం 26.08.2025

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 133 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00



ఒకవైపు అభివృద్ధి, పారదర్శక పాలనకు చిరునామా అయిన చంద్రబాబు,లోకేష్... మరోవైపు అవినీతి, మాఫియా పాలనకు మారుపేరైన జగన్. ప్రజలు ఈ తేడాను గమనించాలి. గత ఐదేళ్ల జగన్ పాలన ఎలాంటి అన్యాయాలను చేసింది అనేది ప్రజలు బేరీజు వేసుకోవాలి.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



## వైద్యారోగ్య రంగంలో

# వినూత్న ఆవిష్కరణలు

ప్రజారోగ్య రంగంలో ఆవిష్కరణల కోసం భారత్ బయోడిజైన్ రీసెర్చ్ ఇన్నోవేషన్ ప్రోగ్రాం

రతన్ టాటా ఇన్నోవేషన్ తో కలిసి పని చేయనున్న బయోడిజైన్ రీసెర్చ్ కార్యక్రమం

ఏఐ, మెడ్ టెక్ అలయన్స్ ఫౌండేషన్-స్టాన్ ఫోర్డ్ సహకారంతో భారత్ బయోడిజైన్ రీసెర్చ్ ఇన్నోవేషన్ ప్రోగ్రాం

వైద్యారోగ్య రంగంలో పరిశోధన, శిక్షణ, స్టార్టప్ లు, ఇంక్యుబేషన్ లో సహకారం కోసం ఎంఓయూ

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** వైద్యారోగ్య రంగంలో వినూత్న ఆవిష్కరణల కోసం భారత్ బయోడిజైన్ రీసెర్చ్ ఇన్నోవేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. అమరావతిలోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ లో అంతర్భాగంగా ఈ రీసెర్చి ఇన్నోవేషన్ కార్యకలాపాలు ఉంటాయని ఆయన అన్నారు. ఏఐ, మెడ్ టెక్ అలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆసియా-పసిఫిక్ బయోడిజైన్ అలయన్స్, అమెరికాలోని ప్రతిష్టాత్మక స్టాన్ ఫోర్డ్ బయోడిజైన్ సంయుక్త భాగస్వామ్యంలో దీనిని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆరోగ్య రంగంలో పరిశోధనలు, ఆవిష్కరణలను ప్రోత్సహించేలా భారత్ బయో డిజైన్ రీసెర్చ్ ఇన్నోవేషన్ దృష్టి సారించనుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెడికల్ టెక్నాలజీ రంగాల్లో, నూతన ఆవిష్కరణలకు మార్గం సుగమం చేయడమే లక్ష్యంగా పని చేయనుంది. అంతర్జాతీయ, స్థానిక నైపుణ్యాలను సమన్వయం చేయటం ద్వారా ప్రజారోగ్య రంగంలో బ్రెయిన్ కార్యక్రమం గణనీయమైన మార్పులను తీసుకువచ్చే అవకాశం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో ఆసియా పసిఫిక్ బయోడిజైన్ అలయన్స్ కు చెందిన వేర్వేరు దేశాల వైద్య నిపుణులతో సీఎం సమావేశం అయ్యారు. ఈ ప్రాజెక్టు ద్వారా మెడికల్ టెక్నాలజీ రంగంలో కొత్త స్టార్టప్ లతో పాటు పరిశోధనలు, నిపుణులకు ప్రోత్సాహం లభిస్తుందన్నారు. మిగతా 2లో...

## స్త్రీ శక్తి .. గ్రాండ్ సక్సెస్



ఉచిత బస్సులకు త్వరలో లైవ్ ట్రాకింగ్

స్త్రీ శక్తి బస్సులకు రెండు వైపులా బోర్డులు పెట్టండి

ఆర్టీసీపై సమీక్షలో సీఎం చంద్రబాబు

2 లో

## మండలానికో 'జన ఔషధి'

అమరావతిలో నేచరోపతి యూనివర్సిటీ...

త్వరలో 'యోగా ప్రచార పరిషత్'

'ఆరోగ్య రథం'తో మొబైల్ వైద్యసేవలు

రాష్ట్రమంతటా ఉచిత వైద్య పరీక్షలు

వైద్యారోగ్య శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

ఎన్టీఆర్ బేబీ కిట్స్ పరిశీలన...

త్వరలోనే అమలుకు ఆదేశాలు

3 లో

## సబ్సిడీ నుంచి స్కూటర్ వరకు!

- మెప్మా సహకారం, ర్యాపిడో చొరవతో ఉపాధి పొందిన 1003 మహిళలు
- తొమ్మిది నగరాల్లో సేవలు.. 3 నెలల్లో రూ.35 లక్షల ఆదాయం
- మహిళా సాధికారతే ప్రాధాన్యమన్న మంత్రి లోకేష్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ మహిళలు సరికొత్త మార్గంలో పయనిస్తున్నారు. మెప్మా సహకారంతో స్వయం ఉపాధి పొందుతూ వారి కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నారు. చేతిలోని స్మార్ట్ ఫోన్ ఉపయోగిస్తూ, ఎలక్ట్రిక్ స్కూటర్ నడుపుతూ సొంతంగా సంపాదిస్తున్నారు. రాష్ట్రంలోని విజయవాడ, విశాఖపట్నం, నెల్లూరు తదితర నగరాల్లో మహిళలు కేవలం ఇంటికే పరిమితం కాకుండా సొంత కాళ్లపై నిలబడేందుకు ర్యాపిడో ద్వారా కుటుంబానికి అదనపు ఆదాయం సమకూర్చుకుంటున్నారు.

**'ఒక కుటుంబం - ఒక వ్యాపారవేత్త' స్ఫూర్తి :** మహిళల స్వయం ఉపాధికి తొలి అడుగు ఈ ఏడాది మార్చి 8న, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పడింది. అదే రోజున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించడంతో మొదలైంది. ముఖ్యమంత్రి మానస పుత్రికగా ప్రారంభించిన "ఒక కుటుంబం - ఒక వ్యాపారవేత్త" కింద మిషన్ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ పావర్టీ ఇన్ మునిసిపల్ ఏరియాస్ (మెప్మా) సంస్థ ర్యాపిడో ద్వారా మహిళలకు ఎలక్ట్రిక్ వాహనాలు అందించింది. అందులో భాగంగా తొలి దశలో తొమ్మిది పట్టణాల్లో 1000 మంది లబ్ధిదారులకు రుణ సౌకర్యం కల్పించారు. వీటిలో విశాఖపట్నంలో 400 వాహనాలు , విజయవాడలో 400, నెల్లూరు, గుంటూరులో 50 చొప్పున, కర్నూలు, తిరుపతి, కాకినాడ, రాజమండ్రిలో 25 వాహనాలు చొప్పున మహిళలకు అందజేశారు. వీటిలో 760 ఎలక్ట్రిక్ టూ-వీలర్లు కాగా, 240 ఎలక్ట్రిక్ త్రీ-వీలర్లు ఉన్నాయి.

**డ్వాక్రా, మెప్మా సహకారంతో.. :** ఈ వాహనాలు కొనుగోలు చేసేందుకు అవసరమైన బ్యాంకు రుణాలు డ్వాక్రా సంఘాల మహిళల పేర్లతో మంజూరయ్యాయి. డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి వారి కుటుంబ సభ్యులు వాహనం నడిపేందుకు అవకాశం కల్పించారు. ఇందుకోసం అవసరమైన ప్రాజెక్ట్ రిపోర్టులను మెప్మా సిద్ధం చేసి, జాతీయ బ్యాంకుల ద్వారా రుణాలు పొందేలా సహకారం అందించింది. ఈ క్రమంలో ర్యాపిడో సైతం మహిళలకు సాధికారతనందించడంలో భాగస్వామ్యం కావడం విశేషం. మిగతా 2లో...

## రిజర్వాయర్లకు జలకళ



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న సమర్థ నీటి నిర్వహణ సత్ఫలితాలను ఇస్తోంది. నీటి నిర్వహణపై సీఎం చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. ఇరిగేషన్ అధికారులకు ఇదే విషయంపై చంద్రబాబు దిశా నిర్దేశం చేస్తూనే ఉన్నారు. ప్రతీ వర్షపు చుక్కనూ ఒడిసి పట్టాలన్న లక్ష్యం మేరకు ఓవైపు రిజర్వాయర్లను నింపుతూనే మరోవైపు అన్ని నదీ బేసిన్ల ఆయకట్టుకు నీరిచ్చేలా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. దానికి అనుగుణంగా ఈసారి కృష్ణా, గోదావరి, వంశధార, పెన్నా నదీ బేసిన్లలో అన్ని రిజర్వాయర్లలోనూ కలిపి ప్రస్తుతం 80 శాతం మేర నీటి నిల్వలు ఉన్నాయి. కృష్ణా నదిపై ప్రధాన ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జున సాగర్, పులి చింతల ప్రాజెక్టులు గత నెలలోనే నిండాయి. పైనుంచి నిరంతర వరద ప్రవాహాలు కొనసాగుతుండడంతో వచ్చిన నీటిని వచ్చినట్లు కిందికి పంపుతున్నారు. ఇదే సమయంలో ఆయా ప్రాజెక్టుల నుంచి గరిష్ట మొత్తంలో నీటిని వివిధ లిఫ్టుల ద్వారా, కాలువల ద్వారా ఇతర రిజర్వాయర్లకు, చెరువులకు, పంటలకు మళ్లిస్తున్నారు. ఈ ఏడాది జులై నెలలోనే కృష్ణాకు భారీ వరద రావడంతో పెద్ద ఎత్తున నీటిని కి సీమ ప్రాంతానికి తరలించి ప్రాజెక్టులు నింపుతున్నారు. మిగతా 2లో...

## నర్సింగ్ కోర్సుకు ఎంట్రన్స్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ప్రతిభ కలిగిన విద్యార్థులకు పెద్దపీట వేయడంతోపాటు, నాలుగేళ్ల వ్యవధితో కూడిన బియస్సీ నర్సింగ్ కోర్సు ప్రవేశాల్లో అవకతవకలకు తావులేకుండా చూసేందుకు కూటమి ప్రభుత్వం సంస్కరణలు ప్రవేశపెట్టింది. 2025-26 విద్యా సంవత్సరంలో జరిగే ప్రవేశాలతో ఈ సంస్కరణలు అమల్లోకి రానున్నాయి.

ఈ మేరకు బియస్సీ (నర్సింగ్) కోర్సులో ప్రవేశాలకు సంబంధించి 1998లో జారీ అయిన జీఓ నంబరు 145 మరియు 2023లో జారీ అయిన జీఓ నంబరు 41ల్లో తగు మార్పులు చేయడానికి వైద్యారోగ్య శాఖామంత్రి సత్యకుమార్ యాదవ్ ఆమోదం తెలిపారు. మిగతా 2లో...

## పాక్‌ను అలర్ట్ చేసిన భారత్..!



**ఢిల్లీ:** భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతోన్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. వరదలపై దాయాదిని న్యూఢిల్లీ అలర్ట్ చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు కొన్ని మీడియా కథనాలను ఉటంకిస్తూ పీటీఐ కథనం వెల్లడించింది. ఇరు దేశాల మధ్య సింధూ నదీ జలాల ఒప్పందం అమలు నిలిచిపోయినప్పటికీ.. వరదలపై పాక్ ను భారత్ అప్రమత్తం చేసి మానవత్వాన్ని చాటుకుంది. భారీ వర్షాల కారణంగా మిగతా 2లో...

## అందుబాటులో ఎరువులు!




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలోని రైతులకు ఎరువుల సరఫరా విషయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా, పంటలకు అవసరమైన ఎరువులు సమయానికి అందేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఖరీఫ్ 2025 సీజన్‌లో ఎరువుల అవసరం, సరఫరా, నిల్వలు, కేంద్రం%-%రాష్ట్రం సమన్వయం, రైతులకు ఇచ్చిన హామీలపై మంత్రి అచ్చెన్నాయుడు విస్తృతంగా వివరణ ఇచ్చారు. ఖరీఫ్ సీజన్‌కు 31.15 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువుల అవసరంగా అంచనా వేయబడి, ఇప్పటి వరకు 21.34 లక్షల మెట్రిక్ టన్నులు రాష్ట్రానికి చేరాయని తెలిపారు. అందులో యూరియా, డీఏపీ , ఎంఓపీ, ఎస్ఎస్‌పీ, కాంప్లెక్స్ ఎరువులు కలిపి 6.22 లక్షల మెట్రిక్ టన్నులు రైతులకు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయని చెప్పారు. రాష్ట్రం మొత్తం రైతుల అవసరాలను బట్టి జిల్లాల వారీగా సరఫరాలను సక్రమంగా పర్యవేక్షిస్తున్నామని వివరించారు.

**బఫర్ స్టాక్ ఏర్పాటు - భవిష్యత్ ప్రణాళిక :** రైతులకు ఎరువుల కొరత రాకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుని 1.10 లక్షల మెట్రిక్ టన్నుల బఫర్ స్టాక్ ఉంచిందని మంత్రి తెలిపారు. గోదావరి వరదల వల్ల కొన్ని ప్రాంతాల్లో రవాణా సమస్యలు తలెత్తినప్పటికీ, రైతులకు ఎరువులు సమయానికి అందేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఇంకా 79,633 మెట్రిక్ టన్నులు డిపోలలో నిల్వగా ఉండగా, అవసరమైన ప్రాంతాలకు తరలింపులు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

**కేంద్రం - రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో పంపిణీపై కఠిన పర్యవేక్షణ :** ఎరువుల సరఫరాలో కేంద్రం-రాష్ట్రం సమన్వయంతో 50:50 నిష్పత్తిలో పంపిణీ జరుగుతోందని మంత్రి స్పష్టం చేశారు. మిగతా 2లో...

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**మచిలీపట్నం (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో చౌక దుకాణాల ద్వారా పారదర్శకంగా నిత్యావసర సరుకులు పొందుట కోసం స్మార్ట్ రైస్ కార్డులు ఎంతగానో ఉపయోగపడతాయని రాష్ట్ర పౌరసరఫరాలు శాఖ మంత్రివర్యులు నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు

సోమవారం మధ్యాహ్నం రాష్ట్ర మంత్రివర్యులు రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ సౌరబ్ గౌర్ , సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ లతో కలసి పెనమలూరు నియోజకవర్గం లోని పోరంకి బిజేఆర్ నగర్ లో లబ్ధిదారుల ఇంటింటికి తిరిగి వారికి స్మార్ట్ రైస్ కార్డులను పంపిణీ చేశారు.

అనంతరం మంత్రివర్యులు పోరంకి డీలర్ సిహెచ్ దుర్గారాణి చౌక దుకాణాన్ని తనిఖీ చేసి అందులో ఉన్న స్టాకు వివరాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా మంత్రివర్యులు మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఈ రోజు రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొనిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పౌర సదపరాల శాఖలో అనేక సంస్కరణలు చేపట్టిందన్నారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రంలో కొత్తగా ఒక కోటి 46 లక్షల గృహాలకు గాను 4.42 కోట్ల స్మార్ట్ రైస్ కార్డులు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ స్మార్ట్ రైస్ కార్డు వలన చాలా ప్రయోజనాలు ఉన్నాయని, ముఖ్యంగా పారదర్శకంగా నిత్యవసర సరుకులు పొందడంతో పాటు కార్డులో ఉన్న క్యూఆర్ కోడ్ కు స్కాన్ చేస్తే మనం తీసుకున్న నిత్యవసర సరుకుల సమాచారం ఫోన్ లోకి వస్తుందన్నారు.

ఏ సమయంలో ఏ సరుకులు తీసుకున్నారో తెలుస్తుందన్నారు.

నూతన సంస్కరణల వలన చౌక దుకాణం డీలర్ నుండి ప్రతినెల 1వ తేదీ నుండి 15వ తేదీ వరకు నిత్యవసర సరుకులు లబ్ధిదారులకు కావలసిన సమయంలో పొందే అవకాశం వచ్చిందన్నారు. మిగతా 3లో...

## చేనేతకు గుర్తింపు తెస్తాం



**విజయవాడ,(జర్నలిస్ట్ ఫైల్):** ఇండియన్ హ్యాండ్ మేడ్ తో తయారైన చేనేత మరియు హస్తకళలకు ప్రపంచ వ్యాప్తంగా మరింత గుర్తింపు తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని చేనేత, హస్తకళల అభివృద్ధికి గౌరవ సలహాదారు సుచిత్ర ఎల్ల తెలిపారు. "గాంధీ బునకర్ మేళా"ను (జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన - 2025) ను విజయవాడ శ్రీ శేష సాయి కళ్యాణ వేదికలో సోమవారం సలహాదారు సుచిత్ర ఎల్ల, చేనేత మరియు జౌళి శాఖ కమిషనర్ జి. రేఖా రాణి, 8 వ డివిజన్ కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి లతో కలిసి ప్రారంభించారు. జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన - 2025 ను ప్రారంభించిన అనంతరం జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం చేనేత వస్త్ర ప్రదర్శనలో ఏర్పాటు చేసిన వివిధ ప్రాంతాలకు చెందిన స్టాల్స్ ను ఆసక్తిగా గమనించారు. అంతేకాకుండా ఒక్కో చీర తయారీకు ఎన్ని రోజులు పడుతుంది, ఎంత మంది చీర తయారీలో పాల్గొంటారు అని స్టాల్స్ నిర్వాకులను అడిగి తెలుసుకున్నారు. మిగతా 2లో...

# నర్సింగ్ కోర్సుకు ఎంట్రన్స్

(మొదటి పేజీ తరువాయి)

ఈ విషయానికి సంబంధించి ఉన్నతాధికారులతో పలు అంశాలను సమీక్షించి మంత్రి ఆమోదం తెలిపారు.

**నూతన సంస్కరణలు :** ఇప్పటి వరకు నాలుగేళ్ల బియస్సీ(నర్సింగ్) కోర్సులో ఎంసెట్ ర్యాంకుల ఆధారంగాను, ఇంటర్మీడియేట్ మార్కుల ప్రాతిపదికన ప్రవేశాలు జరిగాయి. మొదటిసారిగా గత ఏడాది జులైలో బియస్సీ(నర్సింగ్)లో ప్రవేశాల కోసం ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ కామన్ ఎగ్జామినేషన్ టెస్ట్‌ను(ఎపిఎన్ సెట్) డాక్టర్ ఎన్టీఆర్ వైద్య విజ్ఞాన విశ్వవిద్యాలయం నిర్వహించింది. ఈ పరీక్షలో వచ్చిన ర్యాంకుల ఆధారంగా ఈ విద్యా సంవత్సరంలో ప్రవేశాలు జరుగుతాయి. ఇప్పటి వరకు ప్రైవేట్ కళాశాలల్లో కన్వీనర్ కోటాలో ప్రవేశాలను డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నిర్ణయిస్తూ ఉండగా...మేనేజ్‌మెంట్ కోటాలో ప్రవేశాలను ఆయా కళాశాలల యాజమాన్యాలు నిర్ణయించేవి. తద్వారా ప్రతిభ తక్కువ కలిగిన విద్యార్థులకు, ఇతర రాష్ట్రాల వారికి మేనేజ్‌మెంట్ కోటాలో ప్రవేశాలు లభించేవని ఆరోపణలొచ్చాయి. : ఈ నేపథ్యంలో...ప్రభుత్వ, ప్రైవేట్ నర్సింగ్ కళాశాలల్లో కన్వీనర్ కోటాలో ప్రవేశాలతో పాటు ప్రైవేట్ నర్సింగ్ కళాశాలల్లోని మేనేజ్‌మెంట్ సీట్లకు కూడా డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆన్‌లైన్ వెబ్ కౌన్సిలింగ్ ద్వారా ప్రవేశాలు చేపట్టనుంది. విశ్వవిద్యాలయం నియమించే సెలక్షన్ కమిటీ ప్రతిభ ఆధారంగా ఎంపిక చేసిన విద్యార్థులనే మేనేజ్‌మెంట్ సీట్లలో చేర్చుకోవాల్సి ఉంటుంది. ఈ సంస్కరణతో ప్రతిభ కలిగిన విద్యార్థులకు నర్సింగ్ కోర్సులో ప్రవేశాలు లభిస్తాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

**ప్రవేశానికి అర్హతలు :** నాలుగేళ్ల బియస్సీ(నర్సింగ్) కోర్సులో ప్రవేశం పొందడానికి...సాధారణ తరగతులకు(అన్ రిజర్వ్‌డ్) చెందిన వారు ఎపిఎన్‌సెట్ పరీక్ష రాసిన వారిలో 50 పర్సంటైల్‌లో ఉండాలి(అనగా ఎపిఎన్‌సెట్ పరీక్షరాసిన వారిలో 50 శాతం వారు పొందిన మార్కుల కంటే ఎక్కువ పొంది ఉండాలి). సాధారణ తరగతులకు చెందిన దివ్యాంగులు 45 పర్సంటైల్ లో ఉండాలి(45 శాతం వారు సాధించిన మార్కుల కంటే ఎక్కువ పొంది ఉండాలి). ఎస్సీ,ఎస్టీ, ఓబీసీ తరగతులకు చెందిన వారు, ఈ తరగతులకు చెందిన దివ్యాంగులు 40 పర్సంటైల్ లో ఉండాలి.

రాష్ట్రంలో బియస్సీ(నర్సింగ్) విద్యను అందించే కళాశాలల్లో మొత్తంగా 13,726 సీట్లుండగా... 2024-25 విద్యా సంవత్సరంలో కన్వీనర్ కోటాలో 6,441 మంది విద్యార్థులు ప్రవేశాలు తీసుకోగా, మేనేజ్‌మెంట్ కోటాలో 5,144 మంది ప్రవేశాలు పొందారు. 2,141 సీట్లు మిగిలిపోయాయి. కన్వీనర్ కోటా ప్రవేశాల్లో రిజర్వేషన్ నియమాలు వర్తిస్తాయి. మేనేజ్‌మెంట్ సీట్లలో రిజర్వేషన్లు ఉండవు.

# పాక్‌ను అలర్ట్ చేసిన భారత్..!

(మొదటి పేజీ తరువాయి)

జమ్మూకశ్మీర్‌లోని తావి నది ఉప్పొంగే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అంచనా వేసింది. అదే జరిగితే పాకిస్థాన్‌లో వరదలు సంభవించే ముప్పు ఉంది. దీంతో ఇస్లామాబాద్‌లోని భారత హైకమిషన్ పాక్ అధికారులకు దీనిపై సమాచారం ఇచ్చినట్లు ఆ దేశంలోని జియో న్యూస్, ది న్యూస్ ఇంటర్నేషనల్ వంటి మీడియాల్లో కథనాలు వచ్చాయి. అంతకుముందు ఇలాంటి సమాచారాన్ని సింధూ నది జలాల ఒప్పంద కమిషనర్ పంచుకునేవారు.

ఇప్పుడు దౌత్య కార్యాలయం పాక్‌ను అప్రమత్తం చేసినట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. భారత్ అందించిన సమాచారంతో పాక్ యంత్రాంగం తమ ప్రజలకు హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిపాయి. అయితే, దీనిపై భారత్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడి జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఘటనతో దాయాదిపై తీవ్రంగా మండిపడిన భారత్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. 1960 నుంచి ఇరు దేశాల మధ్య అమల్లో ఉన్న సింధూ నదీ జలాల ఒప్పందాన్ని నిలిపివేసింది. ఇదిలా ఉండగా.. పాకిస్థాన్‌లో గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వరదలు సంభవించాయి. జూన్ 26 నుంచి ఇప్పటివరకు 780 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా.. మరో వెయ్యి మందికి పైగా గాయపడ్డారు.

# అందుబాటులో ఎరువులు!

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రం నుండి ఇప్పటి వరకు 3.50 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించగా, అందులో 1.30 లక్షల మెట్రిక్ టన్నులు చేరాయని, 0.47 లక్షల మెట్రిక్ టన్నులు రాబోతున్నాయని తెలిపారు. ఆగస్టు నెలలో 1.65 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించగా, అందులో 0.75 లక్షల మెట్రిక్ టన్నులు ఇప్పటికే రాష్ట్రానికి చేరాయని, మిగిలిన 0.90 లక్షల మెట్రిక్ టన్నులు గంగవరం, కాకినాడ, విశాఖపట్నం, ఒరిస్సా పోర్టుల ద్వారా త్వరలో చేరనున్నాయని వివరించారు. రైతులకు ఎరువులు పారదర్శకంగా, సమయానికి అందించేందుకు ఇంటిగ్రేటెడ్ ఫెర్టిలైజర్ మేనేజ్మెంట్ సిస్టం iFMS ద్వారా పర్యవేక్షణ కొనసాగుతోందని మంత్రి తెలిపారు. ఈ విధానం వల్ల ఎరువుల నిల్వలు, అవసరాలు, పంపిణీపై రియల్ టైమ్ సమాచారం అందుతుందని చెప్పారు. జిల్లా స్థాయి అధికారులు, సహకార సంఘాలు, వ్యవసాయ శాఖ సంయుక్తంగా సమన్వయం చేసుకుంటూ ఎరువుల కొరత రాకుండా చర్యలు తీసుకుంటున్నారని వివరించారు.

**రైతులకు హామీ - భరోసా :** ప్రస్తుతం రాష్ట్రంలో 6.48 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దని మంత్రి స్పష్టం చేశారు. రైతులు సాగు కొనసాగించడానికి కావలసినంత ఎరువులు సకాలంలో అందుతాయని హామీ ఇచ్చారు. వర్షాల ప్రభావంతో కొన్నిచోట్ల రవాణా ఆలస్యం జరిగినా, రైతులకు ఇబ్బంది కలగకుండా తక్షణ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వర్షాల వలన దెబ్బతిన్న ప్రాంతాల్లో పంటలకు ప్రత్యేక అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎరువులు అందిస్తున్నామని చెప్పారు. మార్కెట్లో కొందరు మధ్యవర్తులు అధిక ధరలకు ఎరువులు అమ్మే ప్రయత్నాలు చేస్తే, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నల్లబియ్యం, అరటి, చెరకు వంటి ప్రత్యేక పంటలకు తగిన ఎరువులు సరఫరా అయ్యేలా ప్రత్యేకంగా పర్యవేక్షణ జరుగుతోందని తెలిపారు. రైతుల సంఘాలు, సహకార సంఘాలు, మార్కెటింగ్ సొసైటీల ద్వారా ఎరువుల సరఫరా వేగంగా జరుగుతోందని వివరించారు. అన్నదాతలు ఎలాంటి ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం పంట అవసరాలను దృష్టిలో ఉంచుకొని అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. కేంద్రం సహకారంతో రాష్ట్రంలోని ప్రతి రైతుకి ఎరువులు అందేలా కృషి చేస్తున్నామని అని మంత్రి అచ్చెన్నాయుడు పునరుద్ఘాటించారు.

## ఫైర్ సేఫ్టీ నిబంధనలను విధిగా పాటించాలి

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** వినాయక చవితి పర్వదినము నేపథ్యంలో మంగళగిరి పట్టణంలో గణేష్ ఉత్సవ నిర్వహణ మండపాల వద్ద నిర్వాహకులు ఫైర్ సేఫ్టీ, ఎలక్ట్రిసిటీ నిబంధనలను విధిగా పాటించాలని మంగళగిరి పట్టణ సీఐ వీరా స్వామి సూచించారు. ఇందులో భాగంగా ఇసుక బస్తాలను, నీటి బకెట్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సోమవారం ఉదయం పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో మాట్లాడుతూ, మండపాలు ఏర్పాటు చేసే వారు స్థల యజమానుల నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని కోరారు. వారికి నిర్దేశించిన సమయంలో మాత్రమే గణేష్ విగ్రహాలను నిమజ్జనానికి తరలించాలని పేర్కొన్నారు. గణేష్ ఉత్సవ మండపాల వద్ద మద్యం సేవించి ఎవరైనా హడావుడి చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. గణేష్ మండపాల వద్ద పేకాట ఆడటం అల్లర్లకు దిగటం స్థానికులకు అసౌకర్యాన్ని కలిగించటం ట్రాఫిక్ సమస్యను సృష్టించటం వంటి చర్యలకు పాల్పడవద్దన్నారు. గణేష్ మండపాల వద్ద నిమజ్జన ఊరేగింపు కార్యక్రమంలో అనుమానిత వ్యక్తులు సంకరిస్తే సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలన్నారు. మండపాల వద్ద బాణాసంచా పేలుళ్లు, డిజె శబ్దాలకు అనుమతి లేదన్నారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలను జరుపుకోవాలని సూచించారు.

# వైద్యారోగ్య రంగంలో వినూత్న ఆవిష్కరణలు

(మొదటి పేజీ తరువాయి)



తద్వారా ఏపీ నాలెడ్జి ఎకానమీ, ఆవిష్కరణల కేంద్రంగా ఎదుగుతుందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.

**మెడ్ టెక్ ఆవిష్కరణలు- పరిశోధనలు :** ఆస్ట్రేలియా, అమెరికా, ఇజ్రాయెల్, జపాన్, సింగపూర్, తైవాన్, ఐర్లాండ్ తదితర దేశాలకు చెందిన వైద్య నిపుణులు ఆయా దేశాల్లో బయోడిజైన్ కార్యకలాపాలపై ముఖ్యమంత్రికి ప్రజెంటేషన్ ఇచ్చారు. ఏఐ,మెడ్ టెక్ అలయన్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ రాకేష్ కలపాల, స్టాన్‌ఫర్డ్ సెంటర్ ఫర్ బయోడిజైన్ ప్రొఫెసర్ అనురాగ్ మైరల్, ఆసియా పసిఫిక్ బయోడిజైన్ సహాధ్యక్షుడు డాక్టర్ యోనా వైస్‌బచ్, బయోడిజైన్ ఆస్ట్రేలియా ఛైర్ ప్రొఫెసర్ కెవిన్ ఫ్లెగర్, టోక్యో బయోడిజైన్ ప్రతినిధి యూరియోన్ కొబయాషి, తైవాన్ బయోడిజైన్ నుంచి జేమ్స్ చియెన్-హియా ట్సెంగ్, సింగపూర్ నేషనల్ యూనివర్శిటీ అసోసియేట్ ప్రొఫెసర్ మార్క్ చాంగ్, మిరాయ్ మెడికల్ సహ వ్యవస్థాపకుడు కొలిన్ ఫోర్డే తదితరులు ముఖ్యమంత్రికి తమ దేశాల్లో అనుసరిస్తున్న విధానాలను వివరరించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌ను వైద్యారోగ్య రంగంలో ఆవిష్కరణలకు, మెడ్‌టెక్ పరిశోధనలకు కేంద్రంగా అభివృద్ధి చేయాలనే రోడ్‌మ్యాప్ పై ముఖ్యమంత్రి చర్చించారు. వైద్యారోగ్య రంగంలో పరిశోధన, శిక్షణ, సాంకేతిక బదిలీ స్టార్టప్, ఇంక్యుబేషన్ తదితర రంగాల్లో సహకారం అందించే అంశంపై గ్లోబల్ నిపుణులు - ఏపీ ప్రభుత్వం మధ్య అవగాహనా ఒప్పందం కుదిరింది. ప్రత్యేకించి యూనివర్సిటీ ఆఫ్ వెస్ట్రన్ ఆస్ట్రేలియా ఎయిమ్ ఫౌండేషన్ మధ్య ఒప్పందం కుదిరింది. ఒప్పందంతో భారత్ బయోడిజైన్ - బయోడిజైన్ ఆస్ట్రేలియాలు ఉమ్మడిగా పనిచేయనున్నాయి. వైద్యారోగ్య రంగంలో సాంకేతిక పరిజ్ఞానం బదిలీ, విద్యార్థులకు ప్రత్యేక కోర్సులను నిర్వహించేలా ఈ ఒప్పందం సహకరించనుంది.

**భారత్ బయోడిజైన్ రీసెర్చ్ ఇన్నోవేషన్ కార్యక్రమం :** ఆంధ్రప్రదేశ్ ను గ్లోబల్ హెల్త్ టెక్నాలజీ, డిజిల్ హెల్త్ ఇన్నోవేషన్ హబ్ గా తీర్చిదిద్దే అంశంపై భారత్ బయోడిజైన్ రీసెర్చ్ ఇన్నోవేషన్ కార్యక్రమం ప్రధానంగా పనిచేయనుంది. ముందస్తు విశ్లేషణల ద్వారా వ్యాధుల సంక్రమణను నియంత్రించటం, ముందస్తుగా ఆరోగ్య భద్రతా కార్యక్రమాలు, తక్కువ వ్యయంతో ఆరోగ్య సేవల్ని ప్రజలకు అందించే అంశాలపై దృష్టి సారించనుంది. ఆదే సమయంలో అంతర్జాతీయ బయో డిజైన్ ఎకోసిస్టంలను -భారత్ లో ఉన్న భాగస్వాములను అనుసంధానించటంపైనా ఈ ఒప్పందం సహకరించనుంది. ప్రపంచ వ్యాప్తంగా అనుసరిస్తున్న ఉత్తమ విధానాల్ని ఏపీలో అమలు చేయటం, బయోడిజైన్ లో శిక్షణ, పరిశోధనా రంగాల్లో అంతర్జాతీయ సహకారం, ప్రజారోగ్య రంగంలో ఆవిష్కరణల్ని, స్టార్టప్ లను ప్రోత్సహించటం లాంటి అంశాలపై దృష్టి పెట్టనుంది. దీంతో పాటు గ్రామీణ పట్టణ ప్రాంతాల్లోని ఆరోగ్య సమస్యలకు సాంకేతిక పరిష్కారాలను కూడా అందించేలా సమావేశంలో చర్చించారు. వీటితో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ఆరోగ్య సేవలు అందించే అంశంతో పాటు చౌకగా మెడ్ టెక్ పరికరాలు, వైద్యారోగ్య రంగంలో పనిచేస్తున్న సిబ్బందికి శిక్షణ తదితర అంశాలపైనా దృష్టి పెట్టనున్నారు.

**ప్రజారోగ్యంలో డిజినెర్వ్ సెంటర్ :** ప్రజారోగ్యంలో ఇప్పటికే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి వైద్య సేవలు అందించేలా కార్యక్రమాన్ని చేపట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. చిత్తూరు జిల్లా కుప్పంలో టాటా- గేట్స్ ఫౌండేషన్ లతో కలిసి డిజినెర్వ్ సెంటర్ ను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి ఏరియా ఆస్పత్రిని అనుసంధానించి ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నామని స్పష్టం చేశారు. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా డిజినెర్వ్ సెంటర్ సేవలు విస్తరిస్తామని తెలిపారు. ఆధునిక వైద్య సేవలతో పాటు భారతీయ సంప్రదాయ వైద్య విధానాలైన యోగా, నేచురోపతిని కూడా ప్రజారోగ్యం కోసం అనుసంధానిస్తున్నామని తెలిపారు. విశాఖలోని ఏపీ మెడ్ టెక్ జోన్ కూడా ఆధునిక వైద్య పరికరాల తయారీలో కీలకంగా ఉందని సీఎం స్పష్టం చేశారు. ప్రస్తుత ఒప్పందంతో వైద్యారోగ్య రంగంలో విప్లవాత్మక ఆవిష్కరణలు సాధ్యం అవుతాయని సీఎం వ్యాఖ్యానించారు. ఈ సమావేశానికి వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, వైద్యారోగ్యం కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జి.వీరపాండియన్, ఈడీబీ సీఈఓ సాయికాంత్ వర్మ తదితరులు హాజరయ్యారు.

# సబ్సిడీ నుంచి స్కూటర్ వరకు!

(మొదటి పేజీ తరువాయి)

కొత్తగా చేరిన వారికి ప్లాట్‌ఫామ్ ఫీజులో మూడు నుంచి నాలుగు నెలల మినహాయింపు ఇచ్చారు. అలాగే తొలి సంవత్సరం టూ-వీలర్, త్రీ-వీలర్ యజమానులకు నెలకు వెయ్యి రూపాయల ఈఎంఐ మొత్తాన్ని సాయంగా అందించారు. దీంతో ర్యాపిడో నడపడం ప్రారంభించిన గృహిణులకు తొలి రోజు నుంచే ఆదాయం ప్రారంభమైంది. అలాగే ఈఎంఐ, ఇంధన భారం కూడా తగ్గింది. దీనిలో భాగంగా ఇప్పటివరకు 1003 కుటుంబాలు లబ్ధి పొందగా, వారిలో 688 మంది ర్యాపిడోలో నమోదు అయ్యారు.

**మహిళల విజయగాథలు :** విజయవాడకు చెందిన వడ్లపూడి గ్లోరీ మంజు మార్చిలో ప్రభుత్వ సబ్సిడీతో స్కూటర్ కొనుగోలు చేసి ర్యాపిడో నడపడం ప్రారంభించారు. ప్రస్తుతం నెలకు పది వేల వరకు సంపాదిస్తున్నారు. "ఇంటిపనులు పూర్తి చేసిన తర్వాత కొద్ది గంటలు ర్యాపిడో నడిపి వాహనం ఈఎంఐ మొత్తాన్ని చెల్లిస్తున్నాను. అలాగే కొంత సొమ్మును పొదుపు చేస్తున్నాను. సొంత కాళ్లపై నిలబడటం ద్వారా వస్తున్న ఆదాయం కన్నా ఆర్థిక స్వాతంత్ర్యం లభించడంతో సంతోషం అనిపిస్తోంద"ని మంజు చెబుతున్నారు.

విజయవాడలోని కండ్రిక ప్రాంతానికి చెందిన మాధవి తన భర్తకు పక్షవాతం రావడంతో కుటుంబ బాధ్యతలను తాను స్వీకరించారు. "ఎస్సీ వర్గానికి చెందిన నేను బ్రహ్మానందరెడ్డిని ప్రేమ వివాహం చేసుకున్నాను. ఆయనకు పక్షవాతం వచ్చిన తర్వాత ప్రభుత్వం ఇచ్చే రూ. 6,000 దివ్యాంగ పెన్షన్ మందులకు సరిపోతోంది. ఈ సమయంలో మెప్మా ద్వారా రుణం పొంది ఆక్టివా టూ-వీలర్ కొన్నాను. ర్యాపిడో వాహనం నడుపుతూ నెలకు రూ. 12 వేల వరకూ సంపాదిస్తున్నాను. ఈఎంఐ చెల్లించడంతోపాటు ఇంటిని నడపడానికి ఆ ఆదాయం తోడ్పడుతోంద"ని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

విజయవాడకు చెందిన 45 ఏళ్ల బాడిస భవాని భర్త అనారోగ్యం బారిన పడటంతో ఇంటికే పరిమితమయ్యారు. ఇంటి బాధ్యతను తలకెత్తుకున్న భవాని ఆదాయం సంపాదించాలని ఆలోచించారు. అదే సమయంలో మెప్మా అందిస్తున్న సహాయం గురించి తెలుసుకుని, అధికారుల సహకారంతో రూ. 1.20 లక్షల విలువైన ఈ-స్కూటర్ కొనుగోలు చేసి ర్యాపిడోలో చేరారు. ప్రస్తుతం రోజుకు రూ. 500 నుంచి రూ. 700 వరకు సంపాదిస్తున్నానని ఇప్పుడు కుటుంబ పోషణ అనేది తనకు సమస్యే కాదని ఆనందంగా చెబుతున్నారు.

**ప్రభుత్వ సహకారంతో.. :** మహిళా సాధికారత కోసం ప్రభుత్వం ఎలక్ట్రిక్ స్కూటర్‌లకు రూ. 12,300 నుంచి ఆటోలకు రూ. 36,000 వరకు సబ్సిడీ అందిస్తోంది. మరోవైపు ప్రభుత్వ చొరవకు తమ వంతు సహాయంగా ర్యాపిడో ఈఎంఐ విషయంలో ఫీజు మినహాయింపునిచ్చింది. ఈ వాహనాలన్నీ ఎలక్ట్రిక్ కావడంతో ఇంధన వ్యయం గణనీయంగా తగ్గిపోయింది. దీంతో ర్యాపిడో నడుపుతున్న మహిళలు నెలకు సుమారు రూ. 13 నుంచి 16 వేల వరకు ఆదాయం ఆర్జిస్తున్నారు.

**మూడు నెలల్లో 45 వేల రైడ్లు.. :** మెప్మా సహకారంతో ర్యాపిడో నడుపుతున్న మహిళా డ్రైవర్లు కేవలం మూడు నెలల్లో (మే, జూన్, జూలై) రికార్డు స్థాయిలో 45 వేల రైడ్లు పూర్తి చేశారు. మొత్తంగా రూ. 35 లక్షల ఆదాయం సంపాదించారు. మహిళల విజయగాథల స్ఫూర్తితో రాబోయే ఏడాదిలో మరో 4 వేల 800 మందికి ఈ పథకాన్ని విస్తరించాలని ప్రభుత్వం ప్రణాళికను సిద్ధం చేసింది.

**ఇది ఆరంభం మాత్రమేనన్న మంత్రి లోకేష్ :** మహిళలు సాధికారత సాధించాలనేది ప్రభుత్వ ఆలోచన అని విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. తెలుగుదేశం పార్టీ మహిళా రిజర్వేషన్లను ప్రవేశపెట్టడంతోపాటు, అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. ర్యాపిడోతో కలిసి రాష్ట్రంలో 1000 మందికి పైగా మహిళలు స్వీయ ఉపాధి సాధించినందుకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇది ఆరంభం మాత్రమేనని, రాబోయే రోజుల్లో మరింత చేస్తామని మంత్రి నారా లోకేష్ వివరించారు.

# స్త్రీ శక్తి .. గ్రాండ్ సక్సెస్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** మహిళల సహకారంతో స్త్రీ శక్తి పథకం గ్రాండ్ సక్సెస్ అయిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో ఆర్టీసీపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. స్త్రీ శక్తి పథకం అమలు ఎలా జరుగుతుందని ఆర్టీసీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆక్యుపెన్సీ రేషియో ఎంత మేర పెరిగిందని ఆరా తీశారు. స్త్రీ శక్తి బస్సుల్లో సీట్ల కోసం పోటీ పడే క్రమంలో ఏమైనా ఇబ్బందులు ఎదురువుతున్నాయా..? అని ముఖ్యమంత్రి అడిగారు. స్త్రీ శక్తి పథకం అమలు చేసినప్పటి నుంచి ఆర్టీసీ బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో పెరిగిందని అధికారులు చెప్పారు. గతంలో ఆక్యుపెన్సీ రేషియో 68 నుంచి 70 శాతంగా ఉండేదని.. ఇప్పుడు 60 డిపోల పరిధిలో తిరిగే బస్సుల్లో 100 శాతం ఆక్యుపెన్సీ రేషియో వస్తోందని.. అలాగే 13 జిల్లాల్లో 100 శాతం ఆక్యుపెన్సీ రేషియోతో బస్సులు తిరుగుతున్నాయని అధికారులు వివరించారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం సందర్భంగా సీట్ల కోసం ఇబ్బందులు.. గందరగోళం వంటి సంఘటనలు తలెత్తడం లేదని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. అంతే కాకుండా.. ఉచిత బస్సు వెసులుబాటును మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారని... అవసరమైన మేరకే ప్రయాణాలు చేస్తున్నారని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.."ఏపీ మహిళల్లో చైతన్యం ఎక్కువగా ఉంటుంది. ప్రభుత్వం ఎలాంటి పథకాలను తెచ్చినా.. వాటిని సద్వినియోగం చేస్తారు. ప్రభుత్వం అందించే పథకాలను అందిపుచ్చుకుని అభివృద్ధి చెందుతారు. అందుకే తాను ఉమ్మడి రాష్ట్రానికి సీఎంగా ఉన్నప్పటి నుంచి మహిళలకు ప్రత్యేక పథకాలు ఇవ్వడానికి ఆసక్తి చూపిస్తా. డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలకు ఆర్థిక స్వావలంభన కల్పిస్తే.. ఇప్పుడు స్త్రీ శక్తి ద్వారా వారికి ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించాం. ఒకప్పుడు బాలికా విద్యను ప్రోత్సహించేందుకు సైకిళ్లు ఇచ్చాం. ఇప్పుడు విద్యార్థినులు, మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం కానుకగా ఇచ్చాం. దీని వల్ల బస్ పాసుల కోసం క్యూ లైన్లల్లో నిల్చొనే శ్రమ తప్పింది. ఆర్టీసీ బస్సుల్లో వెళ్తే భద్రత కూడా ఉంటుంది." అని సీఎం చెప్పారు.

**సహకరిస్తోన్న మహిళలకు ధన్యవాదాలు :** "స్త్రీ శక్తి పథకాన్ని మహిళలు చాలా చక్కగా ఉపయోగించుకుంటున్నారు. అవసరం ఉంటేనే బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. అనవసర ప్రయాణాలు పెట్టుకోవడం లేదు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థికంగా భారమైనా సరే.. మహిళలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడానికి... వారికి చేయూత అందివ్వడానికే స్త్రీ శక్తి పథకం ప్రారంభిస్తున్నామని మహిళలకు చెప్పాను. ఆ మేరకు మహిళలు కూడా సహకరిస్తున్నారు. రాష్ట్ర పరిస్థితిని అర్థం చేసుకుని... దానికి అనుగుణంగా వ్యవహరిస్తున్న మహిళలకు ధన్యవాదాలు. ఇప్పటి వరకు సహకరించిన విధంగానే మహిళలు భవిష్యత్తులోనూ సహకరించాలని కోరుతున్నాను. ఆర్టీసీ సిబ్బందికి ప్రయాణికులు సహకరించాలి. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలకు.. అభివృద్ధి కార్యక్రమాలకు ఇదే విధమైన సహకారం లభిస్తే.. మరింత ఉత్సాహంగా పని చేస్తాం. మరింత మేలు ప్రజలకు, మహిళలకు చేకూర్చగలం." అని చంద్రబాబు వివరించారు.

**బోర్డులు పెట్టండి... లైవ్ ట్రాకింగ్ అమల్లోకి తీసుకురండి... :** "స్త్రీ శక్తి పథకం కింద నడిపే బస్సులకు వెనుకా... ముందు భాగాన బోర్డులు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో మొత్తంగా 8,458 స్త్రీ శక్తి బస్సులకు బోర్డులు పెట్టాలని చెప్పారు. సీట్లకోసం పోటీ పడితే.. ఆర్టీసీ సిబ్బంది సంయమనంతో వ్యవహరించాలని సీఎం సూచించారు. ఇప్పటి వరకు ప్రయాణికులతో ఆర్టీసీ సిబ్బందికి ఎలాంటి ఘర్షణ వాతావరణం తలెత్తలేదని ఆర్టీసీ ఎండీ తెలిపారు. మహిళా ప్రయాణికుల సంఖ్య ఎంత మేరకు పెరిగిందని ముఖ్యమంత్రి ఆరా తీశారు. పథకం ప్రారంభానికి ముందు 40 శాతం మహిళలు ప్రయాణిస్తే.. 60 శాతం మంది పురుషులు ప్రయాణించే వారని.. ఇప్పుడు 65 శాతం మేర మహిళలు ప్రయాణిస్తుంటే.. 35 శాతం మేర పురుషులు ప్రయాణిస్తున్నారని అధికారులు వివరించారు. అలాగే స్త్రీ బస్సుల లైవ్ ట్రాకింగ్ విధానం ఎప్పటి నుంచి అమల్లోకి తెస్తున్నారని ముఖ్యమంత్రి ఆరా తీశారు. రెండు, మూడు రోజుల్లో గుంటూరు డిపోలో స్త్రీ శక్తి బస్సుల లైవ్ ట్రాకింగ్ విధానాన్ని పైలెట్ ప్రాజెక్టుగా చేపడతామని... ఆ తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా స్త్రీ శక్తి బస్సులకు లైవ్ ట్రాకింగ్ విధానాన్ని ప్రవేశపెడతామని అధికారులు చెప్పారు. లైవ్ ట్రాకింగ్ విధానం అమల్లోకి వస్తే.. బస్సుల వేళలు తెలుసుకుని.. ఆ మేరకు తమ ప్రయాణ సమయాలను మహిళలు ఫిక్స్ చేసుకుంటారని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ సమీక్ష సందర్భంగా ఆర్టిక్యులేటెడ్ ఈ - బస్సులపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ తరహా బస్సులు ప్రస్తుతమున్న సాధారణ బస్సులకు... మెట్రో రైలుకు మధ్య మిడిల్ లెవెల్ ట్రాన్స్ పోర్టు వ్యవస్థగా ఉంటాయని అధికారులు వివరించారు.

# రిజర్వాయర్లకు జలకళ

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుతం కృష్ణా డెల్టాలోని ఆయకట్టుకు ఈ ఏడాది జూన్ 1 తేదీ నుంచి ఇప్పటి వరకూ 52 టీఎంసీల నీటిని రైతులు వినియోగించుకున్నారు. ప్రభుత్వం చేపట్టిన సమర్ధ నీటి నిర్వహణతో గతంతో పోలిస్తే ఈసారి అదనంగా 12 టీఎంసీల వినియోగం జరిగింది. గోదావరి బేసిన్ లోని సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ ద్వారా ఎగువ నుంచి వస్తున్న ప్రవాహాలను యథాతథంగా దిగువకు సముద్రంలోకి వదులుతున్నారు. గోదావరి డెల్టాలోని పంటల సాగుకు సీజన్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకూ 70 టీఎంసీల మేర నీటిని ఆయకట్టుకు విడుదల చేశారు. పెన్నా బేసిన్లో వెలిగోడులో 15 టీఎంసీలు, సోమశిలలో 56 టీఎంసీలు, కండలేరులో 31 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వంశధార బేసిన్లోని గొట్టా బ్యారేజీ నుంచి ఈ సీజన్లో 8 టీఎంసీల నీటిని ఆయకట్టుకు అందించింది ప్రభుత్వం. మొత్తంగా చూస్తే ఆగస్టు 24 నాటికి ప్రధాన జలాశయాల్లో 650 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది.

**సమర్ధ నీటి నిర్వహణ- వినియోగం :** ఈ ఏడాది ఇప్పటి వరకు కృష్ణా, గోదావరి, వంశధార బేసిన్లలో కలిపి 309 టీఎంసీల నీటిని ఆయకట్టు అవసరాలకు వినియోగించారు. సర్ ఆర్థర్ కాటన్ ధవళేశ్వరం బ్యారేజీ నుంచి 70 టీఎంసీలు, ప్రకాశం బ్యారేజీ నుంచి 52 టీఎంసీలు, వంశధార నుంచి 8 టీఎంసీల మేర నీటిని కాలువలకు విడుదల చేశారు. పోతిరెడ్డిపాడు, హంద్రీ నీవా, నాగార్జున సాగర్ కుడి కాలువ ద్వారా ఈ సీజన్లో ఇప్పటి వం- కు 156 టీఎంసీల నీటి వినియోగం జరిగింది. ఈ ఏడాది హంద్రీ-నీవా ప్రధాన కాలువ ద్వారా మల్యాల ఎత్తిపోతల నుంచి రాయలసీమ ఉమ్మడి జిల్లాల్లో ఉన్న లక్షల ఎకరాల ఆయకట్టుకూ సాగునీరు అందిస్తున్నారు. హంద్రీనీవా కాలువల వెడల్పు చేయడంతో 738 కి.మీ ప్రయాణించి కృష్ణా జలాలు చిత్తూరు జిల్లా చివరి ప్రాంతాలకు చేరుతున్నాయి. కృష్ణా జలాలు ఇప్పటికే కుప్పం బ్రాంచ్ కెనాల్ కు చేరుకున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు సూచనలతో ఏడాది కాలంగా చేపట్టిన సమర్ధ నీటి నిర్వహణ, నిరంతర పర్యవేక్షణ ద్వారా పంటలకు అవసరమైన సాగునీరు సకాలంలో ఇవ్వడంతో పాటు... రానున్న కాలానికి అవసరమైన విధంగా రిజర్వాయర్లను నీటితో నింపుతున్నారు.

**ఈ సీజన్ లోనే 1969 టీఎంసీలు సముద్రం పాలు :** ఇలా సాధ్యమైనంత ఎక్కువ మొత్తంలో వరద నీటిని సద్వినియోగం చేసుకుంటున్నా... వివిధ నదీ బేసిన్ల నుంచి పెద్ద ఎత్తున నీరు సముద్రంలోకి వెళ్లింది. ఎగువ రాష్ట్రాల నుంచి వస్తున్న వరద ప్రవాహాలతో మన ప్రాజెక్టులు నిండగా మిగిలిన నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. గోదావరి, కృష్ణా, వంశధార, పెన్నా బేసిన్ల నుంచి ఈ సీజన్లో జూన్ 1 తేదీ నుంచి ఇప్పటి వరకూ 1969 టీఎంసీలకు పైగా నీరు సముద్రంలో కలిసింది. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి గోదావరి నీరు ఈ ఏడాది జూన్ నుంచి ఇప్పటి వరకూ 1483 టీఎంసీల మేర సముద్రంలోకి వెళ్లింది. ప్రకాశం బ్యారేజి నుంచి డెల్టా అవసరాల వినియోగం తర్వాత సముద్రంలోకి ఈ సీజన్లోనే 468 టీఎంసీల నీరు వెళ్లింది. అలాగే వంశధార బేసిన్లో ఈ వర్షాకాల సీజన్లో ఇప్పటికే 18 టీఎంసీలకు పైగా సముద్రంలోకి వదిలారు. ప్రస్తుతం శ్రీశైలం నుంచి 4.38 లక్షలు, సాగర్ నుంచి 3.38 లక్షలు, పులిచింతల నుంచి 2.72 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజ్ నుంచి పంట కాలువలకు 18 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. పైనుంచి వరద వస్తుండడంతో 3.42 లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదులుతున్నారు. ఎగువ రాష్ట్రా లనుంచి వరద వచ్చిన సమయంలో మన రిజర్వాయర్లు నింపుకున్నా... పెద్ద మొత్తంలో నీరు సముద్రంలోకి పోతోంది.

# చేనేతకు గుర్తింపు తెస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా గౌరవ సలహాదారు సుచిత్ర ఎల్ల హాజరై మాట్లాడుతూ చేనేత మరియు హస్తకళల ప్రొడక్ట్స్ ను జాతీయ, అంతర్జాతీయంగా మార్కెట్ చేసేందుకు బాధ్యత తీసుకుని పనిచేస్తామన్నారు. మన వస్తువులకు బ్రాండింగ్ ఎలా చేయాలో వాటికి ఇంకా ఆదరణ ఎలా చేయాలో అనే విషయాలపై దృష్టి కేంద్రీకరిస్తామన్నారు. మన కళలను, ఆర్టిజన్స్ ను, హ్యాండీ క్రాఫ్ట్స్ ను అభివృద్ధి చేయటం మనందరి బాధ్యత అని అన్నారు. మన కుటుంబాలు చేనేతను ఆదరించేలా చేయాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. హ్యాండ్ ల్యూమ్స్ ఒక జీవనోపాధి దీన్ని ఇంకా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. వన్ డిస్ట్రిక్ వన్ ప్రొడక్ట్ క్రింద మన చేనేతకు 10 అవార్డ్స్ రావడం చేనేతకు గర్వకారణం అన్నారు. మొత్తం దేశంలో 30 అవార్డ్స్ లో మనకు 10 అవార్డులు రావడం రాష్ట్రానికి గర్వకారణమన్నారు. ఇందులో బాపట్ల జిల్లాకు రాష్ట్రస్థాయి అవార్డు, రాష్ట్రంలో 9 జిల్లా స్థాయి అవార్డులు వచ్చాయన్నారు.

చేనేత మరియు జౌళి శాఖ కమిషనర్ జి. రేఖా రాణి మాట్లాడుతూ చేనేత ఉత్పత్తులను పెంచేందుకు ఇలాంటి ఎగ్జిబిషన్స్ ను ఆగస్టు నెలలో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. నేతన్నలకు ఏడాది పొడవునా ఉపాధి కల్పించేందుకు ఇది ఉపయోగపడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి జీఎస్టీ రీయింబర్స్ మెంట్ కోసం ప్రతిపాదనలు పంపించడం జరిగిందన్నారు. చేనేత కార్మికులకు మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు కల్పించి మరియు దేశములోని ప్రముఖ చేనేత ఉత్పత్తులను ఒకే వేదికపై తీసుకువచ్చి వినియోగదారులకు అందుబాటులో ఉంచే కార్యక్రమములో భాగంగా వీటిని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

కార్యక్రమంలో 8 వ డివిజన్ కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, చేనేత మరియు జౌళి శాఖ అడిషనల్ డైరెక్టర్ మురళీకృష్ణ, జాయింట్ డైరెక్టర్ రాజారావు, డిప్యూటీ డైరెక్టర్ బి. నాగేశ్వరరావు, ఏడీలు హరికృష్ణ, వనజ, తదితరలు పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

(మొదటి పేజీ తరువాయి)

కార్డులో ఇంటి చిరునామాలు, కుటుంబ వివరాలు చేర్పులు మార్పులు సహజంగా గ్రామ వార్డు సచివాలయాల లో దరఖాస్తు చేసుకుంటే అదే రోజు వారు అప్లోడ్ చేస్తారని ఇంటిగ్రేటెడ్ డేటా అప్రోచ్ ద్వారా డేటా అంతా జిల్లాస్థాయిలో జిల్లా కలెక్టర్ సంయుక్త కలెక్టర్, రాష్ట్ర స్థాయిలో పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో కమిషనర్ వద్ద పొందుపరచబడి సమాచార లోపం లేకుండా చేసుకోవచ్చన్నారు

ఎవరికైనా ఏమైనా ఇబ్బంది ఉంటే కార్డు పైన ఉన్న 196 కాల్ సెంటర్ నంబర్ కు ఫోన్ చేసి చెప్పవచ్చన్నారు

కృష్ణాజిల్లాలో 5,17,825 క్యూ ఆర్ కోడ్ ఉన్న స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ జరుగుతుందన్నారు.

అందులో పెనమలూరు నియోజకవర్గంలో దాదాపు 92 వేల స్మార్ట్ రైసు కార్డులు పంపిణీ చేస్తున్నామన్నారు.

ఈ కార్డులను పౌరసరఫరాల శాఖ ఉద్యోగులతో పాటు గ్రామ వార్డు సచివాలయాల సిబ్బంది కూడా పంపిణీ చేస్తారన్నారు.

ఈ కార్డు ఒక గుర్తింపు కార్డు లాగా కూడా పనిచేస్తుందని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉద్యోగ రీత్యా గాని చదువు రీత్యా గాని ఎక్కడికి వెళ్ళినా అక్కడ చౌక దుకాణాల నుండి నిత్యవసర సరుకులు పొందే సౌలభ్యం కల్పించామన్నారు

పెనమలూరు శాసనసభ్యులు బోడె ప్రసాద్ మాట్లాడుతూ ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా నూతన సాంకేతిక పరిజ్ఞానంతో పాత కార్డుకు అనుసంధానం చేస్తూ స్మార్ట్ బియ్యం కార్డులను గుర్తింపు కార్డుల రూపంలో మన రాష్ట్రంలో తొలిసారిగా ప్రవేశపెట్టి మరీ ముఖ్యంగా తన నియోజకవర్గంలో లబ్ధిదారులకు అందజేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రివర్యులు నాదెండ్ల మనోహర్ లకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

ఈ కార్డు ఒకవేళ పోతే 196 టోల్ ఫ్రీ నెంబర్ కు తెలియజేసి దరఖాస్తు చేసిన పక్షంలో 50 రూపాయల ఖర్చుతో కొత్త కార్డును ఇంటికే పోస్ట్ ద్వారా పంపడం జరుగుతుందన్నారు.

కార్డులోని క్యూఆర్ కోడ్ కు స్కాన్ చేసి ఏ రోజు చౌక దుకాణం వెళ్లారు, ఏ సరుకులు తెచ్చుకున్నారు అన్ని వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

సాంకేతికత పరిజ్ఞానంతో కార్డు అనుసంధానమై ఉన్నందున దుర్వినియోగం చేసే అవకాశం లేదన్నారు.

అంతేకాకుండా ఎలాంటి నష్టం లేకుండా సరుకులు పంపిణీ చేయవచ్చన్నారు.

ఈ కార్యక్రమంలో డి ఎస్ ఓ మోహన్ బాబు, ఉయ్యూరు ఆర్డిఓ బిఎస్ హేలా షారోన్ ,తహసిల్దారు గోపాలకృష్ణ, తాడిగడప మునిసిపల్ కమిషనర్ నజీర్, వీఆర్వో పవన్ తదితర అధికారులు, అనధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## మెగా డీఎస్సీ - యువత కల నిజం



**శ్రీకాకుళం, (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర వ్యాప్తంగా 16,347 ఉపాధ్యాయ పోస్టులతో పారదర్శకంగా మెగా డీఎస్సీ నిర్వహించడం ద్వారా యువతకు న్యాయం చేస్తూ, విద్యారంగానికి నూతన ఉజ్వల భవిష్యత్తు తెచ్చినందుకు రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్ గారిని, కూటమి ప్రభుత్వాన్ని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి గౌరవ కింజరాపు అచ్చెన్నాయుడు గారు హృదయపూర్వకంగా అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ యువతకు ఇచ్చిన మాటను నిలబెట్టి, ఉద్యోగాల కలను నిజం చేయడం మంత్రి లోకేష్ గారి నాయకత్వం వల్లే సాధ్యమైంది అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, దివ్యాంగుల అభ్యర్థులకు వయస్సు మినహాయింపు ఇవ్వడం ద్వారా వెనుకబడిన వర్గాలందరికీ కూటమి ప్రభుత్వం అండగా నిలిచిందని పేర్కొన్నారు. విద్యారంగంలో మౌలిక సదుపాయాలు, సరిపడ ఉపాధ్యాయులు ఉండేలా లోకేష్ కృషి చేయడం వల్లే విద్యార్థుల భవిష్యత్తు ప్రకాశవంతమవుతుందని అన్నారు.

2014–19లో టీడీపీ ప్రభుత్వం 2 డీఎస్సీలు జరిపి 18 వేలకు పైగా పోస్టులు భర్తీ చేసిందని మంత్రి అచ్చెన్నాయుడు గుర్తు చేశారు. చంద్రబాబు నాయుడు హయాంలో మొత్తం 13 డీఎస్సీల ద్వారా 1,80,000 పైగా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయడం చరిత్రలో నిలిచిపోయిందని తెలిపారు. ఈ రోజు పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల్లో అధిక శాతం మంది ఆ కాలంలోనే ఉద్యోగాలు పొందారని చెప్పారు. అదే సమయంలో గత వైకాపా పాలనలో విద్యా రంగం కూలిపోయిందని, ఐదు సంవత్సరాల పాటు ఒక్క డీఎస్సీ కూడా ఇవ్వకుండా, చివర్లో కేవలం 6,100 పోస్టులతో మోసం చేశారని విమర్శించారు. డీఎస్సీని ఆపడానికి 24 కేసులు వేయించిన జగన్ రెడ్డి తీవ్ర స్థాయిలో మండి పడ్డారు. కూటమి ప్రభుత్వం, మంత్రి లోకేష్ గారి దృఢ సంకల్పం వల్లే విద్యా రంగంలో కొత్త వెలుగులు ప్రసరించాయని కొనియాడారు. ప్రతి సంవత్సరం మెగా డీఎస్సీ నిర్వహించి, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తూ, విద్యా ప్రమాణాలను మెరుగుపరుస్తామని మంత్రి అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు.

## పర్యావరణహిత వినాయక చవితి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** మట్టి గణపతే మహాగణపతి అని, ప్రతి ఒక్కరూ పర్యావరణహిత వినాయక చవితి వేడుకలకు కట్టుబడి ఉండాలని గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత కాలుష్యరహిత పండుగల నిర్వహణలో ముందుండాలని ఆయన సూచించారు.

సోమవారం 18వ డివిజన్ కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ పర్యావరణహిత పండుగలపై రూపొందించిన వాల్ పోస్టర్‌ను కమిషనర్ తమ చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ మరియు రసాయనాలతో తయారైన విగ్రహాల వల్ల జలవనరులు తీవ్రంగా కలుషితమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. భక్తి పేరుతో మరొకరికి ముప్పు వాటిల్లకూడదని ప్రతి ఒక్కరూ గ్రహించాలన్నారు.

భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే పండుగలను పర్యావరణహితంగా జరుపుకోవాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ వినాయక చవితి సందర్భంగా సుమారు 2,500 మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. పండుగల సమయంలో పర్యావరణానికి హాని కలగకుండా ప్రతి ఒక్కరూ చైతన్యంతో ముందుకు రావాలని కమిషనర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఈరంటి వరప్రసాద్, ఇర్రి సాయి పాల్గొన్నారు.

# మండలానికో 'జన ఔషధి'

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో వైద్య సదుపాయాలు మెరుగుపరచడం, ఆరోగ్య బీమాలో మార్పులు, కొత్త వైద్య కళాశాలలు, ఉచితంగా వైద్య పరీక్షలు, యోగా%-%నేచరోపతి అభివృద్ధి వంటి అంశాల్లో తీసుకోవాల్సిన చర్యలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. పేదలపై భారం తగ్గేలా ప్రతీ మండలంలో జనరిక్ ఔషధాలు లభించేలా చూడాలని భావిస్తున్న ముఖ్యమంత్రి... దీనికి సంబంధించి వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులతో సోమవారం సచివాలయంలో జరిగిన సమీక్షలో కీలక నిర్ణయం తీసుకున్నారు. జనఔషధి స్టోర్లు పెట్టేందుకు బీసీ కార్పొరేషన్ నుంచి పెద్దఎత్తున వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తక్షణమే వాటికి అనుమతులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. దీంతో పేదలకు తక్కువ ధరకే మెడిసిన్స్ లభించడమే కాకుండా, బీసీ యువతకు విస్తృతంగా ఉపాధి లభించేందుకు మార్గం సుగుమం అయ్యింది.

**రూ.25 లక్షల వరకు వైద్య బీమాపై కసరత్తు :** ఎన్టీఆర్ వైద్య సేవ కింద రూ. 25 లక్షల వరకు వైద్య బీమా అందించే అంశంపైనా సమీక్షలో చర్చించారు. ప్రస్తుతం ఉన్న విధానం ద్వారా 1.43 కోట్ల కుటుంబాలకు మాత్రమే లబ్ది కలుగుతుండగా, దీనిని 1.63 కోట్ల కుటుంబాలకు వర్తించేలా మార్పులు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఇది అమలైతే 5.02 కోట్ల మందికి ప్రయోజనం కలుగుతుందని అధికారులు తెలిపారు.

**ప్రతీ నియోజకవర్గంలో 100 పడకల ఆస్పత్రి :** ప్రతీ నియోజకవర్గంలో 100 పడకల ఆస్పత్రిని నిర్మించేలా కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. మార్కాపురం, మదనపల్లి, పులివెందుల, ఆదోనిలో నిర్మిస్తున్న మెడికల్ కాలేజీల పురోగతిపైనా చర్చించారు. రాష్ట్రంలో ప్రస్తుతం ప్రతి వెయ్యి మంది జనాభాకు 2.24 బెడ్స్ ఉండగా, వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ నిర్దేశకాల ప్రకారం 3 బెడ్లు ఉండాలని సూచించిందని అన్నారు. దీనిప్రకారం రాష్ట్రంలో మరో 12,756 పడకలు అందుబాటులోకి తేవాల్సి ఉందని.... దీనిపై సమగ్ర అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.



**ఆరోగ్య సూత్రాలు పాటించేలా అవగాహన :** వివిధ వ్యాధులతో చికిత్స పొందేందుకు ఆస్పత్రులకు రావడం కన్నా... అనారోగ్యం పాలవ్వకుండా ముందగానే జాగ్రత్తపడేలా, ప్రజలంతా ఆరోగ్య సూత్రాలు పాటించేలా అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి అధికారులకు చెప్పారు. ఇందుకోసం యోగా, నేచరోపతిని ప్రమోట్ చేసేలా 'యోగా ప్రచార పరిషత్' ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. 3 రీజనల్ స్టడీ సెంటర్లలో 64 మంది సభ్యులను నియమించేందుకు అనుమతించారు. అమరావతి పరిధిలో నేచురోపతి యూనివర్సిటీ ఏర్పాటుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు.

**45 రోజుల్లోగా కుప్పంలో ఉచిత వైద్య పరీక్షలు :** రాష్ట్రంలో ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్ రూపొందించే క్రమంలో తలపెట్టిన ఉచిత వైద్య పరీక్షల పైలెట్ ప్రాజెక్టును కుప్పం నియోజకవర్గంలో 45 రోజుల్లోగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. కుప్పం నియోజకవర్గంలోని కుప్పం, శాంతిపురం, రామకుప్పంతో పాటు మరిన్ని ల్యాబ్ టెస్టింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని, అలాగే శాంపిల్ కలెక్షన్ టీమ్‌లు పెంచాలని స్పష్టం చేశారు.

**ప్రతీ గ్రామానికి 'ఆరోగ్య రథం' :** 'ఆరోగ్యం రథం'తో ప్రతీ పల్లెలోనూ మొబైల్ వైద్యసేవలు అందించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. 108 వాహనాల సిబ్బందికి యూనిఫామ్ అమలు చేయాలని నిర్దేశించారు. మరోవైపు ఎన్టీఆర్ బేబీ కిట్స్ పథకాన్ని అమలు చేసేందుకు అధికారులు తీసుకొచ్చిన పలురకాల కిట్స్‌ను ముఖ్యమంత్రి పరిశీలించారు. బేబీ కిట్స్ పథకం త్వరలోనే అమలుచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**మోడల్ ఇంక్లూజివ్ సిటీగా అమరావతి :** పెర్కిన్స్ ఇండియా – ఎల్.వి. ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ భాగస్వామ్యంతో అమరావతిలో 'మోడల్ ఇన్‌క్లూజివ్ సిటీ' ఏర్పాటుకు ముందుకొచ్చాయి. దీనిపై ఆ సంస్థల ప్రతినిధులు ముఖ్యమంత్రిని కలిసి ప్రజెంటేషన్ ఇచ్చారు. ఐక్యరాజ్యసమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా సమగ్ర విద్య, సమాన హక్కులు, అందరికీ అందుబాటులో మౌలిక వసతులను సృష్టించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తామని చెప్పారు. బారియర్ ఫ్రీ పబ్లిక్ ప్లేస్, ఇన్‌క్లూజివ్ రోడ్ డిజైన్, అందరికీ అందుబాటులో ఉండేలా ప్రజా రవాణా సౌకర్యాలు రూపకల్పన, డిజిటల్ స్మార్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి, ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ మోడల్ స్కూల్ ప్రోగ్రామ్స్ ద్వారా ప్రతి పిల్లవాడు తన సహచరులతో సమానంగా నేర్చుకునే వాతావరణం కల్పించడం, ఉపాధ్యాయ శిక్షణా కార్యక్రమాలు వంటివి చేస్తామని చెప్పారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో రావాలని సూచించారు.

## భారత్-అమెరికా మధ్య ట్రంప్ చిచ్చు..!

**అమెరికా:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయాలు భారత్-అమెరికా సంబంధాలను తీవ్రస్థాయిలో దెబ్బతీస్తున్నాయి. తాజాగా అత్యంత వివాదాస్పదమైన వ్యక్తుల్లో ఒకరైన సెర్గియో గోర్‌ను భారత్ అమెరికా రాయబారిగా, దక్షిణ, మధ్యఆసియాలో పర్యవేక్షకుడిగా నియమించడం దౌత్యవర్గాలను షాక్‌కు గురిచేసింది. ఒకప్పుడు భారత్ తీవ్రంగా వ్యతిరేకించిన పనినే ట్రంప్ బలవంతంగా చేశారు. 38 ఏళ్ల గోర్‌పై ట్రంప్‌నకు విపరీతమైన నమ్మకం ఉంది. ఇతడు చెప్పిన మీదటే నాసా చీఫ్ నియామకాన్ని చివరి నిమిషంలో మార్చేశారు.

**భారత్ ప్రాధాన్యం తగ్గించినట్లా..? :** గోర్ నియామకంపై భారత్‌లో మిశ్రమ స్పందన వస్తోంది. విదేశీ వ్యవహారాల నిపుణుడు, మాజీ దౌత్యవేత్త కన్వల్ సిబల్ స్పందిస్తూ భారత్‌లో నియమించిన దౌత్యవేత్తను దక్షిణ, మధ్య ఆసియాకు ప్రత్యేక దూతగా నియమించడం ఇదే తొలిసారి అన్నారు. పాకిస్థాన్ సహా పొరుగుదేశాలతో భారత్‌కు ఉన్న సంబంధాలను అతడు గమనిస్తాడన్నది వాస్తవమని పేర్కొన్నారు. అయితే.. ఈ చర్య భారత్, పాకిస్థాన్‌ను ఒకేగాటన కట్టినట్లవుతుందని.. ఇలాంటి అమెరికా వైఖరిని న్యూదిల్లీ గతంలో తీవ్రంగా వ్యతిరేకించిందన్నారు. అంతేకాదు.. ఇక భారత్-అమెరికా సంబంధాల్లో ఇండో-పసిఫిక్ ప్రాధాన్యం కనుమరుగవుతుందని చెప్పారు.

మరో మాజీ దౌత్యవేత్త నిరుపమారావ్ కూడా ట్రంప్



ఉద్దేశాలను ప్రశ్నించారు. ఈ నియామకం భారత్-అమెరికా సంబంధాలను దెబ్బతీస్తుందన్నారు. గోర్ దౌత్యవేత్త కాకపోవడం, భారత్, దక్షిణాసియాలో అతడికి అనుభవం లేకపోవడం ఇబ్బందికరమన్నారు. కేవలం వీరవిధేయతే ఏకైక అర్హతన్నారు. అధ్యక్షుడి అజెండాను ముందుకుతీసుకెళ్లడానికే అతడిని నియమించారన్నారు. అది భారత్‌తో సంబంధాలను బలోపేతం చేస్తుందని చెప్పలేమన్నారు. అమెరికా అనుసరించే పాక్-అఫ్గాన్ పాలసీతో భారత్‌ను కూడా కలపడం ఇబ్బందికరమే అని తెలిపారు.

వ్యక్తిగతంగా తనకు అత్యంత సన్నిహితుడైన వ్యక్తిని భారత్‌లో నియమించి ట్రంప్ నుంచి మోదీ ప్రభుత్వానికి బలమైన సంకేతాలు వెళ్లాయని పొలిటికో పత్రిక పేర్కొంది. అధ్యక్షుడి నుంచి వచ్చే అభ్యంతరాలు, ఇతర సందేశాలపై భారత్ కూడా తీవ్రంగా పరిగణించి.. చర్చలు జరపాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది.

**నాడు ఒబామా ప్రయత్నాన్ని వ్యతిరేకించిన భారత్..** : 2009లో బరాక్ ఒబామా అధ్యక్షుడిగా ఉన్న సమయంలో కూడా భారత-పాక్-అఫ్గానిస్థాన్‌ను ఒకే పాలసీ కిందకు తెచ్చేందుకు యత్నించారు. నాడు రిచర్డ్ హోల్‌బ్రూక్‌ను ఈ ప్రాంతం మొత్తానికి ప్రత్యేక రాయబారిగా నియమించారు. అయితే.. నాటి భారత విదేశాంగ మంత్రి ప్రణబ్ ముఖర్జీ దీనిపై అమెరికా రాయబారి డేవిడ్ మల్‌ఫోర్డుకు తమ అభ్యంతరం వ్యక్తంచేశారు. ఈ చర్య భారత్‌కు ఆమోదయోగ్యం కాదన్నారు. దీంతో నాడు బ్రూక్‌ను పాక్-అఫ్గానిస్థాన్‌కు మాత్రమే పరిమితం చేసినట్లు వికీలీక్స్‌లో బహిర్గతమైన పత్రాల్లో తేలింది. ఇప్పుడు ట్రంప్ భారత్‌కు నచ్చని అటువంటి చర్యే తీసుకొన్నారు.

**ట్రంప్-మస్క్ వివాదాన్ని ఎగదోసి..**

శ్వేతసౌధంలో ట్రంప్ వ్యక్తిగత కార్యదర్శి హోదాలో అమెరికా ప్రభుత్వంలో ఏకంగా 4,000 నియామకాలు చేశారంటే.. గోర్ పరపతిని అర్థం చేసుకోవచ్చు. మస్క్ దోస్త్ జరేడ్ ఇస్సాక్‌మన్ నాసా చీఫ్‌గా తొలుత ప్రకటించారు. ఆయన నామినేషన్ ఆమోదం కోసం సెనేట్‌కు పంపే సమయంలో మస్క్-ట్రంప్ మధ్య విభేదాలు తీవ్రస్థాయిలో ఉన్నాయి. అదే సమయంలో ఇస్సాక్‌మన్ డెమొక్రాట్లకు ఎన్నికల్లో నిధులు సమకూర్చినట్లు గోర్ నుంచి అధ్యక్షుడికి సమాచారం వెళ్లింది. దీంతో డోజ్ అధిపతిగా మస్క్ చివరి రోజున.. నాసా చీఫ్ పదవి నుంచి ఇస్సాక్‌మన్ పేరును ట్రంప్ తొలగించారు. ఈ నేపథ్యంలో గోర్‌ను 'పాము'గా అభివర్ణిస్తూ మస్క్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

## భవన కార్మికుల సమస్యలు అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్తా..

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** భవన నిర్మాణ కార్మికుల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తానని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ హామీ ఇచ్చారు. పాత గుంటూరుకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు వేజండ్ల కోదండ రామయ్య మృతి చెందడంతో సోమవారం ఎమ్మెల్యే నసీర్ ఆయన స్వగృహానికి వెళ్లి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తోందని తెలిపారు. ప్రతి కార్మికుడు సంక్షేమ బోర్డులో రిజిస్టర్ చేయించుకోవాలని సూచించారు.



దీనిపై కార్మిక శాఖ అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. రిజిస్టర్ అయిన భవన నిర్మాణ కార్మికులకు ప్రమాదవశాత్తు మరణం సంభవిస్తే రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందుతుందని తెలిపారు. సహజ మరణమైతే రూ. 60 వేలు సాయం చేస్తారని వెల్లడించారు. కార్మికుల కుమార్తెల వివాహానికి రూ. 20 వేలు, ప్రసవ సమయంలో రూ. 30 వేలు, ప్రమాదవశాత్తు గాయపడి, పని చేయలేని స్థితిలో ఉన్న కార్మికులకు గరిష్టంగా నెలకు రూ. 4,500 వరకు ఆర్థిక సహాయం అందుతుందని తెలిపారు. అసంఘటిత కార్మికులకు సైతం ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో భవన నిర్మాణ కార్మకులు అధికంగా ఉన్నారని, వీరికి తాను ప్రభుత్వ పరంగా సౌకర్యాలు అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్మికుల పిల్లల చదువులు, ఉద్యోగాల విషయంలో తనను సంప్రదించాలని సూచించారు.

## మీ ఉడత బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదు

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు జిల్లా తక్కెళ్లపాడులో శ్రీకృష్ణుడి రూపంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని తొలగించడానికి సహకరించిన మంత్రి నారా లోకేష్, నిర్వాహకులు, గ్రామస్తులకు, ఈ విగ్రహ ఏర్పాటును వ్యతిరేకిస్తూ స్పందించిన హిందూ సంఘాలు, బిసి సంఘాల ప్రతినిధులకు బిసివై పార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం ఆయన మంగళగిరిలోని బిసివై పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. తక్కెళ్లపాడులో శ్రీకృష్ణుడి రూపంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్న విషయం తెలుసుకున్న హిందూ సంఘాలు, యాదవ సంఘాలు పెద్ద ఎత్తున వ్యతిరేకించాయన్నారు. తాను కూడా తక్కెళ్లపాడుకు వెళ్లి విగ్రహం ఏర్పాటు చేయవద్దని నిర్వాహకులకు చెప్పి వస్తే... విగ్రహం పెట్టబోమని ప్రకటించి మళ్లీ రాత్రికి రాత్రే విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. దీంతో తాను విశాఖపట్నంనుంచి ఛలో తక్కెళ్లపాడుకు పిలుపునిచ్చానన్నారు. దీంతో వివాదాన్ని గుర్తించిన నారా లోకేష్ జోక్యంతో నిర్వాహకులు బేషిజాలకు పోకుండా శ్రీకృష్ణుడి రూపంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహాన్ని తొలగించి, ఎన్టీఆర్ రూపంలోనే విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. వారందరికీ మరోసారి కృతజ్ఞతలు తెలిపారు.




మీ ఉడత బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదు

వివాదాస్పద ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటును వ్యతిరేకించిన తనపై కొందరు బెదిరింపులకు దిగుతున్నారని రామచంద్రయాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు కేసులు పెడతామని, కుట్ర చేస్తామని బెదిరిస్తున్నారని, అలాంటి ఉడత బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. గతంలో తన ఇంటిపై దాడి చేసిన అల్లరిమూకల పరిస్థితి ఏమైందో ఒక్కసారి గుర్తు తెచ్చుకోవాలన్నారు. మంగళగిరి పార్టీ ఆఫీసుకు వస్తామని కొందరు తనను టార్గెట్ చేసి మాట్లాడుతున్నారని వాటన్నిటికీ బెదిరే ప్రసక్తే లేదన్నారు

**శ్రీ కృష్ణుడిని అవమానిస్తున్నారు**

కొందరు పనిగట్టుకొని శ్రీకృష్ణుడిని అవమానించే విధంగా మాట్లాడుతున్నారని రామచంద్రయాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీకృష్ణుడు ఎలా ఉంటాడో తెలుసా? అని... రామారావు వల్లే శ్రీకృష్ణుడికి ప్రాచుర్యం వచ్చిందనే అర్థం వచ్చేలా సోషల్ మీడియాలో పోస్ట్ లు పెడుతున్నారన్నారు. అలా మత విద్వేషాలు రెచ్చగొట్టే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**ఈ విష సంస్కృతి నశించాలి :** దేవుళ్ల రూపంలో నటుల విగ్రహాల ఏర్పాటు చేసే సంస్కృతి నశించాలని రామచంద్రయాదవ్ డిమాండ్ చేశారు. ఇప్పుడు శ్రీకృష్ణుడు రూపంలో ఎన్టీఆర్ విగ్రహాలు పెట్టాలని ప్రయత్నించినట్టుగానే, శివుడి రూపంలో చిరంజీవిని, అమ్మవారి రూపంలో రమ్యకృష్ణ విగ్రహాలను ప్రతిష్ఠించినా ఆశ్చర్యపోనక్కర్లేదని ఎద్దేవా చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ విష సంస్కృతి నశించాలని కోరారు

**చంద్రబాబు, రేవంత్ రెడ్డి ఆ విగ్రహాలు తొలగించేలా చర్యలు తీసుకోవాలి :** రెండు తెలుగు రాష్ట్రాలలో గతంలో శ్రీకృష్ణుడు రూపంలో ఏర్పాటు చేసిన విగ్రహాలను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని రెండు తెలుగు రాష్ట్రాల సిఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డిలకు రామచంద్రయాదవ్ విజ్ఞప్తి చేశారు. అలాగే ఆ విగ్రహాల తొలగింపుకు త్వరలోనే కోర్టులను ఆశ్రయించి న్యాయ పోరాటం చేస్తామన్నారు. రామారావు విగ్రహాల ఏర్పాటుకు తాము వ్యతిరేకం కాదని, మనోభావాలను కించ పరిచేలా ఏర్పాటు చేస్తే చూస్తూ ఊరుకునే పరిస్థితి మాత్రం లేదన్నారు.

## తుళ్లూరులో భద్రతా మాక్ డ్రిల్



**తుళ్లూరు(జర్నలిస్ట్ ఫైల్):** రాజధాని ప్రాంతంలోని సీడ్ యాక్సెస్ రోడ్డులో భద్రతా ప్రమాణాల సమీక్షకోసం ఆదివారం భారీ మాక్ డ్రిల్ నిర్వహించారు. గుంటూరు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్.ఎస్.జీ ఎస్పీ భద్రయ్య, అదనపు ఎస్పీలు . రవికుమార్, హనుమంతు (ఏఆర్) సమన్వయంతో ఈ డ్రిల్ జరిగింది. వీవీఐపీలు, వీఐపీలు తరచుగా ప్రయాణించే ఈ రహదారిపై అనుకోని పరిస్థితులు ఎదురైనప్పుడు పోలీసులు ఎలా స్పందించాలి అన్న దానిపై ప్రత్యేక అభ్యాసాలు నిర్వహించారు. గుంటూరు జిల్లా భద్రతా విభాగం, ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ ఆధ్వర్యంలో ఆధునిక పరికరాలు, శిక్షణ పొందిన పోలీస్ జాగిలాల సహాయంతో ప్రతి మూల ముల్లును జల్లెడ పట్టారు. మంతెన సత్యనారాయణ రాజు ఆశ్రమం నుండి ఎన్9 జంక్షన్ వరకు రోడ్డులోని డివైడర్లు, చెట్ల పొదలు, వంతెనలు, కల్వర్టులు, తూములు తదితర ప్రాంతాలను సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ, ఏఆర్ డీఎస్పీ ఏడుకొండలరెడ్డి, బీడీ టీం డీఎస్పీ రామకృష్ణ తదితర అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించారు. భద్రతా ప్రమాణాలను మరింత బలోపేతం చేయడమే ఈ డ్రిల్ ఉద్దేశమని ఎస్.ఎస్.జీ ఎస్పీ పేర్కొన్నారు. అనుమానితులు, అనుమానాస్పద వస్తువులు కనిపించినపుడు ఎలా స్పందించాలో సిబ్బందికి ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి మాక్ డ్రిల్స్‌ను తరచుగా నిర్వహిస్తామని చెప్పారు. అదనపు ఎస్పీలు మాట్లాడుతూ ు సీడ్ యాక్సెస్ రోడ్డుపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని, బీడీ టీం, ప్రత్యేక దళం సమన్వయంతో తనిఖీలు జరుగుతున్నాయని వివరించారు. ఇప్పటికే సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాల సహాయంతో పర్యవేక్షణ బలోపేతం చేశామని తెలిపారు. రాజధాని ప్రాంతంలో పనిచేస్తున్న ఇతర రాష్ట్రాల కార్మికుల వివరాలు సేకరించి, వారి కదలికలపై కూడా నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో తుళ్లూరు సీఐ కొంక. శ్రీనివాస్, ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు, ఎస్బి సీఐ శ్రీహరి, జిల్లా భద్రతా విభాగ ఆర్ఐ సురేష్‌తో పాటు పలువురు అధికారులు, భద్రతా సిబ్బంది పాల్గొన్నారు.

## స్మార్ట్ కార్డులు పంపిణీ గూర్చి అవగాహన



**కాకుమాను,(జర్నలిస్ట్ ఫైల్):** మండల తహసీల్దార్ కార్యాలయం నందు చౌక ధరల దుకాణదారులు తో త్వరలో ప్రభుత్వం చే ప్రజలకు అందించనున్న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కు సంబంధించి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో తహసిల్దార్ బి.వెంకట స్వామి మాట్లాడుతూ స్మార్ట్ కార్డులు పంపిణీ లో గుంటూరు జిల్లా రెండవ విడత అనగా ఆగస్ట్ నెల 30వ తేది నుండి మొదలవుతుందన్నారు. రైస్ కార్డుల పంపిణీ ప్రక్రియ ముందుగా ముద్రణ పూర్తయిన స్మార్ట్ రైస్ కార్డులు మండల కార్యాలయాలకు చేరుకుంటాయన్నారు. కార్యాలయం నుంచి మొబైల్ యాప్ డిజిటల్ అక్నాలెడ్జ్ మెంట్ ద్వారా చౌక డిపో షాపులకు (ఎఫ్ పి ఎస్) లకు పంపిణీ జరుగుతుందన్నారు. ప్రతి ఎఫ్ పి ఎస్ కు ఒక జి యస్ డబ్ల్యూ ఎస్ ఉద్యోగిని కేటాయించడం జరుగుతుందన్నారు. సచివాలయం సిబ్బంది పంపిణీని పర్యవేక్షణ చేయనున్నట్లు తెలిపారు. ఎఫ్ పి ఎస్ డీలర్లు లబ్దిదారుల నుంచి ఈపాస్ పరికరంలో అథెంటికేషన్ తీసుకుని కార్డులు పంపిణీ చేయాలని సూచించారు.

వృద్ధులు, వికలాంగులు మరియు అవసరమైన వారికి రెవెన్యూ లేదా గ్రామ సచివాలయం సిబ్బంది ఇంటి వద్దకే వెళ్లి కార్డులు అందిస్తారని తెలిపారు. ఈ ప్రక్రియను జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు డ్యాష్బర్డ్ ద్వారా పర్యవేక్షిస్తారు, దీనిలో రియల్ టైం అప్ డేట్లు కనిపిస్తాయని అందరూ కూడా సమన్వయంతో కలిసి రైస్ స్మార్ట్ కార్డులను సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా డీలర్లకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమం లో రెవెన్యూ సిబ్బంది చౌక ధరల దుకాణదారులు పాల్గొన్నారు.

# సురవరానికి కన్నీటి వీడ్కోలు

**ఘనంగా నివాళులర్పించిన సిఎం రేవంత్, డి.సిఎం భట్టి, ఏపి సిఎం చంద్రబాబు, సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంఎ బేబి, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కెటిఆర్ ప్రభృతులు, అధికార లాంఛనాలతో అంతిమయాత్ర,, భౌతికకాయం గాంధీ వైద్యకళాశాలకు అప్పగింత**



సురవరం సుధాకర్‌రెడ్డి భౌతికకాయాన్ని గాంధీ మెడికల్ కాలేజీకి అప్పగిస్తున్న కుటుంబ సభ్యులు. నివాళి అర్పిస్తున్న పోలీసులు

**హైదరాబాద్, (జర్నలిస్ట్‌ఫైల్) ఆగస్టు 25:** కమ్యూనిస్టు దిగ్గజం, భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డికి తెలంగాణ, ఏపి ముఖ్యమంత్రులతో పాటు పలువురు రాజకీయ పార్టీల నేతలు నివాళులర్పించారు. తెలంగాణరాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబి, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, మాజీ ఉప రాష్ట్రపతి ఎం వెంకయ్య నాయుడు, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావు, డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, తెలంగాణ శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, ధనసరి అనసూయ సీతక్క, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, డాక్టర్ కె.కేశవరావు, సుప్రీంకోర్ట్ మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి. రమణ, ఎంపిలు అయోధ్య రాంరెడ్డి, వద్దిరాజు రవిచంద్ర తదితరులు పూలమాలతో సుధాకర్ రెడ్డికి నివాళులర్పించారు. గతకొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సురవరం సుధాకర్ రెడ్డి శుక్రవారం రాత్రి హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే. మరణించిన అనంతరం సురవరం మృతదేహాన్ని శనివారం గచ్చిబౌలిలోని ఆయన నివాసంలో ఉంచగా.. ఆదివారం ప్రజల సందర్శనార్థం పార్టీ రాష్ట్రకార్యాలయమైన మగ్ధూం భవన్‌కి ఉదయం 10 గంటలకు తీసుకొచ్చారు. భౌతిక కాయాన్ని పార్టీ ఆఫీసుకి తీసుకొచ్చిన అనంతరం పలువురు రాజకీయ నేతలు, పార్టీ నేతలు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. మగ్ధూం భవన్ వద్ద గౌరవ సూచకంగా పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపారు. నివాళుల అనంతరం ప్రభుత్వ అధికారిక లాంఛనలు పూర్తయిన తరువాత గాంధీ మెడికల్ కాలేజీ వరకు అంతిమ యాత్ర కొనసాగింది. అంతిమయాత్ర ముగిసిన అనంతరం సురవరం భౌతికకాయాన్ని మెడికల్ కళాశాలకు ఆయన కుటుంబసభ్యులు అప్పగించారు. అంతిమయాత్ర పొడవునా కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి అమర్ రహే అంటూ సిపిఐ కార్యకర్తలు, నాయకులు నినాదాలు చేశారు. అంతిమ యాత్రలో సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా, జాతీయ కార్యదర్శి నారాయణ, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

**రాజీపడని సిద్ధాంతాలతో రాజకీయంగా ఎదిగిన నేతః ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి:** సిపిఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి పార్థివ దేహానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం ముగ్దూం భవన్‌లో పూలమాలతో శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. పేదలు, బహుజనుల కోసం పోరాడిన గొప్ప నేత సురవరం సుధాకర్ రెడ్డి అన్నారు. రాజీపడని సిద్ధాంతాలతో రాజకీయాల్లో ఎదిగిన నేత సురవరం అన్నారు. విద్యార్థి దశ నుంచి జాతీయస్థాయి నేతగా ఎదిగారని వెల్లడించారు. పాలమూరు జిల్లాకు వన్నె తెచ్చిన గొప్పనేతల్లో సురవరం ఒకరన్నారు. అధికారం ఉన్నా లేకున్నా తన సిద్ధాంతాలను ఎప్పుడూ వీడలేదన్నారు. సురవరం కుటుంబానికి తమ ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. ఆయన జ్ఞాపకార్థం ప్రభుత్వం ఏదైనా మంచి కార్యక్రమం చేపడుతుందని, దీనిపై మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. తమ ప్రభుత్వం గొప్ప నేతల పేర్లను పలు సంస్థలకు పెట్టిందని, అదే తరహాలో సుధాకర్ రెడ్డి సేవలనుఅందరూ స్మరించుకునేలా చేస్తామన్నారు.

**గతంలో కలిసి పోరాటాలు చేశాంః ఏపి సిఎం చంద్రబాబు :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సురవరం సుధాకర్ రెడ్డి భౌతిక కాయానికి నివాళులర్పించారు. సుధాకర్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రజల కోసం చేసిన సేవలను చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. అనంతరం చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. సుధాకర్ రెడ్డితో తనకు సుదీర్ఘ రాజకీయ సంబంధాలు ఉన్నాయన్నారు. గతంలో కలిసి పోరాటాలుచేసినట్లు గుర్తు చేశారు. సురవరం దేశ రాజకీయాల్లోనూ ప్రముఖపాత్ర పోషించారన్నారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా సేవలందించారన్నారు. ఢిల్లీలో వివిధ ప్రభుత్వాలు ఏర్పాటు చేసినప్పుడు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చేసిన ఉద్యమంలో, ఇతర అనేక సందర్భాల్లో కలిసి పోరాడినట్లు తెలిపారు. తనంటే సుధాకర్ రెడ్డికి ప్రత్యేక అభిమానం ఉండేదని, ఆయన్ను జీవితంలో ఎప్పుడూ మరచిపోలేనన్నారు.

**కెసిఆర్ వారితో ఉన్నఅనుభవాలను గుర్తు చేసుకున్నారు: కెటిఆర్:** సురవరంభౌతికకాయానికి బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళులు అర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో తనవంతు పాత్ర పోషించి చిరస్మరణీయ ముద్ర వేసుకున్న సురవరం సుధాకర్ రెడ్డి మరణం తమను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిం దన్నారు. విద్యార్థినాయకుడిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించి ఒక జాతీయ పార్టీకి ప్రధాన కార్య దర్శిగా ఏడేండ్ల పాటు బాధ్యతలు నిర్వహించడమంటేసామాన్యవిషయం కాదన్నారు. తెలంగాణ ఏర్పాటుకు సీపీఐ మద్దతులో ఆయన పాత్ర మరువలేనిదన్నారు. జాతీయస్థాయిలోతెలంగాణకు మద్దతు కూడగట్టడంలో ఆయనతో కలిసి పనిచేసే అవకాశం బీఆర్ఎస్‌పార్టీకి దక్కిందని కేసీఆర్‌వారితోఉన్నఅనుభవాలను గుర్తుచేసుకున్నారని, వారితరపునసువరంకి నివాళులర్పిస్తున్నామని చెప్పారు. తతత



ఆదివారం సురవరం భౌతిక కాయం వద్ద నివాళి అర్పిస్తున్న హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

# ఆదివాసీ గిరిజన బాలికపై సామూహిక అత్యాచారం?

**ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన**

**సంరక్షణ కేంద్రానికి బాలిక తరలింపు**

**కొత్తగూడెం క్రైం, ఆగస్టు 25(జర్నలిస్ట్‌ఫైల్):** ఆటో డ్రైవర్‌ను నమ్మిన ఆ మైనర్ బాలిక మోసపోయింది. ఆదివాసీ బాలికపై సామూహిక అత్యాచారం జరిగిన సంఘటన మూడు రోజుల తర్వాత ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి... చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లా దోర్నపాల్ సమీపంలోని బోదగూడెం గ్రామానికి చెందిన 17 సంవత్సరాల మైనర్ బాలిక బోదగూడెం నుంచి కుంటకు బస్సులో రాగా అక్కడ నుంచి శుక్రవాసం సాయంత్రం ఏపీలోని ఏడుగురాళ్లపల్లి సమీపంలో గొల్లగుప్పలో ఉన్న తన పిన్ని ఇంటికి వచ్చింది. తర్వాత తిరుగు ప్రయాణంలో కుంట వద్ద ఆటో ఎక్కింది. ఏడుగురాళ్లపల్లి సమీపంలోని గొల్లగుప్ప క్రాస్‌రోడ్‌లో దింపాలని అక్కడ మా వాళ్లు ఎవరైనా ఉంటారని అక్కడి నుంచి గొల్లగుప్పకు వెళ్తానని బాలిక చెప్పి ఆటో ఎక్కింది. ఈ క్రమంలో ఆటో డ్రైవర్లు మార్గమధ్యలో మైనర్ బాలికకు ఆటో డ్రైవర్లు కొంత దూరం అడవిలోకి తీసుకెళ్లి తనను మద్యం సేవించాలని బలవంతం చేయగా తాను తాగనని నిరాకరించడంతో వారు చేతులు, కాళ్లు పట్టుకొని బలవంతంగా తాగించారని, అప్పుడు తాను మత్తులోకి జారుకున్నానని, తనకు తర్వాత ఏం జరిగిందో కూడా గుర్తు లేదని సదరు బాలిక తెలిపింది. ఆ తర్వాత తాను పెద్దమ్మతల్లి గుడి వద్దకు ఎలా వచ్చిందో కూడా గుర్తు లేదని చెప్తుంది. శుక్రవారం రాత్రి సంఘటన జరిగిన తర్వాత పాల్వంచ పెద్దమ్మతల్లి ఆలయం ముందు డివైడర్‌లో నీరసంగా ఉన్న బాలికను చూసి రాత్రి సమయంలో విధులు నిర్వహించే వాచ్‌మెన్ గమనించి ఆమెను ఆలయ ఆవరణలోకి తీసుకొచ్చి అక్కడ ఆశ్రయం కల్పించారు. శనివారం ఉదయం ఆమె ఒంటిపై ఉన్న గాయాలు, చిరిగిన దుస్తులను చూసి వెంటనే ఇంటికెళ్లి తన కుమార్తె దుస్తులు తీసుకొచ్చి ఉదయం పారిశుధ్య పనులు చేయడానికి వచ్చిన మహిళలతో ఆమెకు దుస్తులు మార్పించారు. అక్కడి మహిళలు ఆమెను అడుగగా తనకు జరిగిన సంగతిని తెలుపుతుంది. దీంతో శనివారం మధ్యాహ్నం పాల్వంచ ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి చికిత్స అందించారు. ఆమె తీరును చూసి చైల్డ్ కేర్ సెంటర్‌కు ఫోన్ చేయగా అక్కడి నుంచి సఖి సెంటర్‌కు పంపించారు. సదరు బాలిక తాను ఎక్కడి నుంచి వచ్చింది... ఎక్కడికి వెళ్లి తిరుగు ప్రయాణంలో ఏం జరిగిందో విషయాలను చెప్తుంది కానీ తనపై జరిగిన అఘాయిత్యం తనకు గుర్తు లేదని, తనను బలవంతంగా మద్యం తాగించారని, ఆ తర్వాత తనకు ఏం జరిగిందో తెలియని, కళ్లు తెరిచి చూసే సరికి ఇక్కడ ఉన్నానని చెప్తుంది. దీనిపై పాల్వంచ పట్టణ పోలీస్ స్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలుస్తోంది.

ఈ విషయమై పాల్వంచ డీఎస్పీని వివరణ కోరగా మెడికల్ టెస్టు చేసిన తర్వాత కేసు నమోదు చేస్తామని తెలిపారు.

# సెప్టెంబరు 25న రామగుండం థర్మల్ కేంద్రం ఎన్నికలు

**నోటిఫికేషన్ విడుదల**

**హైదరాబాద్, ఆగస్టు 25(జర్నలిస్ట్‌ఫైల్):** రామగుండం నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ)లో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల నగారా మోగింది. సెప్టెంబరు 25న గుర్తింపు యూనియన్ ఎన్నికలను నిర్వహిస్తున్నట్లు చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్, ఎన్టీపీసీ దక్షిణ రీజియన్ సీజీఎం సూర్యనారాయణ్ పాణిగ్రహి, ఎన్నికల అధికారి, రామగుండం ప్రాజెక్టు ఏజీఎం విజయ్ కుమార్ సిక్దర్ వెల్లడించారు. ఈ మేరకు దీనికి సంబంధించి ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఈ ఎన్నికల నిమిత్తం ఇదే నెల 30వ తేదీ లోగా ఎన్టీపీసీలోని ప్రాతినిధ్య కార్మిక సంఘాలు తమ రిజిస్ట్రేషన్ పత్రాలు, వార్షిక నివేదికలను సమర్పించాలని వెల్లడించారు. సెప్టెంబరు 25న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం) ద్వారా పోలింగ్ నిర్వహించనున్నారు. అనంతరం అదే రోజు సాయంత్రం ఓట్ల లెక్కింపు ఉంటుంది. గుర్తింపు సంఘం ఎన్నికల ఫలితాల ఆధారంగా 2 నేషనల్ బైపాట్రియేట్ కమిటీ(ఎన్‌బిసి) సభ్యులుగా అవకాశముంటుంది. 60 శాతంకుపైగా ఓట్లు నమోదు చేసి విజయ సాధించిన యూనియన్ లోని ఇద్దరు సభ్యులకు ఎన్‌బిసిలో ప్రాతినిధ్యం కల్పిస్తారు. 60 శాతం కన్నా తక్కువ ఓట్లతో గెలిచిన సంఘానికి ఒకటి, రెండో స్థానంలో నిలిచిన యూనియన్‌కు మరో ఎన్‌బిసి సభ్యత్వం లభిస్తుంది. కాగా మూడేళ్లకు ఒకసారి జరిగే ఎన్టీపీసీ గుర్తింపు సంఘం ఎన్నికలకు సంబంధించి 2022 సెప్టెంబరు 19న ఎన్నికలు జరిగాయి.

# కేంద్రం సరఫరా చేయకపోవడంతోనే కొరత

**2.64 లక్షల టన్నుల యూరియా లోటు: వ్యవసాయ మంత్రి తుమ్మల**

**హైదరాబాద్, ఆగస్టు 25(జర్నలిస్ట్‌ఫైల్):** కేంద్రం రాష్ట్రానికి కేటాయించిన యూరియాను సరఫరా చేయక పోవడం వల్లే తెలంగాణలో ఆ ఎరువుకు కొరత ఏర్పడిందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనలో కేంద్రం తెలంగాణకు ఈ వానాకాలం సాగు నిమిత్తం 9.80 లక్షల టన్నుల యూరియా కేటాయింపులు చేసిందన్నారు. ఇందులో ఆ నెలాఖరు నాటికి 8.30 లక్షల టన్నుల యూరియా సరఫరా చేయాల్సి ఉందని తెలిపారు. అయితే ఇప్పటి వరకూ రాష్ట్రానికి 5.66లక్షల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే సరఫరా చేసిందని చెప్పారు. రాష్ట్రానికి ఇంకా 2.64 లక్షల టన్నుల యూరియా సరఫరా కావాల్సి ఉందని వెల్లడించారు. ఫలితంగా తెలంగాణలో యూరియా కొరత నెలకొందని స్పష్టం చేశారు.

ఈ నెలలో రాష్ట్ర వ్యాప్తంగా యూరియా వినియోగం ఎక్కువగా ఉండటం వల్ల అందుకు తగినట్లుగా సరఫరా లేకపోవడంతోనే రైతులు ఆందోళనగా ఉన్నార న్నారు. అయితే రాష్ట్రంలో యూరియా పక్కదారి పట్టిందని కేంద్ర మంత్రులు చేస్తున్న వ్యాఖ్యలు అర్థ రహితమని వ్యాఖ్యానించారు.



ఆదివారం సోషల్ మీడియా-ఐటి సోషల్ మీడియా వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు

# ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతిని ప్రజలకు తెలియజేయాలి

**సరైన సమాచారం చేరేలా చూడడం మనందరి బాధ్యత**

**సోషల్, ఐటి సోషల్ మీడియా వర్క్‌షాప్‌లో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు**

**హైదరాబాద్, ఆగస్టు 25(జర్నలిస్ట్‌ఫైల్):** సోషల్ మీడియా వారియర్లు ప్రతి ఒక్కరూ పార్టీ కార్యక్రమాలు, పార్టీ సిద్ధాంతం, మోడీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమం ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు తెలిపారు. ఆదివారం సోషల్ మీడియా-ఐటి సోషల్ మీడియా వర్క్‌షాప్‌లో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతి గురించి ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ఒక్కరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ పార్టీ తరఫున వచ్చిన సమాచారాన్ని పంచాలి, రీట్వీట్ చేయాలని, ఇలా చేస్తేనే మన సందేశం ప్రతి ఇంటికి చేరుతుందని, మన బలం పెరుగుతుందన్నారు. సోషల్ మీడియా, యూట్యూబ్ వేదికలను ఉపయోగించి తప్పుడు వార్తలు ప్రచారం చేయడం, పార్టీ కార్యకర్తల్లో విభేదాలు రేపే ప్రయత్నం చేయడం జరగకూడదన్నారు. అలాంటి చర్యలు ఎవరు చేసినా, చేయించినా, పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని, తప్పనిసరిగా క్రమశిక్షణా చర్యలు తీసుకుంటుందన్నారు. మనం పోస్ట్ చేసే ప్రతి విషయం ఎక్కువ మందికి చేరేలా అందరూ రీట్వీట్ చేయడం, షేర్ చేయడం తప్పనిసరి. ఇటీవల కొన్ని యూట్యూబ్ వీడియోలకు తప్పుదారి పట్టించే, ఆకర్షణీయంగా కనిపించే నెగెటివ్ థంబ్నైల్స్ జోడించి ప్రజల్లో మిస్‌ఇన్ఫర్మేషన్ పంచుతున్నారు. ఇలాంటి వాటిని నమ్మరాదు, పంచరాదు.


భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధులంతా పార్టీ సిద్ధాంతం, నరేంద్ర మోడీ ప్రభుత్వం చేపడు తున్న అభివృద్ధి - సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయా లన్నారు. ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిల పదవీకాలం ముగిసినా, 19నెలలుగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం తేలికగా తీసుకుంటుందని, స్థానిక సంస్థలు అంటే ఈ ప్రభుత్వానికి చిన్నచూపు అన్నారు. రాజ్యాంగంలోని 73వ, 74వ సవరణల ప్రకారం స్థానిక ఎన్నికలు జరపడం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత. కానీ ఓటమి భయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలను వాయిదా వేస్తుందన్నారు. అలాగే రైతు భరోసా పేరుతో రూ. 15 వేల చొప్పున ఇస్తామని చెప్పి చివరికి కేవలం రూ. 6 వేలే రెండు విడతల్లో ఇచ్చి ప్రజలను మోసం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు యూరియా విషయంలో కావాలనే కృత్రిమ కొరత సృష్టించి, మోదీ ప్రభుత్వాన్ని చెడుగా చూపించే ప్రయత్నం చేశారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం రైతుల పక్షాన నిలిచి రైతు సంక్షేమం కోసం అనేక చారిత్రక నిర్ణయాలు తీసుకుందన్నారు. ఎంపి డా.లక్ష్మణ్ మాట్లాడుతూ దేశమంతా ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంవైపుచూస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బిజెపి రోజురోజుకు బలపడుతుం దన్నారు.

## నేడు నిజామాబాద్‌లో పర్యటన

బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రాంచందర్‌రావు ఆదివారం నిజామాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు ఇందల వాయికు చేరుకుంటున్నారు. 10.30 గంటలకు కాళేశ్వర స్వామి దేవాలయంలో పూజలు నిర్వహిస్తారు దేవాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం ర్యాలీలో పాల్గొంటారు. ఈ ర్యాలీ నిజామాబాద్ జిల్లా శ్రీరామ గార్డెన్స్ వరకు జరుగనుంది. ఉదయం 11.30గంటలకు జిల్లా కార్యకర్తల సమ్మేళనంలో ముఖ్య అతిథిగా పాల్గొంటారు. మధ్యాహ్నం 2గంటలకు నూతనంగా నియామం అయిన జిల్లా పదాధికారుల సమావేశంలో పాల్గొంటారని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి తెలిపారు.

# గణేశ ఉత్సవాలకు పోలీసు శాఖ ఏర్పాట్లు

**చెరువులు, కుంటల వద్ద ఏర్పాట్లు ముమ్మరం...మట్టి విగ్రహాలకు పెరిగిన డిమాండ్**



**హైదరాబాద్, ఆగస్టు 25(జర్నలిస్ట్‌ఫైల్):** రాష్ట్రంలో గణేశ ఉత్సవాలకు పోలీసు శాఖ భారీ ఏర్పాట్లు చేబట్టింది. ఇతర ప్రాంతాలతో పోలిస్తే గ్రేటర్ పరిధిలో వినాయక ఉత్సవాలు భారీగా జరుగుతుండడం తెలిసిందే. దీని తరువాత ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, వరంగల్, నల్లగొండ జిల్లా లలో ఎక్కువగా ఈ వేడుకలు జరుగుతుంటాయి. ఇప్పటికే గణేష్ విగ్రహాల తయారీకి పేరొందిన ధూల్‌పేట్ సహా ఇతర ప్రాంతా లలో విగ్రహాల కొనుగోలు దారులతో సందడిగా వుండగా మరోవైపు విగ్రహాలను ప్రతిష్టించేందుకు ఆయా ప్రాంతాలకు చెందిన నిర్వాహకులు పోలీసుల అనుమతులు పొందుతూ మండపాల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఇంకోవైపు గణేష్ విగ్రహాల నిమజ్జనం కోసం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో చెరువులు, కుంటల వద్ద పోలీసు, పౌర విభాగాలు ఏర్పాట్లు చేయ సాగాయి. గణేష్ వేడుకలు మొదలవడానికి ఇంకా మూడురోజులే వుండడం తో పోలీసులు బందోబస్తు ఏర్పాట్లను మొదలు పెట్టారు. మరోవైపు మట్టి వినాయక విగ్రహాలకు డిమాండ్ బాగా పెరిగింది. విఐపిలు మొదలుకుని సామాన్యుల వరకు అందరు మట్టి విగ్రహాలను ప్రతిష్టించేందుకు మక్కువ చూపుతున్నారు. రాష్ట్రంలో బోనాల తరువాత అతిపెద్ద పండగా పేరొందిన గణేష్ ఉత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరమయ్యాయి. ఓవైపు పోలీసు, పౌర విభాగాలు మౌలిక వసతులు, బందోబస్తు విషయంలో నిమగ్నమవగా భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సహా ఆయా ప్రాంతాల ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో నిర్వాహకులు విగ్రహాల ప్రతిష్టకు ముహుర్తాలు ఖరారు చేసుకోసాగారు. ఈ నెల 27వ తేదీన గణేష్ ఉత్సవాలు మొదలవనుండడం తెలిసిందే. 27వ తేదీన ఉదయం నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు విగ్రహాల ప్రతిష్ట జరిగే వీలుంది. దేశ వ్యాప్తంగా పేరొందిన ఖైరతాబాద్ వినాయకుడు ఇప్పటికే సిద్ధమవగా బుధవారం ఉదయం నాటికి ఈ విగ్రహం సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుని పూజలకు సిద్ధమవనున్నాడు. మొత్తం మీద ఎత్తైన విగ్రహాలు రాష్ట్ర వ్యాప్తంగా లక్ష వరకు వుండనుండగా జంట నగరాలు, శివార్లలో 20 వేల వరకు వుండే వీలుంది. తక్కువ ఎత్తులో వున్న విగ్రహాలు మరో రెండు లక్షల వరకు వుండే వీలుంది. దీంతో పాటు చిన్నసైజు విగ్రహాలు, ఇంట్లో ప్రతిష్టించే చిన్న విగ్రహాలు మరో లక్ష వరకు వుండే వీలుంది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది వినాయక విగ్రహాల ధరలు బాగా పెరిగాయి. విగ్రహాల తయారీకి కావాల్సిన ముడి సరుకుల ధరలు పెరగడం వల్లే విగ్రహాల ధరలు పెంచాల్సి వచ్చిందని తయారీదారులు అంటున్నారు. 20 అడుగుల నుంచి 25 అడుగుల ఎత్తు కలిగిన విగ్రహాల ధరలు రూ.లక్ష నుంచి 2 లక్షల వరకు వుండడం గమనార్హం. నిమజ్జనం నాటికి గ్రేటర్ పరిధిలో 40 వేల మంది పోలీసులు బందోబస్తు కోసం రానుండగా ఇందులో ఇతర రాష్ట్రాల పోలీసులు కూడా వుండనున్నారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల లో స్థానిక పోలీసులకు తోడుగా స్పెషల్ పోలీసులు, సాయుధ బలగాలను రంగంలో దించనున్నారు.

## నిజామాబాద్ మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ కలకలం

**(జర్నలిస్ట్‌ఫైల్) ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఆగస్టు25:** ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ కలకలం రేపింది. జూనియర్, సీనియర్ మెడికోలు ఘర్షణకు దిగారు. ఎమ్‌బిబిఎస్ నాలుగో సంవత్సరం చదువుతున్న రాహుల్ ను సీనియర్ వేధించారు. ఎదురు తిరిగాడని రాహుల్‌ను సీనియర్లు తీవ్రంగా గాయపరిచారు. కాలేజీ విద్యార్థులు రాహుల్ ను ఆస్పత్రికి తీసుకువెళ్లి చికిత్స అందిస్తున్నారు. ఆసుపత్రిలో అర్థరాత్రి వరకు పంచాయితీ జరిగింది. రాహుల్ కాలేజీ యాజమాన్యానికి ఫిర్యాదు చేశారు. యాజమాన్యం ర్యాగింగ్ విషయం తెలియకూడదని ప్రయత్నం చేస్తున్నారు. బాధితుడికి న్యాయం చేయాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేశారు.



## ఎపి సిఎం సహాయ నిధికి చిరంజీవి రూ.కోటి విరాళం

**(జర్నలిస్ట్‌ఫైల్) ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు 25:** ఆంధ్రప్రదేశ్ సిఎం సహాయనిధికి మెగాస్టార్, మాజీ కేంద్ర మంత్రి చిరంజీవి విరాళం అందించారు. హైదరాబాద్‌లో సిఎం చంద్రబాబును ఆదివారం కలిసి రూ.కోటీ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వీరి మధ్య దాదాపు 40 నిమిషాల పాటు చర్చ జరిగింది. సహాయం అందించిన చిరంజీవికి చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. మెగాస్టార్ గతంలోనూ వరదసాయం కింద రూ.కోటీ అందించారని గుర్తు చేశారు.

## ఎసిబి కేసుల్లో నిందితులపై వెంటనే ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇవ్వాలి

**ప్రభుత్వానికి ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ డిమాండ్**

**హైదరాబాద్, ఆగస్టు (జర్నలిస్ట్‌ఫైల్) 25:** రాష్ట్రంలో ఎసిబి కేసుల్లో పట్టుబడుతున్న నిందితులపై ప్రభుత్వం వెంటనే ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇవ్వాలని, దీనివల్ల అవినీతి అధికారులకు త్వరగా శిక్షలు పడతాయని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ కార్యదర్శి పద్మనాభ రెడ్డి తెలిపారు. ఈ విషయంలో ప్రభుత్వ వైఖరి సవ్యంగా లేదని ఆయన తెలిపారు. ఎసిబి కేసులో అరెస్టవుతున్న వారు బెయిలుపై విడుదలవుతూ తమను ప్రాసిక్యూషన్ చేసే ఉత్తర్వులు రాకుండా సచివాలయంలో పైరవీలు చేసుకుంటూ ఇందులో సఫలం అవుతున్నారని సిఎం రేవంత్ రెడ్డికి రాసిన లేఖలో పద్మనాభ రెడ్డి తెలిపారు. ఇది సరైన పద్ధతి కాదని ఆయన తెలిపారు. ఎసిబికి పట్టుబడుతున్న వారిపై ప్రాసిక్యూషన్ కోసం ఎసిబి అధికారులు సర్కారును అనుమతి కోరుతుండగా దీనిపై సర్కారు స్పందన సవ్యంగా వుండడం లేదన్నారు. చాలా కేసుల్లో దీర్ఘకాలం పెండింగ్ తరువాత ప్రాసిక్యూషన్‌కు బదులు శాఖపరమైన చర్యలు లేదా కేసు విత్‌డ్రాగా వుంటున్నాయని ఆయన తెలిపారు. ఇలాంటి చర్యల వల్ల ప్రభుత్వ విభాగాల్లో అవినీతి అరికట్టడం ఎలా సాధ్యమని ఆయన ప్రశ్నించారు. ఈవిషయంలో సర్కారు తన వైఖరిని మార్చుకుని ప్రాసిక్యూషన్‌కుఅనుమతి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

# మరో రూ.2 వేల కోట్ల రుణానికి సర్కార్ ఇండెంట్

**ఈ ఆర్థికంలో రూ.33,900కోట్లకు చేరిన అప్పు**

**హైదరాబాద్, ఆగస్టు 25(జర్నలిస్ట్‌ఫైల్):** తెలంగాణ సర్కారు మరో రూ.2 వేల కోట్ల రుణం కావాలని రిజర్వ్ బ్యాంక్‌కు ఇండెంట్ పెట్టింది. దీనికి సంబంధించి ఆమేరకు ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్లను దాఖలు చేసింది. దీంతో రిజర్వు బ్యాంకు ఈ నెల 26న బహిరంగ మార్కెట్‌లో నిర్వహించే ఈవేలంలో పాల్గొని ఈ మొత్తాన్ని సేకరించనున్నట్లు రిజర్వ్ బ్యాంక్‌కు పెట్టిన ఇండెంట్‌లో పేర్కొంది. ఈ రూ.2 వేల కోట్ల మొత్తానికి గాను మూడు విడతలుగా సెక్యూరిటీ బాండ్లను సమర్పించింది. ఇందులో 26 ఏండ్ల కాలానికి రూ.500 కోట్లు, 28 ఏండ్ల కాలానికి రూ.1,000 కోట్లు, 30 ఏండ్ల కాలపరిమితితో మరో రూ.500 కోట్లు చొప్పన రుణ సమీకరణ కోసం సెక్యూరిటీ బాండ్లు పెట్టింది. ఈ విషయాన్ని రిజర్వ్ బ్యాంక్ ఒక ప్రకటనలో వెల్లడించింది. కాగా ప్రస్తుత 2025-26ఆర్థికసంవత్సరంలో మార్కెట్ రుణాల కింద రూ.54,009 కోట్లు సమీకరిస్తామని రాష్ట్ర సర్కార్ వార్షిక అంచనా బడ్జెట్‌లో ప్రతిపాదించింది. ఇందులో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన ఏప్రిల్ నుండి ఐదు నెలలు కూడా గడవకముందే ఈ నెల 12వ తేదీ వరకు రిజర్వ్ బ్యాంక్ నుండి మొత్తం రూ.31,900 కోట్లు రుణాన్ని సమీకరించింది. మళ్లీ తాజాగా ఈ నెల26వ తేదీన తీసుకోనున్న రూ.2 వేల కోట్ల రూపాయలు కలిపితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకూ రూ. 33,900 కోట్లు మేర రుణం తీసుకున్నట్లు అవుతుంది. ఈ లెక్కన వార్షిక అంచనా బడ్జెట్‌లో ప్రతిపాదించిన రుణసమీకరణలో 60 శాతాన్ని ఇప్పటికే దాటినట్లవుతుంది.

# వారాంతంలో తగ్గిన భక్తులు

**ఐదు గంటల్లోనే శ్రీవారి దర్శనం**

**తిరుమల,ఆగస్టు25(జర్నలిస్ట్‌ఫైల్):ప్రతి నిధి:** కలియుగ ప్రత్యక్షదైవం తిరు మల శ్రీవేంకటేశ్వర స్వామి దర్శ నానికి వారాంతం ఆదివారం భక్తులు రద్దీ తగ్గింది. గత రెండువారాలు కిటకిటలాడిన తిరుమల శని, ఆదివారాలు బాగా భక్తులు తగ్గు ముఖం పట్టారు. ఆదివారం ఒక్కరోజే సెలవు రావడం, పైగా బుధవారం వినాయకచవితి పర్వదినం ఉండ టంతో ఏడుకొండలు మోస్తరుగా భక్తులతో ఉంది. ఆదివారం ఉదయానికి వైకుంఠమ్‌లోని కంపార్టుమెంట్లలో సాధారణంగా భక్తులు ఉండటంతో ఉదయం వచ్చిన భక్తులను వచ్చినట్లే ఆలయంలోనికి అనుమతించారు. ఆపై మధ్యాహ్నం వరకు కూడా టైమ్‌స్లాట్ టోకెన్ భక్తులు, ముందుగా ఆన్‌లైన్‌లో దర్శన టిక్కెట్లు పొందిన భక్తులకు మూడుగంటల్లోనే స్వామివారి దర్శనం చేసుకునే అవకాశం కలిగింది. ఆదివారం సాయంత్రం వరకు 42వేలమంది భక్తులు మహాలఘులో దేవదేవుడిని దర్శించుకున్నారు. శనివారం అర్ధరాత్రివరకు 83,858మంది భక్తులకు దర్శనం కల్పించారు. మరో మూడునాలుగురోజులు ఇదే తరహాలో మోస్తరుగా భక్తులు ఉంటారని టిటిడి అంచనావేసింది.

# కళలలో అరుదైన గుర్తింపు పొందిన నందమూరి బాలకృష్ణ



**విజయవాడ, ఆగస్టు 25(జర్నలిస్ట్‌ఫైల్):**

వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, యూకే గోల్డ్ ఎడిషన్‌లో నందమూరి బాలకృష్ణ పేరు నమోదు చేయడం ఆనందకరమైనదని పటమటలంక లో నివాసముంటున్న బాలకృష్ణకు అత్యంత సన్నిహితులు బొర్రా గాంధీ తెలిపారు. తన కళపట్ల అవిరామమైన నిబద్ధతతో తనదైన గుర్తింపును సాధించుకున్నారన్నారు. 50సంవత్సరాలు అగ్ర హీరోలలో ఒకరిగా గుర్తింపు పొందిన బాలకృష్ణ అపూర్వ మైన సినిమా జైత్రయాత్రకి అత్యంత గౌరవప్రదమైనదిగా నిలుస్తుందన్నారు. తండ్రి, లెజెండరీ నందమూరి తారక రామారావు వారసత్వాన్ని కాపాడుకోవడమే కాకుం డా, టాలీవుడ్‌లో తన ఆల్ రౌండర్ ప్రతిభతో, శక్తివంతమైన స్క్రీన్ ప్రెజెన్స్ , తన కళపట్ల అవిరామమైన నిబద్ధతతో తనదైన గుర్తింపును సాధించుకున్నారని తెలిపారు.

# ఘనంగా ఏపి స్టేట్ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్



**విజయవాడ, ఆగస్టు 25(జర్నలిస్ట్‌ఫైల్):**

ఏపి టేబుల్ టెన్నిస్ అసోసియేషన్, ఎన్టీఆర్ డిస్ట్రిక్ట్ టేబుల్ టెన్నిస్ సంయుక్తంగా అందిస్తున్న ఆంధ్రప్రదేశ్ స్టేట్ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ 11,13,15 సంవత్సరాల లోపు విద్యార్థులకు 10వ డివిజన్ లోని ఫన్ టైమ్స్ (ఆర్టీసీ కాలనీ మున్సిపల్ ఇండోర్ స్టేడియం)లో ఆదివారం ప్రారంభమైనవి. ఈ కార్యక్రమానికి తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు గద్దె రామ మోహన్ ముఖ్యఅతిథిగా పాల్గొని టేబుల్ టెన్నిస్ టోర్నమెంటను ప్రారంభిం చారు. సందర్భంగా మాట్లాడుతూ క్రీడలతో శారీరక, దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం, మానసిక స్థితి గతి మారుతుందనీ పిల్లలకు తల్లిదండ్రులు చిన్నతనం నుండే క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించే విధంగా వుండాలని అన్నారు. స్థానిక కార్పొరేటర్ దేవినేని అపర్ణ మాట్లాడుతూ విజయం సాధించాలంటే కృషి ,పట్టుదల ఎంతో అవసరమని తల్లిదండ్రులు బాధ్యతతోనే పిల్లలకు బంగారు భవిష్యత్తు అందించ గలుగుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫన్ టైమ్స్ సెక్రటరీ కె.శివాజీ,వైస్ ప్రెసిడెంట్ బొర్రా గాంధీ,ఆర్గనైజింగ్ సెక్రటరీ కొసరాజు విజయ బాబు,ఇతర ఫన్ టైమ్స్ సభ్యులు, విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు. ఈ పోటీలో రాష్ట్రం లోని వివిధ అకాడమిల నుండి పాల్గొన్నారు. విజేత లైన క్రీడాకారులకు నిర్వాహకులు బహుమతులను అందించారు.

# కంగ్రాట్స్ బాలయ్య

**వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో ప్రముఖ నటుడు నందమూరి బాలకృష్ణ కు అరుదైన గౌరవం దక్కడంపై మంత్రి కందల దుర్గేష్ హర్షం**

**అమరావతి , ఆగస్టు 25(జర్నలిస్ట్‌ఫైల్):**



వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో ప్రముఖ నటుడు నందమూరి బాలకృష్ణ కు అరుదైన గౌరవం దక్కడం పై రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆనందం వ్యక్తం చేశారు. ఇటీవలే హీరోగా 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బ్రిటన్ కు చెందిన ప్రతిష్ఠాత్మక 'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్' ఆయనకు 'గోల్డ్ ఎడిషన్ రికగ్నిషన్' ఇవ్వడం గొప్ప విషయం అన్నారు. భారతీయ చలన చిత్ర పరిశ్రమలో ఈ అవార్డుకి ఎంపికైన తొలి నటులు బాలకృష్ణ కావడం యావత్ తెలుగు జాతికి గర్వకారణం అన్నారు. నందమూరి బాలకృష్ణ తన సుదీర్ఘ సినీ ప్రస్థానంలో కథానాయకుడిగా చేసిన వైవిధ్యమైన పాత్రలు అమోఘం అన్నారు. ఇప్పటికే 2025 జనవరిలో ఆయనకు భారతదేశంలో అత్యున్నతమైన పద్మ భూషణ్ అవార్డు లభించిందని, ఇప్పుడు ఏకంగా అంతర్జాతీయ అవార్డు వరించడం ఆయన అంకిత భావానికి నిదర్శనం అన్నారు. అదేవిధంగా ఇటీవల 71 వ జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో భాగంగా బాలకృష్ణ నటించిన భగవంత్ కేసరి చిత్రం ఎంపిక అయిందని, ఈ 2025 ఇయర్ లో బాలయ్యదే హవా అన్నారు. ఈ సందర్భంగా బాలయ్య బాబుకు మంత్రి కందుల దుర్గేష్ ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు.

# మధుమేహ వైద్యం.. పూర్తిగా ఆధునికం





- షుగర్ వ్యాధి గురించి భయపడాల్సిన అవసరం ఇక ఎంత మాత్రం లేదు
- అధునాతన చికిత్సలతో మధుమేహ వ్యాధిగ్రస్తుల జీవితాల్లో కొత్త వెలుగులు
- డయాబ్ ఎండో కాన్ 2025 సదస్సు ప్రారంభోత్సవంలో ప్రఖ్యాత డయాబెటాలజిస్ట్, యలమంచి డయాబెటిస్ రీసెర్చ్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ యలమంచి సదాశివరావు
- వివిధ అంశాలపై జాతీయ స్థాయి వైద్య ప్రముఖుల ప్రసంగాలు.. సదస్సుకు హాజరైన 500 మందికి పైగా ప్రతినిధులు
- డాక్టర్ అమర్ పాల్ సింగ్ కు గోల్డ్ మెడల్ ప్రదానం

**విజయవాడ, ఆగస్టు 25(జర్నలిస్ట్‌ఫైల్):**

మధుమేహ వైద్యం అత్యంత ఆధునికతను సంతరించుకుందని, షుగర్ వ్యాధి గురించి భయపడాల్సిన అవసరం ఇక ఎంత మాత్రం లేదని ప్రఖ్యాత డయాబెటాలజిస్ట్, యలమంచి డయాబెటిస్ రీసెర్చ్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ యలమంచి సదాశివరావు అన్నారు. యలమంచి డయాబెటిస్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డయాబ్ ఎండో కాన్ 2025 సదస్సు నిర్వహించారు. లబ్బీపేటలోని హోటల్ జీఆర్టీ గ్రాండ్ నందు ఆదివారం జరిగిన ఈ సదస్సులో డాక్టర్ సదాశివరావు ప్రసంగిస్తూ.. అధునాతన చికిత్సలతో మధుమేహ వ్యాధిగ్రస్తుల జీవితాల్లో కొత్త వెలుగులు విరబూస్తాయని అన్నారు. శరీర బరువు క్రమబద్ధీకరణకు ప్రస్తుతం అత్యంత ప్రాధాన్యనిస్తున్నామని, శరీర బరువును అదుపులో ఉంచుకోవడం ద్వారా మధుమేహాన్ని నియంత్రించుకోవడంతో పాటు గుండె జబ్బుల ముప్పు నుంచి కూడా తప్పించుకోవచ్చని వివరించారు. త్వరితగతిన శరీర బరువు తగ్గించేందుకు ఇంజెక్షన్లు అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఇన్సులిన్ ఇంజెక్షన్ల నుంచి త్వరలో విముక్తి లభిస్తుందని, ఇన్సులిన్ సులువుగా తీసుకోగలిగేలా ఇన్హేలర్లు అందుబాటులోకి రానున్నా యని వెల్లడించారు. ఆధునిక వైద్య విజ్ఞానాన్ని ఎప్పటి కప్పుడు అందిపుచ్చుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించే లక్ష్యంతో ప్రతి ఏటా డయాబ్ ఎండో కాన్ సదస్సు నిర్వహిస్తూ వస్తున్నామని డాక్టర్ యలమంచి సదాశివరావు పేర్కొన్నారు. ఈ సదస్సులో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన జాతీయ స్థాయి వైద్య నిపుణులు పలు అంశాలపై ప్రసంగించారు. ఆధునిక చికిత్సా పద్ధతులు, నూతన ఆవిష్కరణల గురించి విశ్లేషించారు. మధుమేహ నియంత్రణలో గట్ మేనేజ్మెంట్, ఆధునిక చికిత్సల ద్వారా డీ-యాక్సలే ఒషన్ మందుల వినియోగం తగ్గించడం, ఏఐ టెక్నాలజీ వినియోగం, టైప్-1 డయాబెటిస్ భవిష్యత్ చికిత్స లు, మధుమేహం ముప్పును వాయిదా వేయడం, కిడ్నీ వ్యాధులను తిప్పికొట్టడం, జీఐపీఆర్ ట్రీట్మెంట్ ద్వారా రక్తకణాల వ్యవస్థను సంరక్షించడం, ఆస్టియో పోరోసిస్ నిర్వహణ, ఫాటీ లివర్ నిర్ధారణ-చికిత్సలు, లాంగివిటీ ఇన్ డయాబెటిస్, అడల్ట్ వ్యాక్సినేషన్, క్యాన్సర్ మందుల క్యాన్సర్ మందుల కార ణంగా సంతాన లేమి వంటి అనేక కీలక అంశాలపై సదస్సులో చర్చించారు. ఈ ఏడాది, ప్రముఖ డయా బెటాలజిస్ట్ డాక్టర్ అమర్ పాల్ సింగ్ కు గోల్డ్ మెడల్ ప్రదానం చేశారు. 500 మంది ప్రతినిధులు పాల్గొన్న ఈ సదస్సులో వైడీఆర్ఎఫ్ జాయింట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ హిమన యలమంచి, సెక్రటరీ ఐశ్వర్య యలమంచి, జాయింట్ సెక్రటరీ అమూల్య యలమంచి పాల్గొన్నారు.

# ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

**హనుమాన్ జంక్షన్, ఆగస్టు 25(జర్నలిస్ట్‌ఫైల్):**



బాపులపాడు మండలం కానుమోలు జిల్లా పరిషత్ హైస్కూల్ లో ది హనుమాన్ జంక్షన్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో విజయవాడకు చెందిన హృదయాలయ హాస్పటల్ కు చెందిన డాక్టర్ శివరాం ప్రసాద్, డాక్టర్ బళ్ళా నాగార్జున, డాక్టర్ దాట్ల దివ్య సరోజ, డాక్టర్ సూర్య వంశీ, గుండె జబ్బులు సంబంధించిన పరీక్షలు, బీపీ, షుగర్, ఈసీజీ, ఎకో, వంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. శంకర్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ అండ్ రీసెర్చ్ సెంటర్ కు చెందిన డాక్టర్ నాదెళ్ల విష్ణువర్ధన్, డాక్టర్ నాదెండ్ల స్వాతి, డాక్టర్ యువాన్ లు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు కళ్ళజోళ్ళు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ది హనుమాన్ జంక్షన్ రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు యర్రంశెట్టి సాయి సదా స్వప్న కుమార్ మాట్లాడుతూ మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని, 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేసినట్లు ఆయన తెలియజేశారు. హనుమాన్ రైస్ ట్రేడర్స్ అధినేత పొట్లూరి సీతారాం ప్రసాద్ మాట్లాడుతూ మన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అట్టడుగున ఉన్న పేద ప్రజల సాధికారిత కోసం ప్రవేశపెట్టిన పీ-4 కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకొని గన్నవరం శాసనసభ్యులు ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాలు మేరకు బాపులపాడు మండలంలో ఏడు మెగా వైద్య శిబిరాలు నిర్వహించాలని నిర్ణయించామని ఈరోజు మొదటి మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని పొట్లూరి ప్రసాద్ అన్నారు. శ్రీ మారుతి రైస్ ట్రేడర్స్ అధినేత పొట్లూరి శ్రీరామ్ మూర్తి మాట్లాడుతూ మెగా వైద్య శిబిరంలో 150 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు కళ్ళజోళ్ళు ఉచితంగా అందజేశా మని, ప్రజలు ఉచిత మెగా వైద్య శిబిరాలలో పాల్గొని ఉచితంగా అందజేస్తున్న వైద్య సేవలను సద్వినియోగ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ది హనుమాన్ జంక్షన్ రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి బళ్ళా వీర వెంకట్రావు, పి ఎస్ ఆర్ ప్రసాద్, పొట్లూరి రాము, కొండా హరి కిషన్ రాజు, లింగమల్లు సంతోష్, కొమ్మన వెంకట శ్రీధర్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వేగిరెడ్డి పాపారావు, దన్నే దుర్గారావు దుర్గారావు, చింతల అప్పారావు, పొట్లూరి వెంకటేశ్వరరావు, చలసాని శ్రీనివాసరావు, వీరపనేని రాజేశ్వరరావు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త నండూరి శర్మ తదితరులు పాల్గొన్నారు.

# సమతక్లబ్ సేవలు స్ఫూర్తిదాయకం





- సమతక్లబ్ ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన
- అదర్శప్రాయంగా సమతక్లబ్ వైద్యశిబిరం
- ప్రభుత్వ విప్,ఎంఎల్ఏ తంగిరాల సౌమ్య

**నందిగామ, ఆగస్టు 25(జర్నలిస్ట్‌ఫైల్):**

సమాజ సేవ చేయాలనే అలోచన రావడం గొప్ప విషయమని, ఎంతో మందిని అలోచింపజేస్తుందని, సమతక్లబ్ చేస్తున్న కార్యక్రమాలు అందరికి స్ఫూర్తిని నింపుతాయని, సమాజ సేవలో ప్రతి ఒక్కరు ముందుకు రావాలని ప్రభుత్వ విప్,ఎంఎల్ఏ తంగిరాల సౌమ్య పిలుపునిచ్చారు. సమత క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రభుత్వ విప్ ఎంఎల్ఏ తంగిరాల సౌమ్య ప్రారంభించారు. స్థానిక నందిగామ చందమామ పేట, జర్మనీ హాస్టల్ అవరణలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ప్రభుత్వ విప్ మరియు శాసన సభ్యులు తంగిరాల సౌమ్య సందర్శించారు. ఈ శిబిరంలో సుమారు 250 మందికి పైగా మధుమేహం, బీపీ, ఈసీజీ,టూడీ ఇకో పరీక్షలు నిర్వహించి వైద్య సలహాలు, మందులు ఉచితంగా పంపిణీ చేశారు. పాల్గొన్న వైద్య బృందం లో. డాక్టర్ అభిషిక్త్ జనరల్ సర్జన్, (యఫ్ఎంఏయస్) డాక్టర్ శౌరి, ఆర్థోపెడీషియన్ ఎయిమ్స్ మంగళగిరి. డా' కొత్తపల్లి సత్యనారాయణ యండీ, నాచురోపతి. డా వై హరికృష్ణ యండీ ఫిజీషియన్ .డా శివకుమార్ యం. డి .,ఎ.సి .యు.డా కొత్తపల్లి సాయిరూప యండీ ఫిజీషియన్ .డా ఆముక్త మిట్టపల్లి, యం బీ బీ యస్ .డా యం గణేష్ యమ్ బీ బీ యస్. డాయస్ సుకుమార్ ఫెలోషిప్ ఇన్ కార్డియా లజీలు వైద్య సేవలు అందించి పలు సూచనలు చేశారు. కోట రవీంద్రనాథ్ అధ్యక్షత వహించిన ఈ సభలో ప్రత్యేక అతిధిగా కంచికచర్ల విద్యాశాఖాధికారి గురునాథం, సమత క్లబ్ సభ్యులు కె.జడ్.యస్. కుమార్, నలికిటి దేవ కుమార్, కొత్తపల్లి సుందర్, మాదాల కిశోర్, తాళ్లూరి రజనీ కాంత్, బచ్చలకూర పుష్ప రాజ్ కోట దేవదాసు, పత్తి పాటి సూర్యం, ఐలపోగు సర్వేశ్వరరావు, ముల్లంగి శ్రీనివాసరావు,కరిసె వెంకట రత్నం, బొజ్జా దేవిడ్రాజు,పటాపంచల రామారావు, వీసం శ్రీధర్,తాళ్లూరి దేవిడ్ సన్,యరగొర్ల ఉదయ్ కిరణ్ ,కరిసె వరప్రసాద్ లు పాల్గొన్నారు. నందిగామ ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ వేపూరి నాగేశ్వరరావు ప్రత్యేక అతిధిగా హాజరైయ్యారు.

# రష్యాపై విరుచుకుపడ్డ ఉక్రెయిన్..
## అణువిద్యుత్ ప్లాంట్‌పై డ్రోన్ దాడి

**మాస్కో, ఆగస్టు 25 :** రష్యా పశ్చిమ ప్రాంతంలోని కుర్స్క్‌లోని అణు విద్యుత్ ప్లాంట్‌పై ఉక్రెయిన్ డ్రోన్లతో దాడులు చేసిందని మాస్కో ఆదివారం ఆరోపించింది. ఉక్రెయిన్ ఆదివారం 34వ స్వాతంత్ర్య వేడుకలు జరుపుకోవడం విశేషం. రాత్రి సమయంలో అనేక ఇంధన, విద్యుత్ ప్లాంట్లపై దాడులు చేసినట్లుగా రష్యన్ అధికారులు పేర్కొన్నారు. కుర్స్క్‌లోని ప్లాంట్‌లో మంటలు చెలరేగాయని.. సకాలంలోనే మంటలను అదుపులోకి తీసుకువచ్చినట్లు పేర్కొంది. ఈ దాడుల్లో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని పేర్కొంది. డ్రోన్ దాడిలో ప్లాంట్ ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతిన్నదని.. రేడియేషన్ లెవల్స్ సాధారణంగానే ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. ఈ సంఘటన గురించి తమకు సమాచారం అందిందని అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ తెలిపింది. అణు స్థావరాల భద్రతను అన్ని విధాలుగా నిర్ధారించాలని ఏజెన్సీ చీఫ్ రాఫెల్ మరియానో గ్రాస్సీ పేర్కొన్నారు. ఈ సంఘటనపై ఉక్రెయిన్ స్పందించలేదు. ఆదివారం రాత్రికి 95 ఉక్రెయిన్ డ్రోన్‌లను కూల్చివేసినట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ పేర్కొంది. రష్యా కూడా ఉక్రెయిన్‌పై 72 డ్రోన్‌లు, ఒక క్రూయిజ్ క్షిపణిని ప్రయోగించింది. వాటిలో 48 ఉక్రెయిన్ వైమానిక దళం నాశనం చేసింది. రష్యాలోని లెనిన్‌గ్రాడ్ ప్రాంతంలోని ఉస్ట్‌లుగా ఓడరేవులో మంటలు చెలరేగాయి.

ఉక్రెయిన్ డ్రోన్ శకలాలు ఇక్కడి ఇంధన ఎగుమతి కేంద్రంపై పడడంతో మంటలు చెలరేగాయి. కీవ్‌లోని ఇండిపెండెన్స్ స్క్వేర్ నుంచి వీడియో సందేశంలో అధ్యక్షుడు జెలెన్‌స్కీ దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. భద్రత, శాంతియుత జీవితం సాధ్యమయ్యే భవిష్యత్తును ఉక్రెయిన్ నిర్మిస్తోందని పేర్కొన్నారు.

మన భవిష్యత్తు మన చేతుల్లోనే ఉందని జెలెన్‌స్కీ పేర్కొన్నారు. ఇటీవల జరిగిన అమెరికా రష్యా అలాస్కా సమావేశాన్ని ప్రస్తావిస్తూ.. ప్రపంచం ఉక్రెయిన్‌ను గౌరవిస్తుందని, దానిని సమానంగా చూస్తుందని ఆయన అన్నారు. కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ సైతం కీవ్‌కు చేరుకుని జెలెన్‌స్కీని కలిశారు. ఉక్రెయిన్‌కు నార్వే ఏడు బిలియన్ క్రోనర్ల (సుమారు 695 మిలియన్ డాలర్లు) కొత్త సైనిక సహాయాన్ని ప్రకటించింది. తూర్పు భాగంలోని డొనెట్స్క్ ప్రాంతంలోని రెండు గ్రామాలను తమ సైన్యం స్వాధీనం చేసుకుందని రష్యా పేర్కొంది.



# అంతరిక్షంలో సుదూర తీరాలను శోధిద్దాం
## శాస్త్రవేత్తలకు ప్రధాని మోడీ పిలుపు

**న్యూఢిల్లీ, ఆగస్టు 25 :** మానవాళి భవిష్యత్తును మరింత ప్రకాశవంతం చేసేందుకు అంతరిక్షంలో సుదూర తీరాలను శోధించేందుకు సిద్ధం కావాలని శాస్త్రవేత్తలకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ పిలుపునిచ్చారు. బవిష్యత్తులో చేపట్టనున్న అంతరిక్ష మిషన్లకోసం పెద్ద ఎత్తున వ్యోమగాములను సిద్ధం చేస్తున్నామని, యువత ఇందులో భాగం కావాలని సూచించారు. జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా దేశ వ్యాప్తంగాఉన్న అంతరిక్ష శాస్త్రవేత్తలు, విద్యార్థులు, విధానకర్తనుద్దేశించి ప్రసంగించారు. మనం చంద్రుడు, అంగారకుడిని చేరుకున్నాం. ఇప్పుడు అనేక రహస్యాలు దాగున్న రోదసిలోని సుదూర తీరాలపై పరిశోధనలు చేయాల్సి ఉంది. దానివల్ల భవిష్యత్తు తరాలకు మరిన్ని వెలుగు ప్రసాదించే అవకాశం దక్కుతుంది. అంతరిక్ష రంగంలో ఒకదాని తర్వాత మరో విజయం మనకు, మన శాస్త్రవేత్తలకు ఆనవాయితీగా మారిపోయింది. ఏ సరిహద్దు చివరిది కాదని మనకు విశ్వం చెబుతోంది అని మోడీ పేర్కొన్నారు. 2040లో భారత్ సొంతంగా చేపట్టే అంతరిక్ష యాత్రలో భారత వ్యోమగామి చంద్రుడిపై అడుగుపెట్టి త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి వికసిత్ భారత్ ఖ్యాతిని చాటుతారని పునరుద్ఘాటించారు. భవిష్యత్తులో ఏడాదికి 50 రాకెట్లను ప్రయోగించే స్థితికి మనం చేరుకోగలమా అని అంతరిక్ష శాస్త్రవేత్తలను ఆయన ప్రశ్నించారు. శాస్త్రవేత్తలు చేస్తున్న కృషితో త్వరలో గగన్‌యాన్ మిషన్‌ను ప్రారంభించనున్నామని, మరి కొన్నేళ్లలో సొంత అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసుకుంటామని పేర్కొన్నారు. అంతరిక్ష రంగ అభివృద్ధికి ప్రైవేటు రంగం మరింతగా ముందుకు రావాలని సూచించారు. అంతరిక్ష విజన్‌లో భాగంగా తదుపరి తరం సంస్కరణలను తెచ్చేందుకు ప్రభుత్వం సంకల్పించిందని తెలిపారు.

# గగన్‌యాన్ మిషన్..
## ఎయిర్ డ్రాప్ టెస్ట్ విజయవంతం



**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** భారత్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గగన్‌యాన్ అంతరిక్ష ప్రాజెక్టుఓ ఇస్రో మరో ముందడుగు వేసింది. క్రూ మాడ్యూల్‌కు సంబంధించి తొలి ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డ్రాప్ టెస్టును విజయవంతంగా నిర్వహించింది. వాయుసేన, నౌకాదళం, డిఆర్డీఓ, కోస్ట్‌గార్డ్‌ల సంయుక్త సహకారంతో ఈ పరీక్షలు చేపట్టింది. ఈ ప్రయోగంలో భాగంగా మాడ్యూల్ నమూనాను హెలికాప్టర్ సాయంతో నింగిలోకి తీసుకెళ్లి కిందకి జారవిడిచారు. పారాచూట్ల సాయంతో ఆ మాడ్యూల్ వేగాన్ని తగ్గించుకుంటూ సముద్ర జలాల్లో సురక్షితంగా దిగింది. మానవసహిత అంతరిక్ష ప్రయోగాల సమయంలో వ్యోమగాములు భూమికి సురక్షితంగా తిరిగి వచ్చేందుకు దీన్ని ఉపయోగిస్తారు. మాడ్యూల్ భూవాతావరణంలోకి ప్రవేశించిన అనంతరం దాని వేగ నియంత్రణ, ల్యాండింగ్ విషయంలో పారాచూట్ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుంది. సంక్లిష్టమైన ఈ వ్యవస్థ పనితీరును పరీక్షించడమే లక్ష్యంగా ఈ ప్రయోగం చేపట్టినట్లు సమాచారం. భారత వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపే లక్ష్యంతో చేపట్టిన గగన్‌యాన్ మిషన్‌లో భాగంగా ఇస్రో అనేక పరీక్షలు నిర్వహిస్తోంది. జులైలో సర్వీస్ మాడ్యూల్ ప్రొపల్షన్ సిస్టమ్‌కు సంబంధించిరెండు హాట్ టెస్టులను విజయవంతంగా చేపట్టింది. 2027లో తొలి మానవసహిత అంతరిక్ష యాత్ర నిర్వహించనున్నట్లు కేంద్రమంత్రి జితేంద్రసింగ్ ఇటీవల వెల్లడించారు.

# నోయిడాలో భార్యను చంపిన కిరాతకుడిపై పోలీసు కాల్పులు

**హైదరాబాద్, ఆగస్టు 25:** యుపిలోని నోయిడాలో కట్టుకున్న భార్యను చిత్రహింసలకు గురిచేసి పెట్రోల్ పోసి కాల్చి చంపిన కిరాతకుడు ఆదివారం ఉదయం పోలీసులపై దాడిచేసి తప్పించుకునే క్రమంలో జరిగిన కాల్పుల్లో గాయపడ్డాడు. కాల్పుల్లో గాయపడ్డ నిందితుడిని పోలీసులు వెంటనే ఆసుపత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది. వివరాలు ఇలావున్నాయి. నోయిడాలో నిక్కి భాటి అనే మహిళను ఆమె భర్త విపిన్ శ నివారం నాడు చిత్రహింసలకు గురిచేసి పెట్రోల్ పోసి కాల్చడం తెలిసిందే. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ ఆమె ఆసుపత్రిలో మరణించింది. తన తల్లిని తండ్రి హింసించి చంపినట్లు హతురాలి కుమారుడు పోలీసులకు వాంగ్మూలం ఇవ్వడంతో ఈ కేసు సంచలనంగా మారింది. కాగా ఈ ఘటన పై వెంటనే స్పందించిన నోయిడా పోలీసులు విపిన్ సహా అతని కుటుంబ సభ్యులను అరెస్టు చేశారు. విచారణలో భాగంగా విపిన్‌ను ఆదివారం ఉదయం అతని ఇంటికి తీసుకువెళ్లి భార్యను ఎలా చంపాడనే దానిపై సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేశారు. ఈ సమయంలో విపిన్ పోలీసులపై దాడికి దిగి వారి వద్ద వున్న తుపాకి లాక్కుని కాల్పులకు దిగాడు. అయితే దీనిపై పోలీసులు వెంటనే స్పందించి ఎదురు కాల్పులకు దిగి విపిన్ కాలిపై కాల్చారు. ఈ కాల్పుల్లో విపిన్ ఎడమ కాలికి బుల్లెట్ గాయం అయ్యింది.

విపిన్ జరిపిన కాల్పుల్లో పోలీసులకు ఎలాంటి గాయాలు తగలలేదు.

# భారత్! ట్రంప్‌ను సీరియస్‌గా తీసుకో!
## అమెరికా రిపబ్లికన్ నిక్కీ హేలీ



**వాషింగ్టన్, ఆగస్టు 25 :** రష్యా నుంచి చమురు కొనుగోళ్ల విషయంలో ట్రంప్ లేవనెత్తిన అభ్యంతరాన్ని భారత్ సీరియస్‌గా తీసుకోవాలని అమెరికా రిపబ్లికన్ నిక్కీ హేలీ సూచించారు. భారత్‌కు మంచి మిత్రురాలిగా ఆమెకు పేరున్న విషయం తెలిసిందే. న్యూఢిల్లీ-వాషింగ్టన్ మధ్య తాజా విభేదాలను ఉద్దేశించి ఆమె ఎక్స్‌లో పోస్టు చేశారు. 'రష్యా నుంచి చమురు విషయంలో ట్రంప్ లేవనెత్తిన అభ్యంతరాలను భారత్ సీరియస్‌గా తీసుకోవాలి. దాని పరిష్కారం కోసం వీలైనంత త్వరగా శ్వేతసౌధంతో కలిసి పనిచేయాలి. దశాబ్దాలుగా రెండు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాల మధ్య ఉన్న స్నేహం, విశ్వాసమే.. ప్రస్తుత ఒడుదొడుకులను దాటేందుకు బలమైన పునాదిగా ఉపయోగపడుతుంది. వాణిజ్యంలో, రష్యా చమురుపై అభిప్రాయభేదాలు వంటివి పరిష్కరించుకోవడానికి బలమైన చర్చలు, సంప్రదింపులు అవసరం. చైనాను ఎదుర్కోవడానికి అమెరికాకు న్యూఢిల్లీలో మిత్రులు ఉండాలన్న అంశం చాలా ముఖ్యమైంది. దానిని ఏమాత్రం విస్మరించకూడదు' అని ఆమె పోస్టు చేశారు. ఆంక్షలు విధించి భారత్‌ను అమెరికా దూరం చేసుకోవడంపై నిక్కీ హేలీ గతంలోనూ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. చైనాను ఎదుర్కోవాలన్న వ్యూహాత్మక లక్ష్యాల సాధనకు ట్రంప్ నిర్ణయాలు విపత్కరంగా మారాయని ఇటీవల ఆమె పేర్కొన్నారు. ఇటీవల ఓ పత్రికకు రాసిన కాలమ్‌లో ఆమె స్పందిస్తూ 'ప్రపంచంలో ఆరోవంతు జనాభాకు కేంద్రం భారత్. అత్యంత యువ జనాభాతో చైనాను దాటేసింది. మరోవైపు డ్రాగన్ జనాభాలో వృద్ధుల సంఖ్య గణనీయంగా పెరుగోంది. ప్రపంచంలోనే అత్యంత వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థ భారత్' అని పేర్కొన్నారు. మరోవైపు భారత్ వంటి మిత్రదేశాలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దూరం చేసుకోవడంపై మాజీ విదేశాంగ మంత్రి జాన్ కెర్రీ కూడా ఆందోళన వ్యక్తం చేశారు. నిజమైన దౌత్య ప్రయత్నాలు జరగకుండా, అల్టిమేటంలు జారీ చేయడం సరికాదని అభిప్రాయపడ్డారు. భారత్, అమెరికా మధ్య పోరు దురదృష్టకరమని అభివర్ణించారు. 'అమెరికా అధ్యక్షుడు ట్రంప్, భారత ప్రధాని మోడీ మధ్య ఈ పోరాటం దురదృష్టకరం. సాధారణ వ్యాపార విధానంలో దౌత్య ప్రయత్నం లేకుండా గొప్ప దేశాలు ఎల్లప్పుడూ ప్రజలకు అల్టిమేటం ఇవ్వడం ద్వారా గొప్పతనాన్ని ప్రదర్శించవు. మాజీ అధ్యదు బరాక్ ఒబామా పాలనలో చర్చలు, పరస్పర సహకారం, గౌరవం ద్వారా జరిగాయి. కానీ, ఇప్పుడు కొంచెం ఎక్కువ ఆదేశాలు, ఒత్తిడితో జరుగుతున్నాయి' అని జాన్ కెర్రీ తెలిపారు. రష్యా నుంచి భారత్ దిగుమతి చేయడంపై అమెరికా తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. ఉక్రెయిన్ యుద్ధానికి ఈ చమురు సొమ్ము ఉపయోగపడుతోందని.. భారత్ అవసరం వెతుక్కోని వ్యాపారం చేస్తోందని ట్రంప్ సలహాదారుడు పీటర్ నవారో తీవ్ర ఆరోపణలు చేశారు. ట్రంప్ 25 శాతం పెనాల్టీలను భారత్ దిగుమతులపై విధించారు. ట్రంప్ కార్యవర్గం కీలకం నాయకులు న్యూఢిల్లీపై తరుచూ నోటికొచ్చినట్లు ఆరోపణలు చేస్తున్నారు. మరోవైపు చమురు ధరలు పెరిగితే 150 కోట్ల మంది ప్రజలు ఇబ్బంది పడతారని భాతర్ వాదిస్తోంది.

# డికె శివకుమార్ బాటలో మరో ఎమ్మెల్యే.. ఆరెస్సెస్ గీతాలాపన!

**బెంగళూరు, ఆగస్టు 25 :** కర్ణాటక అసెంబ్లీలో ఇటీవల డిప్యూటీ సిఎం డికె శివకుమార్‌ఆరెస్సెస్ గీతాన్ని ఆలపించి చర్చకు తెరలేపారు. తాజాగా ఆయన బాటలోనే మరో కాంగ్రెస్ ఎమ్మెల్యే హెచ్‌డి రంగనాథ్ ఆరెస్సెస్ గీతాలాపన చేశారు. అంతేకాదు ఆ గీతాన్ని ఆలపించడంలో తప్పేముందని వ్యాఖ్యానించారు. తుమకూరు జిల్లా కునిగల్ నియోజకవర్గం ఎమ్మెల్యే రంగనాథ్ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా ఆయన ఆరెస్సెస్ గీతం నమస్తే సదా వత్సలను ఆలపించారు. ఈ గీతం చాలా బాగుంది. డిప్యూటీ సిఎం డికె శివకుమార్ అసెంబ్లీలో ఆలపించిన తర్వాత నేనూ విన్నాను. దాని అర్థం కూడా తెలుసుకున్నాను. జన్మభూమికి వందనం చేయాలి అనే అర్థముంది. అందులో నాకేమి తప్పుగా అనిపించలేదు. కాంగ్రెస్ లౌకిక పార్టీ. మేం ఇతరుల నుంచి మంచిని స్వీకరిస్తాం. ఆ గీతాన్ని ఆలపించడంలో తప్పేముంది అన్నారు.

# దుబాయిలో ఆటోమేటెడ్ స్మార్ట్ పోలీస్‌స్టేషన్
## మానవ జోక్యం లేకుండానే పోలీసు సేవలు!

**అబుదాబి, ఆగస్టు 25 :** ప్రజా సేవలకు ఆధునిక సాంకేతికతను జోడించే విషయంలో దుబాయ్ మరో ముందడుగు వేసింది. మానవ జోక్యం లేని పూర్తి ఆటోమేటిడ్ స్మార్ట్ పోలీస్ స్టేషన్‌ను డ్రాగన్ మార్ట్‌లో ప్రారంభించింది. దీంతో కృత్రిమ మేధ ఆధారిత పాలనలో దుబాయ్ ప్రపంచ నాయకత్వ స్థానాన్ని మరింత పదిలం చేసుకుంది. పౌరులు, పర్యాటకులు ఇప్పుడు 24 గంటలూ పూర్తిగా ఆటోమేటెడ్, మానవ జోక్యం లేని పోలీసు సేవలు 27 ప్రదేశాల్లో అందుబాటులోకి వచ్చాయి. మధ్య ఆసియాలో స్మార్ట్ పోలీస్ స్టేషన్లు తొలిసారి తీసుకొచ్చిన దుబాయ్.. విప్లవాత్మక ఆవిష్కరణకు తెరతీసింది. ఈ స్టేషన్లు పోలీసు సిబ్బంది లేకుండానే స్వీయ ఆధారిత సేవలు అందిస్తూ రోజుకు 24 గంటలు, వారం పొడవునా అందుబాటులో ఉంటుంది. సాంప్రదాయ పోలీస్ స్టేషన్లకు బదులుగా వేగవంతమైన, సురక్షితమైన, సంపూర్ణంగా డిజిటల్ ప్రత్యామ్నాయాన్ని అందిస్తాయి. ప్రతి స్మార్ట్ పోలీస్ స్టేషన్‌లో దుబాయ్ పౌరులకు ఎమిరైట్స్ ఐడీ, వర్యాటకులకు పాస్‌పోర్ట్‌తోనూ మొబైల్ నెంబర్‌కు ఎస్ఎంఎస్ పంపి గుర్తింపును ధ్రువీకరిస్తారు. స్కార్లు, ప్రింటర్ల వంటి సౌకర్యాలతో పత్రాలను పూర్తిచేసి, అవసరమైతే వీడియో ఇంటర్‌ఫేస్ ద్వారా విధుల్లో ఉన్న పోలీస్ అధికారిని కలవచ్చు, ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే ఎస్ఎంఎస్ ద్వారా రిఫరెన్స్ నెంబరు, రిసిప్ట్ వస్తుంది. తదుపరి చర్య కోసం ఫిర్యాదును తగిన పోలీసు విభాగాలకు పంపి, సులభంగా ట్రాక్ చేయడానికి వీలు కల్పిస్తుంది. అరబిక్, ఇంగ్లిష్, స్పానిష్, ఫ్రెంచ్, జర్మన్, రష్యన్, చైనా వంటి ఏడు భాషల్లో సేవలు అందుబాటులో ఉంటాయి. నాలుగు ప్రధాన విభాగాల్లో మొత్తం 45 డిజిటల్ సేవలు అందజేయనున్నాయి. 1. క్రిమినల్ సర్వీసులు చెక్ బౌన్సులు, కార్మిక సమస్యలు, అక్రమ రవాణా వంటి క్రిమినల్ వ్యవహారాలపై ఫిర్యాదు. నివాస భద్రత పర్యవేక్షణ కోసం రిక్వెస్ట్‌లు, అనుమానిత చర్యలపై సమాచారం వంటివి ఇందులో ఉంటాయి. 2. ట్రాఫిక్ సర్వీసులు రోడ్డు ప్రమాదాల నివేదిక, వాహనం రంగు మార్పు కోసం దరఖాస్తు, ట్రాఫిక్ స్టేటస్ సర్టిఫికెట్లు, ట్రాఫిక్ ఛలానాల చెల్లింపు. 3. సర్టిఫికెట్లు పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్లు, రాత్రివేళలో పనులు, రహదారి మూసివేతపై అనుమతులు తదితరాలు. 4. కమ్యూనిటీ సర్వీసులు: పర్యాటకుల లేదా ఈవెంట్ భద్రత సేవలకు అనుమతి కోసం దరఖాస్తు, 'లీడర్ ఎట్ యువర్ సర్వీస్' ద్వారా కమ్యూనిటీ ఫీడ్‌బ్యాక్ దుబాయ్ పోలీస్ శాఖలో ఉద్యోగావకాశాలు. గుండె సంబంధిత రోగులకు అత్యవసర సహాయం పోగొట్టుకున్న లేదా చోరీకి గురైన వస్తువులపై ఫిర్యాదు లేదా దొరికిన వస్తువులు అప్పగించడం. వ్యూహాత్మక విస్తరణ, అంతర్జాతీయ గుర్తింపు.. 2017లో సిటీ వాక్ వద్ద మొట్టమొదటి స్మార్ట్ పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించిన దుబాయ్.. క్రమంగా వీటిని విస్తరించింది. ప్రస్తుతం 27 పోలీస్ స్టేషన్లను నగర, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్నాయి. 2018లో అరేబియన్ రాంచెస్‌లో వాక్‌ఇన్ మోడల్ స్మార్ట్ పోలీస్ స్టేషన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. 2023 నాటికి వరల్డ్ ఐలాండ్స్‌లో ఫ్లోటింగ్ ఎస్పీఎస్ కోసం ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఈ మోడల్ ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల దృష్టిని ఆకర్షించింది. ఈ ప్రాజెక్ట్ దుబాయ్ జాతీయ కృత్రిమ మేధ వ్యూహానికి నేరుగా మద్దతు ఇస్తోంది. ప్రభుత్వ వ్యవస్థలను భవిష్యత్తుకు సిద్ధం చేయడం, డిజిటల్ సంసిద్ధత, ప్రజాసేవల సామర్థ్యాన్ని పెంచడమే లక్ష్యం. దుబాయ్ పోలీస్ కమాండర్ ఇన్ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ అబ్దుల్లా ఖలీఫా అల్ మర్రీ ఆధ్వర్యంలో ఈ కేంద్రాల విస్తరణ జరుగుతోంది. ప్రస్తుతం ఈ పోలీస్ సేవలు 89.6 శాతం డిజిటల్‌లో జరుగుతున్నాయి.



# ఆధునిక ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థను
## విజయవంతంగా పరీక్షించిన డిఆర్‌డిఒ

**భువనేశ్వర్, ఆగస్టు 25 :** అత్యాధునిక ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డిఫెన్స్ వెపన్ సిస్టమ్ (ఐఎడిడబ్ల్యుఎస్) తొలి విమాన పరీక్షలను రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఒ) విజయవంతంగా నిర్వహించింది. దేశీయంగా అభివృద్ధి చేసిన వాయు రక్షణ వ్యవస్థను శనివారం మధ్యాహ్నం 12.30 గంటలకు ఒడిశా తీరంలో పరీక్షించింది. వివిధ పొరలతో కూడిన వాయు రక్షణ వ్యవస్థ ఐసిడబ్ల్యుఎస్.. ఉపరితలం నుంచి గగనతలానికి క్షిపణులు, వాయు రక్షణ వ్యవస్థ క్షిపణులు, అధిక శక్తిగల లేజర్ ఆధారిత డైరెక్ట్ ఎనర్జీ వెపన్స్ వ్యవస్థను కలిగి ఉంది. ఈ నేపథ్యంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ డిఆర్‌డిఒ, సాయుధదళాలను ఎక్స్ వేదికగా అభినందించారు. ఐఎడబ్ల్యుఎస్‌ను ఈ నెల 23న 12:30 గంటలసమయంలో ఒడిశాతీరంనుంచి డిఆర్‌డిఒ విజయవంతంగా పరీక్షించిందని చెప్పారు.

# రాహుల్‌గాంధీకి ముద్దు పెట్టిన యువకుడు
## భద్రతాసిబ్బంది పట్టుకుని దేహశుద్ధి!

**పాట్నా, ఆగస్టు 25 :** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన ఓట్ చోర్ యాత్రలో కీలక ఘటన చోటు చేసుకుంది. బైక్ నడుపుతున్న రాహుల్ గాంధీకి ఒక యవకుడు ఆకస్మాత్తుగా వచ్చి ముద్దు పెట్టాడు. ఈ ఊహించని పరిణామంతో.. రాహుల్‌గాంధీతో పాటు ఆయన భద్రత సిబ్బంది ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. భద్రతా సిబ్బంది వెంటనే తేరుకుని.. ఆ ముద్దుపెట్టిన వ్యక్తిని గట్టిగా పక్కకులాగి.. రెండు కొట్టారు. అయితే యువకుడు ముద్దు పెట్టినా.. రాహుల్ గాంధీ మాత్రం తన బైక్‌ను ఆపకుండా ముందుకు సాగిపోయారు. ఈ ఘటన ఆదివారం పుర్ణియా జిల్లాలో చోటుచేసుకుంది. ఓట్ చోర్ యాత్ర పేరుతో రాహుల్ గాంధీ బిహార్‌లో యాత్ర చేపట్టిన సంగతి తెలిసిందే. ఆ క్రమంలో ఈ యాత్రకు విధుల్లో భాగంగా భద్రత కల్పిస్తున్న పోలీసులతోపాటు ప్రజలు సైతం తీవ్రంగా గాయపడుతున్నారు. ఈ నెల 16న ప్రారంభమైన ఈ యాత్ర.. సెప్టెంబరు 1న పాట్నాలో ముగియనుంది.

# సంక్షిప్తంగా..

## శ్రీలంక మాజీ అధ్యక్షుడు విక్రమసింఘేకు రిమాండ్

**శ్రీలంక, ఆగస్టు 25 :** ప్రభుత్వ నిధుల దుర్వినియోగానికి సంబంధించిన కేసులో శ్రీలంక మాజీ అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘేను సిఐడి పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. 2023 సెప్టెంబరులో లండన్‌లో జరిగిన తన సతీమణి స్నాతకోత్సవం కార్యక్రమానికి హాజరయ్యేందుకు ఆయన ప్రభుత్వ ఖర్చులతో ప్రయాణించారని ఆరోపణలు వచ్చాయి. ఈ కేసులో కొలంబో క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ ఆయనను ఈ నెల 22న అరెస్ట్ చేసి, కొలంబో ఫోర్ట్ మెజిస్ట్రేట్ కోర్టుముందు హాజరుపరిచింది. వాదనలువిన్న కోర్టు ఆయనకు బెయిల్ నిరాకరించి, రిమాండ్ నిమిత్తం మ్యాగజైన్ జైలుకు తరలించాలంటూ ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ముందు బెయిల్ ఇచ్చేందుకు అవసరమైన అంశాలను ఉంచడంలో న్యాయవాదులు విఫలమైనట్లు న్యాయస్థానం పేర్కొంది. అయితే, జైల్లో ఉన్న సమయంలో విక్రమసింఘేకు బిపి, షుగర్ స్థాయిలు పెరగడం వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తాయి. దీంతో ఆయనకు వైద్య పరీక్షల అనంతరం కొలంబో నేషనల్ హాస్పిటల్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో ఐసియులో చేర్చినట్లు అధికారులు తెలిపారు.

## బీహార్: ఓటర్ల జాబితాలో ఇద్దరు పాకిస్థానీలు



**పాట్నా, ఆగస్టు 25 :** దేశ రాజకీయాల్లో ప్రస్తుతం బీహార్ ఎన్నికలు చర్చనీయాంశంగా మారాయి. ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయంటూ కాంగ్రెస్ ఆరోపిస్తుండగా అంతా సవ్యంగానే ఉందని ఎన్నికల సంఘం చెబుతూ వస్తోంది. అయితే తాజాగా బీహార్‌లో ఇద్దరు పాకిస్తానీ మహిళలకు ఇటీవల ఓటరు కార్డులు జారీ కావడంతో కేంద్ర హోంశాఖ చర్యలకు ఉపక్రమించింది. వారి పేర్లను వెంటనే తొలగించాలని యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేసింది. ఇమ్రానా ఖానమ్ అలియాస్ ఇమ్రానా ఖాటూన్, ఫిర్దోషియా ఖానమ్ అనే ఇద్దరు మహిళలకు ఇటీవల ఓటరు కార్డులు జారీ అయ్యాయి. దీంతో కేంద్రం హోంశాఖ విచారణ చేపట్టింది. ఫిర్దోషియా 1956లో మూడు నెలల వీసాపై, ఇమ్రానా మూడేళ్ల వీసాపై భారత్‌కు వచ్చి, భాగల్పూర్ జిల్లాలోని భికన్‌పూర్‌లో స్థిరపడ్డారు. వీరికి ఓటర్ కార్డులు ఉండటాన్ని గుర్తించిన కేంద్రం విచారణ జరపాలని, ఓటర్ల జాబితాలో పేర్లు తొలగించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. దీంతో విచారణ ప్రారంభించినట్లు కలెక్టర్ డాక్టర్ నావల్ కిశోర్ చౌదరి చెప్పారు. ఆ ఇద్దరు మహిళలకు నోటీసులు పంపనున్నట్లు వెల్లడించారు.

## ఢిల్లీలో రూ.25 కోట్ల గంజాయి స్వాధీనం

**హైదరాబాద్, ఆగస్టు 25:** దేశ వ్యాప్తంగా గంజాయి స్మగ్లింగ్‌పై పోలీసు విభాగాలు ఉక్కుపాదం మోపుతున్నా స్మగ్లర్లు మాత్రం యధేచ్ఛ గా తమ వ్యాపారం కొనసాగిస్తూనే వున్నారు. భారత్‌కు చెందిన ఓ యువకుడు బ్యాంకాక్ నుంచి సింగపూర్ మీదుగా ఢిల్లీలోని ఇందిరా గాంధీ అం తర్జాతీయ విమానాశ్రయంలో ఈ నెల 21వ తేదీన రాత్రి సమయంలో దిగాడు. అతను విమానం దిగగానే మూడవ నంబర్ టర్మినల్ నుంచి బయ టకు వచ్చి గ్రీన్ ఛానల్ మార్గం ద్వారా బయటకు వెళ్లేందుకు యత్నించగా భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. అతని లగేజ్ బ్యాగ్‌లో 25 నలుపు రం గు పాలిథిన్ కవర్లలో అనుమానాస్పద వస్తువులు కనిపించడంతో భద్రతా సిబ్బంది తనిఖీలు చేయగా ఇది విదేశీ గంజాయిగా నిర్ధారణ అయ్యింది. వీటిని జప్తు చేసిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా తన నేరాన్ని అంగీకరించాడు. బ్యాంకాక్ నుంచి తాను దీనిని ఖరీదు చేసి భారత్‌లో విక్రయించేందుకు తెచ్చినట్లు నిందితుడు చెప్పాడని ఢిల్లీ పోలీసులు వెల్లడించారు.

## కాంగ్రెస్, బిజెపి ఉచ్చులో పడకండి: ప్రశాంత్ కిశోర్

**పాట్నా, ఆగస్టు 25 :** బీహార్ ప్రజలను కాంగ్రెస్, బిజెపి పార్టీలు తప్పుదోవ పట్టిస్తున్నాయని ఎన్నికల వ్యూహకర్త, జన్ సూరజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిశోర్ విమర్శించారు. ప్రజలు ఎదుర్కొంటున్న నిజమైన సమస్యలను వదిలేసి 'ఓట్ చోరీ'పైనే పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయని అన్నారు. ఆర్జేడి పార్టీ సూచనల ప్రకారమే రాహుల్‌గాంధీ నడుచుకుంటున్నాడు తప్ప బీహారీల సమస్యలపై ఆయన దృష్టి పెట్టడంలేదని మండిపడ్డారు. ఎన్నికల వేళ రాహుల్ గాంధీని నరేంద్ర మోడీ, నరేంద్ర మోడీని రాహుల్ గాంధీ పరస్పరం విమర్శించుకుంటున్నారని చెప్పారు. ఆ పార్టీల ఉచ్చులో పడొద్దంటూ ప్రజలకు పిలుపునిచ్చారు. బీహార్‌లో అసలైన సమస్యలు పేదరికం, నిరుద్యోగం, వలసలు, సరైన విద్యా సౌకర్యాలు లేకపోవడం.. వంటి వాటిని ప్రధాన పార్టీలు గాలికి వదిలేశాయని ప్రశాంత్ కిశోర్‌ఆరోపించారు. ప్రజలసమస్యలు పరిష్కరించేందుకు, ప్రధాన పార్టీలకు ప్రత్యామ్నాయంగా ప్రజలకోసం 'జన్‌సూరజ్ పార్టీ' ఆవిర్భవించిందని ప్రశాంత్ కిశోర్ పేర్కొన్నారు.

# ఉక్రెయిన్‌కు మరో 3350 అమెరికా క్షిపణులు
## ఆరువారాల్లో కీవ్‌కు చేరుకోనున్న ఆయుధాలు



**వాషింగ్టన్, ఆగస్టు 25:** ఉక్రెయిన్ గగనతల రక్షణ సామర్థ్యాన్ని పెంపొందించేందుకు మరో 3,350లకు పైగా ఎక్స్‌టెండెడ్ రేంజ్ అటాక్ మ్యూనిషన్ (ఇఆర్ఎఎం) క్షిపణులను ఆ దేశానికి అందించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ ఆమోదం తెలిపినట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు పేర్కొన్నాయి. ఈ ఆయుధ ప్యాకేజీకి యూరోపియన్ దేశాలు నిధులు సమకూరుస్తున్నట్లు తెలిపాయి. దాదాపు ఆరు వారాల్లో ఈ క్షిపణులు కీవ్‌కు చేరుకుంటాయని సమాచారం. అయితే 240 నుంచి 450 కి.మీ. పరిధి కలిగిన ఇఆర్ఎం క్షిపణులను రష్యాపైకి ప్రయోగించాలంటే ఉక్రెయిన్ పెంటగాన్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని అమెరికా అధికారులు పేర్కొంటున్నట్లు తెలుస్తోంది. ఉక్రెయిన్‌కు మరిన్ని ఆయుధాలను సరఫరా చేసే విషయాన్ని అమెరికా ప్రభుత్వం అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది. మరోవైపు రష్యా భూభాగంలోని లక్ష్యాలను ఛేదించడానికి అమెరికా రూపొందించిన లాంగ్‌రేంజ్ ఆర్మీ టాక్టికల్ మిస్సైల్ సిస్టమ్స్ (ఎటిఎసిఎంఎస్)ను వినియోగించకుండా పెంటగాన్ అడ్డుకుంటున్నట్లు పలు నివేదికలు సూచిస్తున్నాయి. మాస్కో చేపడుతున్న దాడులకు దీటుగా ఆయుధాలను ఉపయోగించకుండా కీవ్ సామర్థ్యాన్ని పరిమితం చేస్తోందని పేర్కొన్నాయి. యుద్ధం ముగింపునకు తాను ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ఇరుదేశాల నేతలు ముందడుగు వేయకపోవడంతో ట్రంప్ ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో కీవ్‌కు సహాయంగా అగ్రరాజ్యం పలుమార్లు పెద్ద మొత్తంలో ఆయుధ సరఫరా చేస్తున్న విషయం తెలిసిందే. ఉక్రెయిన్ 32.2 కోట్ల డాలర్ల విలువైన ఆయుధాలు, అత్యాధునిక క్షిపణులు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు అమెరికా విదేశాంగ శాఖ ఇటీవల ప్రకటించింది. ఈ నిర్ణయాన్ని అమెరికా చట్ట సభకు తెలియజేశామని తెలిపింది. ఇందులో 15 కోట్ల డాలర్లు అమెరికా ఇప్పటికే అమ్మిన ఆర్మర్డ్ వాహనాల నిర్వహణకు, 17.2 కోట్ల డాలర్లు ఉపరితం నుంచి గగనతలంలోకి ప్రయోగించే క్షిపణి వ్యవస్థల కొనుగోలుకు వినియోగిస్తారు. ఉక్రెయిన్ దారుణమైె దాడులకు గురవుతున్న కారణంగా కీవ్‌కు మరిన్ని ఆయుధాలు పంపుతున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో మరోసారి క్షిపణులను అందజేస్తున్నట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు పేర్కొన్నాయి.

## ప్రజా ఫిర్యాదులు-పరిష్కారం కోసం గుంటూరు పోలీసుల ప్రత్యేక వేదిక



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) : ప్రజలకు నేరుగా వినటానికి, సమస్యలకు పరిష్కారం చూపించడానికి గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం "ప్రజా ఫిర్యాదులు-పరిష్కార వేదిక" ఏర్పాటు చేయబడింది. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ప్రజల సమస్యలను స్వయంగా స్వీకరించి, తక్షణమే చర్యలు తీసుకునే విధంగా అధికారులకు సూచనలు ఇచ్చారు.

ప్రతీ ఫిర్యాదును పరిగణనలోకి తీసుకుని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, చట్ట పరిమితుల్లో నిర్ణీత సమయంలో పరిష్కారం చూపించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బాధితులకు న్యాయం కల్పించేలా కఠినంగా చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ప్రజలు భయాందోళన లేకుండా సమస్యలను చెప్పవచ్చని ఎస్పీ భరోసా ఇచ్చారు. రాతపూర్వక ఫిర్యాదులను సంబంధిత అధికారులకు అందజేసి చట్టపరంగా విచారణ జరిపి తగిన పరిష్కారం చూపాలని ఆదేశించారు. పీజీఆర్ఎస్ ద్వారా వచ్చిన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కుటుంబ కలహాలు, ఆర్థిక సమస్యలు, ఇతర సమస్యలపై ప్రజలు వినతులు సమర్పించారు. వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్తూ, వెంటనే పరిష్కారం కోసం చర్యలు ప్రారంభించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు జి.వి. రమణమూర్తి (అడ్మిన్), ఎ.హనుమంతు (ఏఆర్), మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పీ శ్రీనివాసరెడ్డి, పీజీఆర్ఎస్ సీఐ బిలాలుద్దిన్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ



○ మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన స్థానిక నాయకులు

మంగళగిరి టౌన్,(జర్నలిస్ట్ ఫైల్) : ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను టీడీపీ నాయకులు లబ్ధిదారులకు అందజేశారు. గండాలయపేటకు చెందిన గుంటి వీరాస్వామికి రూ. 52,543 వేలు, మార్కండేయకాలనీకి చెందిన మోరు సత్యవతికి రూ. 23,920 వేలు, ఇస్లాంపేటకు చెందిన ఖాజా మొయినుద్దీన్ కుమారుడు షేక్ గౌసియాకు రూ. 20,541 వేలు, టిడ్కో గృహసముదాయానికి చెందిన వెంగళ మల్లేశ్వరికి రూ. రూ. 37,836, వెజిటేబుల్ మార్కెట్ కు చెందిన తిరువీధుల పద్మవతికి రూ. 40,112వేలు, టిప్పర్లబజార్ కు చెందిన మొహమ్మద్ ఆసిఫ్ అహ్మద్ కు రూ. 42,500 వేలు, కొత్తపేట కు చెందిన బూదాటి మల్లీశ్వరి కి రూ. 87,226 వేలు, గాడిపర్తి క్రాంతి కి రూ. 28,437 వేలు, టిప్పర్ల బజార్ కు చెందిన షేక్ షరీఫున్ కు రూ. 27,341 వేలు, కూరగాయల మార్కెట్ ప్రాంతానికి చెందిన మంద్రు నిర్మల కు 20 వేల విలువైన చెక్కులు అందజేశారు. మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో నాయకులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి స్వయంగా చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకి దేవి,పట్టణ అధ్యక్షులు పడవల మహేష్, పట్టణ ఉపాధ్యక్షురాలు వాసా పద్మ, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, అబ్దుల్ మజీద్,షేక్ ఖదీర్ బాషా (బుజ్జి ), రంగిశెట్టి నరేంద్ర (బాబీ), గోవాడ దుర్గారావు, తాడిగిరి సుధీర్, షేక్ ఫిరోజ్, ఊట్ల దుర్గా మల్లేశ్వరి, వంగర హనుమాన్,వంగర సదాశివారావు,షేక్ అమీర్, సాయినాథామ్ శ్రీనివాసరావు, పందేటి మణికంఠ, కట్టదుర్గారావు, తెలు వెంకటేశ్వరరావు, అన్వర్ బాషా, షేక్ కరీముల్లా, ఇండ్ల రజని, నక్క రాజశేఖర్, పందిరి వెంకన్న,పొదిలి హరిబాబు,గుడిపూడి శివకృష్ణ,ఫణిదం మల్లేశ్వరరావు, రంగిశెట్టి పెద్దబ్బాయ్, కొరమట్ల రాజా, షేక్ సలీమ్,కొల్లి శ్రీనివాసరావు, ఉప్పు మహేష్,కాకి మల్లిఖార్జున రావు, గంజి శివ సుధా, సాల లీలావతి, పందిరి శ్రీ కన్య,షేక్ నీలోఫర్, పాతకోటి భాస్కర్, షేక్ బాబు, కగ్గా వెంకటరావు, కగ్గా కృష్ణ, బేతాళ కాంతారావు, చింతక్రింది వెంకటేశ్వరరావు, పాగోలు జయ ప్రకాష్, నందూరి పురుషోత్తం, హఫీజ్ ఖాన్ పఠాన్,రాజేంద్ర,సుభాని, తదితరులు పాల్గొన్నారు.

## పోలేరమ్మ అమ్మవారి హుండీ లెక్కింపు



కాకుమాను,(జర్నలిస్ట్ ఫైల్): మండల పరిధిలోని కొండపాటూరు గ్రామంలోవేంచేసి యున్న శ్రీ పోలేరమ్మ అమ్మవారి దేవస్థానమునందు హుండీలను లెక్కింపు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ ఈ ఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ హుండీ ఆదాయంగా 12,65,728/- రూపాయలు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో దేవాదాయ శాఖ బాపట్ల ఇన్స్పెక్టర్ గోపి, ఆలయ పూజారి మువ్వానాగేశ్వరరావు, గ్రామ పెద్దలు అయిన యర్రాకుల దానయ్య, పొన్నం వీరయ్య, ఫణి. భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ ,సి జి జి బి బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

## గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధికి మరో మైలురాయి

○ రూ.3.40 కోట్ల పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా ముందుకు సాగుతున్నాయి. సోమవారం 35వ డివిజన్‌లో సుమారు ?3.40 కోట్ల విలువైన సీసీ రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టుల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ ఈ రోజు 35వ డివిజన్‌లో రఘురామ్ హాస్పిటల్ నుండి కృష్ణనగర్ 2వ లైన్ వరకు, కృష్ణనగర్ 2వ లైన్ నుండి ఎన్టీఆర్ విగ్రహం వరకు, కుందుల రోడ్ నుండి పిఎఫ్ ఆఫీస్ రోడ్ వరకు, పిఎఫ్ ఆఫీస్ రోడ్ నుండి కృష్ణనగర్ మెయిన్ రోడ్ వరకు, కృష్ణనగర్ 5వ లైన్‌లో చర్చి నుండి యూనియన్ బ్యాంక్ వరకు, యూనియన్ బ్యాంక్ నుండి కృష్ణనగర్ మెయిన్ రోడ్ వరకు సీసీ రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టుల నిర్మాణం జరగనుంది. అదేవిధంగా TJPS కాలేజ్ రోడ్ పక్కన క్రిస్టినా నగర్ వద్ద సీసీ డ్రెయిన్ నిర్మాణం, పేవర్ బ్లాక్ పనులు చేపడుతున్నారు. మొత్తం ఈ పనుల అంచనా వ్యయం ?3.40 కోట్ల పనులకు శంకుస్థాపన చేయటం జరిగింది.

గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధి దిశగా ఈ కార్యక్రమాలలో ఒక కీలక ముందడుగవుతుందన్నారు. గతంలో కూడా రోడ్లు, డ్రెయిన్లు, శానిటేషన్, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలే ప్రజలకు అత్యంత అవసరమని, వాటి కోసం నిరంతరం కృషి చేస్తానని, పనుల నాణ్యత విషయంలో కాంట్రాక్టర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడకూడదన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు, కార్పొరేటర్ ఈరంటి వర ప్రసాద్,జనసేన అధ్యక్షుడు బాబు, పాకాలపాటి శ్రీకాంత్ మరియు ఎన్డీయే కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రత్తిపాడులో 29న మహిళా శక్తి ర్యాలీ



ప్రత్తిపాడు (జర్నలిస్ట్ ఫైల్): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం మహిళల అభ్యున్నతే ధ్యేయంగా తీసుకున్న తల్లికి వందనం, సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం వంటి హామీలను నెరవేర్చుతున్న నేపథ్యంలో ప్రత్తిపాడు మండల కేంద్రంలో ఆగస్టు 29న "స్త్రీ శక్తి" ర్యాలీ జరగనుంది. నందమూరి తారకరామారావు విగ్రహం వద్ద నుండి ప్రారంభమై, ఎంఆర్ఓ కార్యాలయం వరకు ఈ ర్యాలీ కొనసాగనుంది. ఈ ర్యాలీని విజయవంతం చేయాలని కోరుతూ గుంటూరు రూరల్ మండలం, కార్పొరేషన్ పరిధిలోని మహిళలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రతిపాడు ఎమ్మెల్యే డాక్టర్ బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు మహిళలకు ఆస్తిలో సమాన హక్కు, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించి మహిళల అభివృద్ధికి పునాది వేశారని గుర్తు చేశారు. ఆ ఆశయాలను కొనసాగిస్తూ చంద్రబాబునాయుడు దీపం పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్లు, డ్వాక్రా సంఘాల ద్వారా రుణాలు, పసుపు కుంకుమ ద్వారా ఆర్థిక సహాయం అందించారని, తాజాగా తల్లికి వందనం, సిలిండర్ల ఉచిత పంపిణీ, ఉచిత బస్ ప్రయాణం వంటి పథకాల ద్వారా మహిళల ఆర్థిక ప్రమాణాలను మెరుగుపరుస్తున్నారని వివరించారు. స్త్రీ శక్తి ర్యాలీ ద్వారా మహిళా శక్తిని ప్రపంచానికి చాటాలని, ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలని, ప్రతి మహిళ చంద్రబాబునాయుడు ప్రభుత్వానికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో ప్రతిపాడు నియోజకవర్గ మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి తాను ఎల్లప్పుడూ సహకరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా అధ్యక్షురాలు కాసంశెట్టి మాధవి, కార్పొరేటర్లు స్మిత పద్మజ, ఇతడి రత్నకుమారి, చిరుగురి సుశీల, జిల్లాధికార ప్రతినిధి కల్లూరి శ్రీనివాసరావు, రాష్ట్ర తెలుగు రైతు మీడియా కోఆర్డినేటర్ గింజుపల్లి వెంకటేశ్వరరావు, రాజుపాటి రామారావు, పొన్నగంటి శ్రీనివాసరావు, మండల మహిళా నేతలు, సర్పంచులు, ఎంపీటీసీలు, నేటి సంఘాల సభ్యులు, అనుబంధ కమిటీల ప్రతినిధులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## తెనాలిని జిల్లాగా ప్రకటించాలంటూ సబ్ కలెక్టర్‌కు వినతులు

○ రామలింగకవి జిల్లాగా నామకరణం చేయాలి



తెనాలి ,(జర్నలిస్ట్ ఫైల్) ఘనమైన చరిత్రగల తెనాలిని జిల్లాగా ప్రకటించాలని, తెనాలి రామలింగకవి జిల్లాగా నామకరణం చేయాలని తెనాలి పట్టణ పరిసర ప్రాంత అభివృద్ధి సంఘ కార్యవర్గం సబ్ కలెక్టర్ సంజనా సింహాకు వినతిపత్రం సమర్పించారు. అతిపెద్ద రెవెన్యూ డివిజన్ గా ఘనమైన చరిత్ర గల తెనాలిని, జిల్లాగా ప్రకటించడానికి, అన్ని అర్హతలు ఉన్నాయని అవసరమైన మౌలిక, వసతులు ఉన్నాయని, పాలకులు మనసు పెడితే, తెనాలి జిల్లా కావడం సులభమేనని, ఆ దిశగా తెనాలి ఘన చరిత్రను గుర్తించి జిల్లాగా ప్రకటించాలని, తెనాలి పట్టణం పరిసర ప్రాంత అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో సోమవారం సబ్ కలెక్టర్ సంజన సింహకు వినతి పత్రం సమర్పించారు. అనంతరం పట్టణ పరిసర ప్రాంతా అభివృద్ధి సంఘం నాయకులు మీడియాతో మాట్లాడుతూ తెనాలి జిల్లా కావడానికి ఉన్న మౌలిక సదుపాయాలను వివరించారు. విభిన్నమైన రంగాలలో తెనాలి ఉన్న ఖ్యాతిని వివరించారు. తెనాలి ప్రక్కనే ఉన్న వేమూరు నియోజకవర్గ ప్రజలు కూడా, తెనాలి జిల్లా కావాలనే కోరుకుంటున్నారని, వేమూరు, తెనాలి జిల్లాలో కలపాలని ఆలోచన ప్రజల్లో ఉందని, తెనాలి నియోజక వర్గానికి చెందిన ప్రజాప్రతి నిధులు, తెనాలిని జిల్లాగా నిలబెట్టుకునే విషయంలో చిత్తశుద్ధితో పనిచేయాలని, ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలని కోరారు. సబ్ కలెక్టర్ కు,వినతి పత్రం అందజేసిన వారిలో పట్టణ పరిసర ప్రాంతా అభివృద్ధి సంఘం అధ్యక్షులు దరిశి శివ కోటేశ్వరరావు, సోమయ్య శాస్త్రి, రావూరి శంకర్రావు, లక్కరాజు చిరంజీవి, ఈ పూరి నవీన్ చంద్, రాజేష్, సతీష్, నారాయణ కమలాకర్ తదితరులు ఉన్నారు.

## అర్జీలను గడువులో పరిష్కరించాలి - కమిషనర్ పులి శ్రీనివాసులు



గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) : ప్రజల సమస్యల పరిష్కారమే నగరపాలక సంస్థ ప్రధాన లక్ష్యమని, డయల్ యువర్ కమిషనర్, పిజిఆర్ఎస్ ద్వారా అందే అర్జీలను నిర్దేశిత గడువులో పరిష్కరించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు విభాగాధిపతులకు ఆదేశించారు. ప్రతి సోమవారం అర్జీల పరిష్కార పురోగతిపై ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

సోమవారం కమిషనర్ చాంబర్‌లో నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన 18 ఫిర్యాదులను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తక్షణమే పరిష్కరించగలిగినవి, కొంత సమయం పట్టేవి వేరు వేరుగా లిస్టు చేసి చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్జీల పరిష్కారం కోసం విభాగాధిపతులే క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, పురోగతిని ఎప్పటికప్పుడు కమిషనర్ కార్యాలయానికి నివేదించాలని ఆదేశించారు.

తరువాత కౌన్సిల్ హాల్లో జరిగిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుండి 33 అర్జీలు స్వీకరించబడ్డాయి. వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 16, ఇంజినీరింగ్ విభాగానికి 9, రెవెన్యూ విభాగానికి 4, ప్రజారోగ్య విభాగానికి 2, పరిపాలన విభాగానికి 1, అకౌంట్స్ విభాగానికి 1 ఫిర్యాదు అందాయి. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్, ఇతర వేదికల ద్వారా అందే అర్జీలను సమగ్రంగా పరిష్కరించాలని, వాటిని ర్యాండమ్‌గా స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామని స్పష్టం చేశారు. అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలని, అలా జరిగితే సంబంధిత సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అదనపు కమిషనర్‌ను ఆదేశించారు. ప్రతి విభాగంలో గ్రీవెన్స్ అర్జీల పరిష్కారానికి ప్రత్యేక సిబ్బందిని కేటాయించాలని సూచించారు. జిఎంసి పిఎంయు బృందం దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన అన్నారు. అర్జీ పరిష్కారం అనంతరం ఫిర్యాదుదారుడికి తప్పనిసరిగా సమాచారం అందించాలన్నారు.

కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ రాంబాబు, ఇంచార్జి ఎస్ఈ సుందరామిరెడ్డి, ఎంఓహెచ్(ఇంచార్జి) రామారావు, మేనేజర్ బాలాజీ బాష తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకే డీఎంఈ బాధ్యతలు కేటాయించాలి

○ బీసీ ఉద్యోగుల ఐక్య వేదిక

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ)గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న డాక్టర్ డీవీఎల్ నరసింహం రిటైర్ అవుతుండటంతో, ఆ పదవిని ఎవరికీ అప్పగించాలన్నదానిపై సంశయం నెలకొంది. ఈ నేపథ్యంలో డీఎంఈ అదనపు బాధ్యతలు బీసీ వర్గానికి చెందిన అధికారికే కేటాయించాలని బీసీ ఉద్యోగుల ఐక్య వేదిక డిమాండ్ చేసింది. కార్యనిర్వాహక అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి ప్రసాద్‌రావు నేతృత్వంలోని బీసీ ఉద్యోగుల ఐక్య వేదిక ప్రతినిధులు ముఖ్యమంత్రి, ఆరోగ్యశాఖ మంత్రికి వినతిపత్రం సమర్పించారు. ఉన్నతస్థాయి పదవుల్లో బీసీ అధికారులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా సమర్థులైన బీసీ అధికారులు ఉన్నప్పటికీ, ప్రశంసలందుకున్నా.. ఉన్నతస్థాయి పదవుల్లో అవకాశం ఇవ్వడం లేదని ఆరోపించారు. కనీసం డీఎంఈ అదనపు బాధ్యతలు కేటాయింపులోనైనా బీసీ అధికారులను పరిగణనలోకి తీసుకోవాలని సమాఖ్య విజ్ఞప్తి చేసింది. బీసీ వర్గానికి చెందిన సత్యకుమార్ ఆరోగ్యశాఖకు మంత్రిగా ఉన్నందున, ఈ సారి బీసీ అధికారికే ప్రాధాన్యం లభిస్తుందని ఉద్యోగులు నమ్మకం వ్యక్తం చేశారు. ఇక మొన్నటి ఎన్నికల్లో బీసీ ఉద్యోగులు, బీసీ వర్గం కూటమి విజయంలో కీలక పాత్ర పోషించిన విషయాన్ని గుర్తుచేస్తూ బీసీ సామాజిక వర్గానికి న్యాయం చేసేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు.

## తడి - పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలి



○ డ్రైనేజిల్లో చెత్త చెదారం పడవేయవద్దు

○ నగర కమిషనర్ అలీం బాషా

మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్): తడి–పొడి చెత్త, హానికరమైన చెత్తను వేరు వేరుగా చేసి చెత్త ఆటోలలో వేయాలని నగర కమిషనర్ అలీం బాషా అన్నారు. సోమవారం ఆయన నగరపాలక సంస్థ అధికారులతో కలిసి నగరంలోని క్లాప్ ఆటోల ద్వారా వచ్చే చెత్త డోర్ టు డోర్ సేకరణను పరిశీలించారు. పలు వార్డులలో తడి–పొడి చెత్త, హానికరమైన చెత్తను వేరు వేరుగా అందించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. మురుగునీటి కాలువల్లో చెత్తాచెదారం పడవేయడం వల్ల కాలువల్లో ఇరుక్కుపోవడంతో ఓవర్ ఫ్లో అయ్యే ప్రమాదం ఉందని, ప్రజలు అవగాహనతో వ్యవహరించాలన్నారు. చెత్త ఎక్కడపడితే అక్కడ వేయకుండా పారిశుధ్య సిబ్బందికి తడి, పొడి చెత్త వేరువేరుగా ఇవ్వాలని అన్నారు. కాలువల్లో బహిరంగ ప్రదేశాల్లో ఎవరైనా చెత్త వేస్తే జరిమానాలు విధించాలని అధికారులకు సూచించారు. పారిశుధ్య సిబ్బంది ప్రతిరోజూ క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని అన్నారు. పారిశుధ్య నిర్వహణకై ఏర్పాటు చేసిన ప్రత్యేక అధికారులు ప్రతినిత్యం పర్యవేక్షణ చేయాలని అన్నారు. అనంతరం కమిషనర్ అలీం బాషా కొలనుకొండ డంపింగ్ యార్డ్ ను పరిశీలించారు. డంపింగ్ యార్డ్ కు వచ్చే చెత్తను ప్రణాళిక బద్ధంగా జిందాల్ ప్లాంట్ కు తరలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డంపింగ్ యార్డ్ చుట్టూ మొక్కలు నాటాలని ఇతర అభివృద్ధి పనులు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. అనంతరం తాడేపల్లి గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్ ను పరిశీలించి అక్కడ ఏ విధంగా చర్యలు చేపట్టాలనే విషయంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీనివాసరావు, డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, ఉద్యాన శాఖ అధికారి రామారావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాము, అసిస్టెంట్ ఇంజనీర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## అధికారభాషా సంఘానికి మండలి వెంకటకృష్ణారావు పేరు పెట్టడం ఎంతవరకు సమంజసం



○ గిడుగు రామ్మూర్తి పంతులు, విశ్వనాథ సత్యనారాయణ, పేర్లు పరిశీలించండి

○ పోతావజుల పురుషోత్తమశర్మ

తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్) అధికార భాషా సంఘానికి గిడుగు శ్రీరామమూర్తి పంతులు, లేదా తొలి తెలుగు జ్ఞానపీఠ అవార్డు గ్రహీత విశ్వనాథ సత్యనారాయణ, వీరి ఇరువురిలో ఒకరి పేరును అధికార భాషా సంఘానికి పెట్టాలని, మండలి వెంకటకృష్ణారావు పేరు ఎంత మాత్రం సమంజసం కాదని ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సంఘ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోతావజుల పురుషోత్తమ శర్మ కూటమి పాలకులను కోరారు. సోమవారం పురుషోత్తమ శర్మ మీడియాతో మాట్లాడుతూ అధికార భాషా సంఘానికి దివంగత నేత మండలి వెంకటకృష్ణారావు పేరును ప్రకటించడం ఎంత మాత్రం సమంజసం కాదన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో విద్యాశాఖ మంత్రిగా మాత్రమే ఆయన పని చేశారనిఅన్నారు. తెలుగు భాషా వికాసం కోసం ఉన్నతమైన సాహిత్యం సేవలు అందించిన వారి పేర్లు పెట్టడం సమంజసం అన్నారు. అధికార భాష సంఘం విషయంలో రాజకీయాలతో ప్రమేయం లేకుండా, భాషా వికాసానికి పాటుబడిన వారి పేర్లు పెట్టడం ద్వారా భావితరాలు కూడా హర్షిస్తాయన్నారు. అధికార భాషా సంఘానికి మండలి వారి పేరు పెట్టడం అనాలోచిత నిర్ణయం అన్నారు. భాషాభివృద్ధికి కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు, రాయప్రోలు సుబ్బారావు ఇలా ఎందరో పెద్దలు శ్రమించారని, వారి పేరు వింటేనే భాష పులకరిస్తుందని, అటువంటి కీర్తిని తీసుకువచ్చిన మహనీయులలో గిడుగు రామ్మూర్తి పంతులు, విశ్వనాథ సత్యనారాయణ లను, పరిగణనలోకి తీసుకొని వారిలో ఒకరి పేరు అధికార భాషా సంఘానికి పెట్టడం ఎంతైనా సముచితంగా ఉంటుందన్నారు. ఆత్మగౌరవానికి ప్రతీకలైన రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బ్రాహ్మణ సమాజాన్ని, దృష్టిలో ఉంచుకుని, ఈ విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పునరాలోచన చేసి తెలుగు భాషా అభిమానులు గర్వించే నిర్ణయం తీసుకోవాలన్నారు.

## బడుగుల జీవితాల్లో వెలుగులు నింపిన బి.పి.మండల్ : కేసన శంకరరావు




మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్): అనాదిగా సామాజిక అన్యాయానికి గురైన వెనుకబడిన తరగతులకు చెందిన ఓబీసీల జీవితాలలో వెలుగులు నింపిన, బడుగుల ఆరాధ్య దైవం బి.పి. మండల్ అంటూ,ఆంధ్ర ప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు కొనియాడారు. ఆగస్టు 25,బిందేశ్వరి ప్రసాద్ మండల్ జయంతి సందర్భంగా, స్థానిక మంగళగిరి రాష్ట్ర కార్యాలయంలో వారి చిత్రపటానికి పలువురు బీసీ నేతలు పూలమాలలు వేసి,స్వీట్లు పంచుకుంటూ ఘనంగా వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేసన మాట్లాడుతూ, మండల్, బీహార్ లోని మధేపురాకు చెందిన ఓ భూస్వామ్య యాదవ కుటుంబ బిహారిలాల్ మండల్–సీతాపతి మండల్ దంపతులకు జన్మించారు. వారు ధనస్వామ్య కుటుంబంలో పుట్టినప్పటికీ,తన జీవితకాలమంతా అణగారిన వర్గాల అభ్యున్నతి కోసమే కృషి చేశారన్నారు. సోషలిస్టు భావజాలంతో పలు రాజకీయ పార్టీలలో పనిచేసి, పలుమార్లు ఎమ్మెల్యేగా,ఎంపీగా పేదలు–బడుగులకు సేవ చేశారన్నారు . 1968లో బీహార్ కు 7వ ముఖ్యమంత్రిగా, తన మంత్రివర్గంలో మొట్టమొదటిసారిగా అట్టడుగు వర్గాలకు చెందిన ఓబీసీలకు పెద్దపీట వేశారన్నారు. తన ఓబీసీ వర్గాలకు అన్యాయం జరుగుతుందన్న కారణంతో తన సీఎం పదవిని కూడా తృణప్రాయంగా త్యజించిన గొప్ప నాయకుడు వారన్నారు. వీరు మంచి పార్లమెంటేరియన్ గా, 2వ జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మన్ గా మంచి పేరు తెచ్చుకున్నారన్నారు. దేశవ్యాప్తంగా పర్యటించి,ఓబీసీల జీవన స్థితిగతులను అధ్యయనం చేసి, వారి సాధికారితకు ప్రతిపాదించిన 42 సిఫారసులతో ఆనాటి రాష్ట్రపతి జ్ఞాని జైల్ సింగ్ కు నివేదిక సమర్పించారన్నారు. మండల్ కమిషన్ నివేదికను ఒక దశాబ్దం పాటు ఇందిరాగాంధీ అటకెక్కించినప్పటికీ,ప్రధాని వీ.పీ. సింగ్ విద్య–ఉద్యోగాలలో ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ,మండల్ సిఫారసులను అమలు జరిపారన్నారు. దీనితో దేశవ్యాప్తంగా ఎందరో నిరుద్యోగ ఓబీసీ యువత మేలు పొందారన్నారు. బి.పి.మండల్ తన సిఫారసులలో జనాభాలో సగభాగంగా ఉన్న ఓబీసీల తో పాటు, ఓబీసీ మహిళలకు కూడా చట్టసభలలో రిజర్వేషన్లు ఉండాలని ప్రతిపాదించారన్నారు. అందుకే బిపి మండల్ స్ఫూర్తితో వారి ఆశయాల సాధన కోసం చట్టసభలలో ఓబీసీలకు రిజర్వేషన్లివ్వాలని,33 శాతం మహిళా రిజర్వేషన్లలో ఓబీసీ మహిళలకు సబ్– కోటానిస్తూ చట్ట సవరణ చేసి అమలు చేయాలన్న ప్రధాన డిమాండ్లతో గల్లీ నుండి ఢిల్లీ వరకు పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. అలాగే మిగిలిన 40 మండల్ కమిషన్ సిఫారసులను వెంటనే అమలు జరపాలని,ఇలా ఓబీసీల న్యాయమైన డిమాండ్ల సాధనకు ఓబీసీ సంఘాల నాయకులతో పాటు మొత్తం ఓబీసీ సమాజం నడుం బిగించి పోరాడాలని శంకరరావు పిలుపునిచ్చారు. ఇంకా ఈ జయంతి వేడుకలలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ శివరాం బాబాజీ, గుంటూరు జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్, సీనియర్ బీసీ నాయకులు కేసన కోటేశ్వరరావు,వాకా వెంకటేశ్వరరావు,ఏ.శ్రీనివాస్, జంజనం వరప్రసాద్, దానా గౌడ్, యువజన నాయకులు సిరాజ్,శివ, గోపి, నాగబాబు పలువురు బీసీ నాయకులు పాల్గొని మండల్ కు ఘనంగా నివాళులర్పించారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా? అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## మంత్రి లోకేష్ చొరవతో గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** వినాయక చవితి పండుగను పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా గణేష్ ఉత్సవ మండపాలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. వినాయక చవితి ఉత్సవ విగ్రహాలు ఏర్పాటు చేసే ప్రాంతాల్లో పందిళ్ళకు ఉచితంగా విద్యుత్ సౌకర్యం కల్పించాలని పలువురు నిర్వాహకులు మంత్రి నారా లోకేష్ ను కోరారు. దీనిపై స్పందించిన లోకేష్... ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 15వేల గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. గణేష్ ఉత్సవ పందిళ్ళకు ఉచిత విద్యుత్ అందించడానికి రూ. 25 కోట్లు ప్రభుత్వం భరించాల్సి ఉంది. రాష్ట్రంలోని కోట్లాది గణేష్ భక్తుల సౌలభ్యం దృష్ట్యా ఉచిత విద్యుత్ అందించేలా చూడాలని మంత్రి లోకేష్ చేసిన వినతిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ మేరకు ప్రత్యేకంగా జీ.ఓ విడుదలకు ఆదేశాలు జారీచేశారు. అలాగే రాబోయే విజయదశమి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసి దుర్గా దేవి మండపాలకి కూడా ఉచిత విద్యుత్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

## 185 వైద్యుల భర్తీకి నోటిఫికేషన్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో వైద్య సదుపాయాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం మరో అడుగు వేసింది. రోగుల అవసరాలకు అనుగుణంగా వైద్యుల పోస్టుల భర్తీకి వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంది. మంత్రి సత్యకుమార్ ఆదేశాల మేరకు ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా జిల్లా కేంద్రాల్లోని పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్లు, టెలిమెడిసిన్ హబ్స్‌లో పనిచేసేందుకు 155 మెడికల్ ఆఫీసర్ (ఎంబీబీఎస్) పోస్టులు భర్తీ చేయనున్నారు. అదే విధంగా 30 స్పెషలిస్టు వైద్యుల నియామకాలు కూడా చేపట్టనున్నారు. వీటిలో టెలిమెడిసిన్ హబ్స్‌లో 13 జనరల్ మెడిసిన్, 3 గైనకాలజీ, డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్లలో 14 చిన్న పిల్లల వైద్యుల పోస్టులు ఉన్నాయి. ఈ నియామకాలను ఒప్పంద విధానంలో చేపట్టనున్నారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులను వచ్చేనెల 10వ తేదీ వం-కు సమర్పించవచ్చని బోర్డు ప్రకటించింది. పూర్తి వివరాలు https://apmsrb.ap.gov.in/msrb/లో అందుబాటులో ఉన్నాయి.

## జీవితాన్ని మార్చే శక్తి చదువుకే ఉంది



- రీల్స్,షాట్స్ సినిమాల పిచ్చితో జీవితాన్ని వృధా చేసుకోవద్దు

**చల్లపల్లి (జర్నలిస్ట్ ఫైల్):** సమాజంలో ఉన్నతంగా జీవిస్తూ,భవిష్యత్తును తీర్చిదిద్దుకోవడానికి చదువు అత్యున్నత మార్గమని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు తెలిపారు. మెగా డీఎస్సీ ఫలితాలలో స్కూల్ అసిస్టెంట్ సోషల్ విభాగంలో జిల్లా స్థాయిలో ఆరవ ర్యాంకు సాధించిన పురిటిగడ్డకు ఎస్సీ వాడకు చెందిన పులివర్తి ప్రసాద్ ను సురేష్ బాబు సోమవారం సత్కరించారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ చదువు విలువ తెలుసుకొని ఎంచుకున్న లక్ష్యాల కొరకు నిబద్ధతతో కృషి చేస్తే చదువు మంచి జీవితాన్ని ఇస్తుందన్నారు. జీవిత ముఖచిత్రాన్ని మార్చగలిగే శక్తి చదువుకు ఉందన్నారు. నేటి యువత రీల్స్,షాట్స్ సినిమాలు పిచ్చితో విలువైన సమయాన్ని వృధా చేయటంతో పాటు జీవితాలను పాడు చేసుకుంటున్నారని అన్నారు. కుటుంబంలో ఒకరు ఉద్యోగం సాధించడం ద్వారా ఆ కుటుంబం యొక్క స్థితిగతులు మారిపోతాయన్నారు. పేదరికం తో పాటు అనేక ఇబ్బందులను అధిగమించి నిబద్ధతతో శ్రమించి జిల్లాస్థాయిలో అత్యున్నత ర్యాంక్ ద్వారా ఉద్యోగం సాధించిన ప్రసాదు నేటి యువతకు స్ఫూర్తిదాయకుడని సురేష్ బాబు కొనియాడారు.

## ఉపాధ్యాయుల అంతర్ జిల్లా బదిలీలకు జీరో సర్వీస్ అర్హత ఇవ్వడంపై ఏపీటీఎఫ్ హర్షం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఉపాధ్యాయుల అంతర్ జిల్లా బదిలీలకు దరఖాస్తు చేసుకొనుటకు కనీసం ఆయా క్యాడర్లలో రెండు సంవత్సరాల సర్వీసు ఉండాలని నిబంధన మొదట పెట్టడం జరిగింది. అయితే మే / జూన్ నెలల్లో పదోన్నతులు పొందిన వారికి ఈ నిబంధన వలన చాలామంది ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు దరఖాస్తు చేసుకునే అర్హత కూడా లేకుండా పోయింది. దీనిపై ఏపీటీఎఫ్ పక్షాన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారికి, విద్యాశాఖ ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ గారికి, కమిషనర్ వి.విజయరామరాజు గారికి జీరో సర్వీసు అర్హత కల్పించాలని ప్రాతినిధ్యం చేయడం జరిగింది. ఆ మేరకు లిజీరో సర్వీసులి పై అంతర్ జిల్లా బదిలీలు జరుపుటకు ప్రభుత్వం సుముఖతను తెలియజేసినందుకు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయ రాజు, ఎస్.చిరంజీవి ఒక ప్రకటనలో హర్షం తెలియజేశారు. అదేవిధంగా మున్సిపాల్టీలన్నింటినీ ఒకే యూనిట్ గా పరిగణలోకి తీసుకోవడంపై కూడా పునరాలోచన చేయాలని కోరారు.

**రివైజ్డ్ షెడ్యూల్:**

1) ఆన్లైన్ దరఖాస్తులు 24.08.2025 నుండి 27.08.2025 వరకు
2) ఎంఈఓ వెరిఫికేషన్ 25.08.2025 నుండి 28.08.2025 వరకు
3) డీఈఓ వెరిఫికేషన్ 26.08.2025 నుండి 29.08.2025 వరకు
4) పాఠశాల విద్యా డైరెక్టర్ కు సమర్పణ: 30.08.25 నుండి 31.08.2025 వరకు
5) డైరెక్టర్ కార్యాలయ పరిశీలన: 01.09.2025 నుండి 02.09.2025 వరకు ఉంటుందని పాఠశాల విద్య డైరెక్టర్ వి.విజయరామరాజు తెలియజేశారు.

## మార్కెట్లో చవితి మట్టి వినాయకుని ప్రతిమలు సిద్ధం..!

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** ఈనెల 27వ తేదీన వినాయక చవితి సందర్భంగా మార్కెట్లోకి అమ్మకానికి మట్టి వినాయకుని ప్రతిమలను వ్యాపారస్తులు అమ్మకాలకు సిద్ధం చేశారు. హైదరాబాద్ నుంచి మట్టి విగ్రహాలను దిగుమతి చేసుకొని విగ్రహాలకు నేచురల్ పెయింటింగ్స్ వేసి విగ్రహాలను అందంగా రూపొందిస్తున్నారు. 6 అంగుళాల నుండి మూడున్నర అడుగుల విగ్రహాలు తమ వద్ద అందుబాటులో ఉన్నాయని ఆత్మకూరు రోడ్డులో ఎల్బీనగర్ వద్ద వినాయకుని మట్టి ప్రతిమలు విక్రయిస్తున్న వ్యాపారి చెరుకుమల్లి శ్రీనివాస్ అంటున్నారు. కలకత్తాలో గంగానది మట్టితో తయారు చేసిన మట్టి వినాయకుని ప్రతిమలు హైదరాబాద్ లో దిగుమతి చేసుకుంటే, అక్కడి నుండి తాము కొన్ని మట్టి వినాయకులను తీసుకొని వచ్చి చవితికి అమ్మకాలు జరుపుకొని నాలుగు రూపాయలు సంపాదించుకుంటామన్నారు. ఈ ఏడాది అమ్మకాలు ఆశాజనకంగానే ఉన్నాయని శ్రీనివాస్ అంటున్నాడు.

# ప్రతిభ చూపిన ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్ విద్యార్థులు

- ఐఐటీ, నిట్, నీట్‌లో రాష్ట్రం నుంచి 55 మంది ఎంపిక
- సీఎం చంద్రబాబును కలిసి సంతోషాన్ని పంచుకున్న విద్యార్థులు
- వచ్చే ఏడాది నాలుగు రెట్ల ఫలితాలు రావాలని సీఎం ఆకాంక్ష
- సీట్లు పొందిన ఒక్కో విద్యార్థికి ప్రోత్సాహకంగా రూ.లక్ష





**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో చదివి ఈ ఏడాది ఐఐటీ, నిట్, నీట్‌లో విజయం సాధించిన విద్యార్థులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. ఐఐటీ, నిట్, నీట్‌లో సీట్లు సాధించిన 55 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసి రాష్ట్ర ప్రభుత్వం అందించిన ప్రోత్సాహానికి కృతజ్ఞతలు తెలిపారు. తమ సంతోషాన్ని ముఖ్యమంత్రితో పంచుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన ముఖ్యమంత్రి... మరింతగా కష్టపడి ఉన్నత చదువుల్లోనూ ప్రతిభ చూపాలని సూచించారు. భవిష్యత్‌ను ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవడంతో పాటు... రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

**ప్రోత్సహించండి... స్ఫూర్తి నింపండి :** ‘విద్యార్థులను అత్యుత్తమంగా తీర్చిదిద్దేలా సాంఘిక సంక్షేమ విద్యాసంస్థలు రూపుదిద్దుకోవాలి. రాష్ట్రంలోని విద్యార్థుల్లో ప్రతిభకు కొదవలేదు. వారికి సరైన వసతులు, ప్రోత్సాహం అందిస్తే ప్రపంచంలో అందరితో పోటీ పడే సత్తా ఉంది. ఇందుకు 55 మంది విద్యార్థులే నిదర్శనం. సాంఘిక సంక్షేమ విద్యాసంస్థల నుంచి జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు ఎంపికయ్యే విద్యార్థుల సంఖ్య వచ్చే ఏడాదికి నాలుగు రెట్లు పెరగాలి. ఇప్పుడు ర్యాంకులు సాధించిన విద్యార్థులు తాము చదువుకున్న పూర్వ విద్యాసంస్థకు వెళ్లి అక్కడ విద్యార్థుల్లో స్ఫూర్తి నింపాలి.’ అని ముఖ్యమంత్రి విద్యార్థులతో అన్నారు.

**356 మందికి శిక్షణ... 55 మంది ఎంపిక :** కర్నూలు జిల్లా చిన్నటేకూరు, ఎన్టీఆర్ జిల్లా కుంటముక్కల, గుంటూరు జిల్లా అడవి తక్కెళ్లపాడులోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఐఐటీ-నీట్ సెంటర్లలో వీరంతా కోచింగ్ తీసుకుని ర్యాంకులు సాధించారు. ఈ సెంటర్లలో జేఈఈ మెయిన్ అండ్ అడ్వాన్స్‌లో 176 మంది శిక్షణ పొందగా 129 మంది క్వాలిఫై అయ్యారు. నీట్‌కు 180 మంది కోచింగ్ తీసుకోగా 143 మంది క్వాలిఫై అయ్యారు. చివరగా ఐఐటీలో 12 మంది, నిట్‌లో 30 మంది, నీట్ ఎంబీబీఎస్‌లో 13 మంది విద్యార్థులు సీట్లు సాధించారు. మొత్తం 55 మంది విద్యార్థుల్లో 20 మంది విద్యార్థినులు ఉండటం విశేషం. వీరు కాకుండా బీడీఎస్‌లో మరో 14 మందికి సీట్లు వచ్చే అవకాశం ఉంది. జీఎఫ్‌టీఐ, సెంట్రల్ యూనివర్సిటీల్లో 19 మందికి సీట్లు లభిస్తాయి.

**ఈ ఏడాది కొత్తగా 7 కోచింగ్ సెంటర్లు :** ఈ ఏడాది కొత్తగా మరో 7 ఐఐటీ-నీట్ కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. కొత్తగా ఏర్పాటు చేసే సెంటర్లతో 1,411 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుంది. బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల కోసం ఎంతైనా ఖర్చు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి అన్నారు. సమావేశం చివరిలో ఐఐటీ, నిట్, నీట్‌లో సీట్లు సాధించిన విద్యార్థులకు మెమెంటోలు, ఒక్కో విద్యార్థికి రూ. లక్ష చొప్పున చెక్ స్వయంగా అందించి వారితో విడివిడిగా ఫోటోలు దిగారు. మొత్తం 55 మంది విద్యార్థులకు రూ. 55 లక్షలు ఇచ్చారు. విద్యార్థులు అంతా పేదరికం నుంచి వచ్చి ఉత్తమ ప్రతిభ చూపడంతో ముఖ్యమంత్రి సంతోషం వ్యక్తం చేశారు. భుజం తట్టి ఆల్ ది బెస్ట్ చెప్పారు. సమావేశం చివరిలో బోధనా సిబ్బంది, విద్యార్థులు ముఖ్యమంత్రితో గ్రూపు ఫోటో తీసుకున్నారు. ఈ సమావేశంలో మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, అధికారులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేసే వారికి పార్టీలో పెద్దపీట

- వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడి



**కాకినాడ, (జర్నలిస్ట్ ఫైల్):** కాకినాడ జిల్లా కచేరిపేట లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా పార్లమెంట్ విస్తృతస్థాయి సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకులు, నియోజకవర్గ స్థాయి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ముఖ్యపార్టీ కార్యకర్తలు విస్తృతంగా హాజరయ్యారు. కాకినాడ పార్లమెంటరీ నియోజకవర్గం అభివృద్ధి దిశగా పార్టీ తలపెట్టిన కార్యక్రమాలు, జిల్లాలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాల పై పార్టీ నాయకులతో వివరంగా చర్చించారు. జిల్లా పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు ఎంపికపై ప్రతిపాదనలను మంత్రి అచ్చెన్నాయుడు స్వీకరించారు. ఆయా కమిటీల ఎంపికపై క్షేత్రస్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు గారు మాట్లాడుతూ గ్రామ స్థాయి నుండి పార్లమెంటరీ స్థాయి వరకు పార్టీ బలోపేతానికి అందరూ ఏకమై పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్ స్థాయి కార్యకలాపాలలో క్రమబద్ధత, సమన్వయం అవసరమని, కొత్తగా నియమించబడిన మెయిన్ కమిటీ మరియు అనుబంధ కమిటీ సభ్యులు పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేయాలని సూచించారు. రాబోయే రోజుల్లో పార్టీ బలం గ్రామాల నుండి పార్లమెంట్ స్థాయికి మరింత విస్తరించడమే ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ సమావేశం ద్వారా పార్లమెంట్ స్థాయి నాయకత్వం బలపడుతుందని, కార్యకర్తలకు మరిన్ని అవకాశాలు లభిస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యకర్తల కష్టసాధ్యమైన పోరాటం ద్వారానే పార్టీ విజయాలు సాధిస్తుందని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం అహర్నిశలు శ్రమించే నాయకుల వివరాలను అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లి ఆయా కమిటీల్లో కీలక బాధ్యతలు అప్పగిస్తామని హామీ ఇచ్చారు. కమిటీల నియామకాలపై పార్టీ నాయకులు, కార్యకర్తల ప్రతిపాదనలను పార్లమెంట్ పరిశీలకులు అధ్యయనం చేసి అధిష్టానానికి నివేదిస్తామన్నారు. అనంతరం కమిటీల ఏర్పాటులో ఎవరికి స్థానం కల్పించాలనే విషయంలో పార్టీ అధిష్టానం తుది నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. పార్టీ కోసం క్రమశిక్షణ, అంకితభావంతో పని చేసే నాయకులకు రాష్ట్ర ముఖ్యమంత్రి, తెదేపా అధినేత నారా చంద్రబాబు గారు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రివర్యులు నారా లోకేష్ గారు ఎల్లప్పుడూ పెద్దపీట వేస్తారని అన్నారు. కార్యకర్తే అధినేత అని భావిస్తూ, కార్యకర్తలను నాయకులుగా తీర్చిదిద్దే ఏకైక పార్టీ తెలుగుదేశం అని మంత్రి అచ్చెన్నాయుడు తెలియజేశారు.

15.

## మంత్రి లోకేష్ సొంత నిధులతో నిర్మించిన కర్మకాండల సత్రం ప్రారంభం

- రూ. 8 లక్షలతో నిర్మించిన కర్మకాండల సత్రంను ప్రారంభించిన కూటమి నాయకులు



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేష్ సొంత నిధులతో సీతానగరంలోని పుష్కర ఘాట్ వద్ద నిర్మించిన కర్మకాండల సంత్రంను కూటమి నాయకులు సోమవారం ప్రారంభించారు. స్థానిక ప్రజల అభ్యర్థన మేరకు మంత్రి నారా లోకేష్ సుమారు రూ. 8 లక్షలతో కర్మకాండల సత్రం నిర్మించారు. సత్రంలో తగిన సదుపాయాలను కూడా ఏర్పాటు చేశారు. అడిగిన వెంటనే సొంత నిధులతో సత్రం నిర్మించినందుకు స్థానిక ప్రజలు మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు మాట్లాడుతూ కర్మకాండల సత్రం నిర్మాణంతో నియోజకవర్గ ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. మంత్రి నారా లోకేష్ మంగళగిరి ప్రజలకు అన్ని రకాలుగా అండగా ఉంటున్నారని అన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు సొంత నిధులు వెచ్చించి ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. గత వైసీపీ పాలనలో అంత అరాచకం, దౌర్జన్యాలు జరిగాయని అన్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు, వేలకోట్ల అభివృద్ధికి నిధులు తీసుకొచ్చి ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షులు అంబటి తిరుపతిరావు, బిజెపి పట్టణ అధ్యక్షులు వల్లూరు శివరామకృష్ణ, తాడేపల్లి పట్టణ టీడీపీ ప్రధాన కార్యదర్శి ధారదాసు, మేకా పుల్లారెడ్డి, నాయకులు ఇట్టా పేంచలయ్య, అద్దంకి మురళి, దానిబోయిన సుందరరావు యాదవ్, దొంతి రెడ్డి సాంబిరెడ్డి, షేక్ నాగులు మీరా, ఇట్టా భాస్కర్, తాడిబోయిన భాస్కర్, షేక్ మస్తానయ్య, కోయ్యగూర మహాలక్ష్మి, అన్నెం కుసుమ, పి కృష్ణవేణి, ఉయ్యాల శ్రీనివాసరావు, షేక్ చాంద్ బాషా, షేక్ సైదా, వల్లభపురం పీటర్ పాల్, గోలి సౌరి, గాడి సాంబశివరావు, పోతాబత్తుల శ్రీనివాసరావు, జి నాగేశ్వరావు, పుల్లెపు భాస్కర్ రావు, చొంగల హరినాద్, బండి సాంబిరెడ్డి, కొర్రపాటి విజయ్, బోల్లెద్దుల మరియన్నా జి.ఆంకాల రావు, గాజుల కృష్ణ, చుంచు లక్ష్మి నారాయణ, కంచర్ల శివప్రసాద్, బెజ్జం బాబురావు, దుర్గారావు, తాడిబోయిన గోపి, కే సాయిచంద్, సైకం సాంబయ్య, పి హనుమంతు, సంక్రాంతి అశోక్,అంజలి, విశాల తదితరులు పాల్గొన్నారు.

## కాటూరి వారి కళానైపుణ్య ఆకృతులు బంగారం కంటే మిన్న

- సంస్కారభారతి జాతీయ ప్రధానకార్యదర్శి అభిజిత్ గోఖలె



**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** బంగారు నగ తయారు చేసే సమయంలో, నగ అందంగా ఉండేందుకు ఎంత శ్రద్ధ వహిస్తారో, అదేవిధంగా ఇనుప వ్యర్ధాలను అతకడంలో, కాటూరి శిల్పులు తీసుకుంటున్న శ్రద్ధతో,వారి కళానైపుణ్యం వల్ల వెలుగుచూసే ఆకృతులలో, జీవకళ ఉట్టిపడటంతో బంగారం కంటే మిన్న అనే భావన వ్యక్తమవుతుందని, అఖిల భారత సంస్కార భారతి కార్యనిర్వాహక ప్రధాన కార్యదర్శి అభిజిత్ గోఖలే కాటూరి శిల్పులను ప్రశంసించారు. సంస్కారభారతి ప్రచార కార్యాచరణలో విజయవాడ వచ్చిన అభిజిత్ గోఖలె, కాటూరి ఆర్ట్ గ్యాలరీ గురించి తెలుసుకున్న క్రమంలో సోమవారం అభిజిత్ గోఖలే, ఆటోనగర్ ప్రక్కనే ఉన్న కాటూరి ఆర్ట్ గ్యాలరీని సందర్శించారు. సంస్కార భారతి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ కృష్ణ,ప్రధాన కార్యదర్శి రామ్ కుమార్, రాష్ట్ర చిత్రకళ సంయోజక్ అల్లు రాంబాబులతో కలిసి, ఆర్ట్ గ్యాలరీ లోని ప్రతి ఆకృతిని సునిసితంగా పరిశీలించారు. గౌతమబుద్ధుడు, చత్రపతి శివాజీ విగ్రహాలకు పువ్వులు సమర్పించారు. ఆర్ట్ గ్యాలరీలోని ప్రతి ఆకృతి సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం మూడు టన్నుల ఐరన్ వ్యర్ధాలతో తయారుచేసిన భారీ, వృషభ, ఆకృతిని, అభిజిత్ గోకలే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాటూరి ఆర్ట్ గ్యాలరీ వ్యవస్థాపకులు కళారత్న కాటూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తమ భవిష్యత్ కార్యాచరణను వివరించారు. భారతదేశంలో కాటూరి ఆర్ట్ గ్యాలరీ ఓ ప్రత్యేకతను సంతరించుకునే విధంగా తమ కార్యచరణను సిద్ధం చేసుకుంటున్నట్లు తెలిపారు. గిన్నిస్ బుక్ నిర్వాహకులు కూడా తమ ప్రయత్నాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. భారత దేశ చిత్రకళా సంపుటిలో, కాటూరి ఆర్ట్ గ్యాలరీకి ఓ పేజీ ఉండాలనే లక్ష్యంతో, అద్భుతాల ఆవిష్కరణ కార్యాచరణతో ముందుకు వెళుతున్నామని తెలిపారు. సంస్కార భారతి జాతీయ ప్రధాన కార్యదర్శి అభిజిత్ గోఖలే మాట్లాడుతూ కాటూరి శిల్పులు వ్యర్ధాలతో తయారు చేసే ఆకృతులు అర్థవంతంగా, జీవకళ ఉట్టిపడేలా ఉన్నాయన్నారు. చత్రపతి శివాజీ జీవితంలో ఎదుర్కొన్న సమస్యల క్రమంలో ఆయన శరీరం ఒక లోహంలా తయారైందని, కాటూరి ఆర్ట్ గ్యాలరీలో చత్రపతి శివాజీ విగ్రహం అదే స్ఫూర్తిని ఇస్తుందన్నారు. చత్రపతి శివాజీ, సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహాలే కాకుండా, మన పురాతన సంస్కృతి సాంప్రదాయాలు, మన ఆరాధకులను కాటూరి శిల్పులు అద్భుతంగా మలిచారని ప్రశంసించారు. సమాజ హితం కోరే విభిన్న కళల ఉద్ధరణ కోసం, సంస్కార భారతి ద్వారా తమదైన కార్యాచరణతో ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్ట్ గ్యాలరీ నిర్వాహకులు సంస్కార భారతి అతిధులను సాదరంగా సత్కరించారు.

## డీఎస్సీతో నిరుద్యోగుల కల సాకారం



- సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ కు ప్రత్యేక ధన్యవాదాలు
- డీఎస్సీ ఆపాలన్న జగన్ కుట్రలను తిప్పికొట్టాం
- గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** కూటమి ప్రభుత్వం యువతకు ఇచ్చిన మాట ప్రకారం 16,347 టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీనిర్వహించడం నిరుద్యోగులకు కలలు సాకారం చేయడమేనని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ విజయవంతం అమలు చేసిన సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ కు సోమవారం పత్రిక ప్రకటనలో ఎమ్మెల్యే నసీర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇక ప్రతి ఏటా డీఎస్సీ నిర్వహిస్తామని మంత్రి లోకేశ్ చెప్పడం దేశ చరిత్రలోనే ఏపీని విద్యా రంగంలో సముచిత స్థానంలో నిలబెడుతుందని పేర్కొన్నారు. యువత బాగుపడటం ఇష్టంలేని జగన్మోహన్ రెడ్డి మెగా డీఎస్సీని ఆపేందుకు 24 కేసులు వేశారని మండిపడ్డారు. 2014-19 మధ్య 2 డీఎస్సీలు జరిపి 18 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తే..టీడీపీ ప్రభుత్వం సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో 13 డీఎస్సీల ద్వారా 1,80,208 పోస్టులిచ్చి చరిత్ర సృష్టించినట్లు పేర్కొన్నారు. ఎన్ని కుట్రలు చేసినా యువతకు మంచి చేయాలనే లక్ష్యంతో డీఎస్సీని పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు మౌలిక వసతులతోపాటు ప్రతి తరగతికి ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. 2019 ఎన్నికలకు ముందు రాష్ట్రంలో 2 లక్షల 30 వేల ఉద్యాగాలు ఖాళీగా ఉన్నాయని, టీచర్ పోస్టులు 23 వేలకుపైగా ఖాళీగా ఉన్నాయని తెలిపారు. డీఎస్పీ పేరిట జగన్ యువతకు మోసం చేశారని మండిపడ్డారు. గౌరవప్రదమైన వృత్తిలో ఉన్న గురువులను మద్యం దుకాణాల ముందు కాపలా పెటించిన దుర్మార్గానికి ఒడిగట్టింది జగన్ కాదా అని ప్రశ్నించారు. సిఫార్సు బదిలీల పేరుతో రూ. 50 కోట్లు అక్రమంగా లాగేసుకున్నది నిజం కాదా అని నిలదీశారు. కూటమి ప్రభుత్వంలో విద్యా రంగానికి ఉజ్వల భవిష్యత్తు వచ్చిందని పేర్కొన్నారు.

## టీచర్లపై గుదిబండగా మారిన అసెస్మెంట్ బుక్లెట్

- అసెస్మెంట్ బుక్లెట్ విధానాన్ని సరళీకరించాలి
- పునరావృత ఎంట్రీలు (బుక్లెట్ రిజిస్టర్ ఆన్లైన్) రద్దు చేయాలి
- ముఖ హాజరు విధానం పునరాలోచించాలి
- పరీక్షలపై ప్రయోగాలు మానుకోవాలి
- నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలోని ఉపాధ్యాయులు ప్రస్తుతం అసెస్మెంట్ బుక్లెట్ మూల్యాంకన విధానం కారణంగా తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కరణం హరికృష్ణ, మాగంటి శ్రీనివాసరావు లు ఆవేదన వ్యక్తం చేస్తూ.. సరళీకృతం చేయాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులకు ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల స్థాయిని అంచనా వేసేందుకు రూపొందించిన ఈ బుక్లెట్‌లో ఉన్న విధానాలు ఉపాధ్యాయులపై అదనపు పని భారాన్ని మోపుతున్నాయని పేర్కొన్నారు. “బరువైన బుక్లెట్లు - గుదిబండలా భారం” గా మారాయని వివరించారు. టూల్ 1,2,3,4 ప్రకారం మార్కులు నమోదు చేయాలి. మొదట బుక్లెట్‌లో నమోదు చేసి, మళ్లీ పర్సనల్ రిజిస్టర్ సీసీఈ రిజిస్టర్ చివరగా ఆన్లైన్ పోర్టల్ లోనూ ఎంట్రీ చేయాల్సి ఉందన్నారు. ఒకే డేటాను మళ్లీ మళ్లీ నమోదు చేయడం ఉపాధ్యాయులకు భయంకర భారంగా మారుతోందని విశ్లేషించారు . బబ్లింగ్ విధానంలో భాగంగా టూల్ మార్కుల కోసం బబ్లింగ్ విధానం అమలు చేస్తున్నారు. ఇది సమయ వృథా చేయడమే కాకుండా, ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతోందని టీచర్లు అభిప్రాయపడుతున్నారని తెలిపారు. మహిళా ఉపాధ్యాయులు పాఠశాలలో పూర్తి చేయలేక, ఇంటికీ బుక్లెట్లు మోసుకెళ్లి దిద్దుకోవాల్సి వస్తోందని విశదీకరించారు. వారి భర్తలు సైతం ఈ పనిలో సహకరించాల్సిన పరిస్థితి ఏర్పడిందని సోదాహరించారు. రెండు రోజుల్లో పూర్తయ్యే మూల్యాంకనం ఇప్పుడు వారం, పది రోజులు పడుతోందన్నారు. దీంతో ఉపాధ్యాయులు సిలబస్ పూర్తి చేయలేక మానసిక ఒత్తిడికి లోనవుతున్నట్లు వివరించారు. అసెస్మెంట్ బుక్లెట్ విధానాన్ని సరళీకరించాలి. పునరావృత ఎంట్రీలు (బుక్లెట్ రిజిస్టర్ ఆన్లైన్) రద్దు చేస్తూ..పరీక్షలపై ప్రయోగాలు మానుకోవాలని కోరారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467